

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 18-5-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 49 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: పంచమి ఉ.5.58 తదుపరి షష్ఠి, నక్షత్రం: ఉత్తరాషాఢ రా.6.52 తదుపరి శ్రవణం, వర్జ్యం: రా.10.58- 12.36, దుర్ముహూర్తం: సా.4.54 - 5.45, అమృతఘడియలు: మ.12.09 1.50, రాహుకాలం: సా.4.30 - 6.00 , సూర్యోదయం: 5.45, సూర్యాస్తమయం: 6.37 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తెంపరి ట్రంప్‌తో తిప్పలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న ప్రకటనలు మన ప్రయోజనాలకు ముప్పుగా పరిణవించాయి. భారత్‌తో పోల్చితే చైనా వైపే ట్రంప్ చూడటం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. మన ప్రధాని మోదీని తెలివైనవారు అని ప్రశంసించిన ట్రంప్ ఇప్పుడు చేస్తున్న ప్రకటనలతో మోదీని ఇబ్బందుల్లోకి నెడుతున్నారు.

ఆధునిక యుగంలో యుద్ధాలు వాంఛనీయం కాదు. జటిలమైన సమస్యనైనా చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవచ్చు. అణ్వాయుధాలున్న రెండు దేశాల మధ్య పూర్తి స్థాయి యుద్ధం జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఇలాంటి సందర్భాలలో ఉభయులకూ కావల్సిన దేశాలు మధ్యవర్తిత్వం నెరపడం కొత్త కాదు. యుద్ధరంగంలో తలమునకలై ఉన్న దేశాలతో నిమిత్తం లేకుండా రాజీకి చొరవ తీసుకున్న దేశాధినేతే ప్రకటన చేయడం ఇబ్బందిగా మారింది. అగ్రరాజ్యం మోచేతి కింద నీళ్లు తాగుతూ బతికే దేశాల విషయంలో ఇలా జరిగితే జరగవచ్చుగానీ, ప్రపంచంలోనే తృతీయ ఆర్థిక శక్తిగా ఎదగడానికి పరుగులు తీస్తున్న భారత్‌వంటి దేశం విషయంలో మన ప్రమేయం లేకుండా ప్రకటన రావడం అవమానకరంగా దేశ పౌరులు భావిస్తున్నారు.


కొత్త పలుకు

అమెరికాతో వాణిజ్య సంబంధం లేకపోతే ప్రపంచ దేశాలు మనుగడ సాగించలేవు అన్నట్టుగా ట్రంప్ తెంపరితనం ప్రదర్శిస్తున్నారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశాన్ని 35 కోట్ల జనాభా ఉన్న అమెరికా నియంత్రించాలని అనుకోవడం ఏమిటి?

మామూలుగా అయితే దేశాధినేతలు హుందాగా ప్రవర్తిస్తారు. అయితే, డొనాల్డ్ ట్రంప్ స్టయిలే వేరు. రెండవ పర్యాయం అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన తానొక అగ్రరాజ్యాధి నేతలా కాకుండా సాదాసీదా నాయకుడిగా ఎడాపెడా ప్రకటనలు చేస్తూ నోటికి పని చెబుతున్నారు.

ఇతర దేశాధినేతలు తనకు సబార్డినేట్స్ అన్నట్టుగా ట్రంప్ వ్యవహరిస్తున్నట్టు ఇతర దేశాధినేతలు కూడా వ్యవహరించాలని కోరుకోలేం. బహుశా ఈ కారణంగానే కాబోలు ప్రధాని మోదీ గుంభనంగా ఉంటున్నారు. అమెరికా ఒక పిచ్చివాడి చేతికి చిక్కిందన్న భావన ప్రజల్లో కూడా వ్యాపిస్తోంది. అమెరికా వంటి దేశానికి ఇలాంటి చౌకబారు నాయకుడా? అని ఈసడించుకొనే పరిస్థితి ఏర్పడింది.

పాక్‌ను చిత్తుగా ఓడించవచ్చని ప్రజలు భావిస్తున్నారుగానీ, పాక్ వెనుక చైనా ఉందని విస్మరిస్తున్నారు. యుద్ధం ముదిరితే చైనా ప్రత్యక్షంగా మరింత బలంగా పాక్‌కు బాసటగా నిలిచేది. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్‌కు విరామం ప్రకటించడం మంచిదే.

రాష్ట్రాల బిల్లులను నిర్దుష్ట కాల వ్యవధిలోపే గవర్నర్లుగానీ, రాష్ట్రపతిగానీ ఆమోదించడమా లేదా తిరస్కరించడమా? ఏదో ఒకటి చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆక్షేపణ తెలుపుతూ రాష్ట్రపతి ముర్ము లేఖ రాశారు. బిల్లులను ఇలా పెండింగ్‌లో పెడతారని రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరు.

చట్ట సభలు ఆమోదించిన బిల్లులను పెండింగ్‌లో పెట్టుకోవడం కూడా సమర్థనీయం కాదు. అలాంటి బిల్లులు ఏవైనా రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంటే వాటిని తిప్పి పంపే అధికారం గవర్నర్లకు ఉంటుంది. గవర్నర్లు ఆ పని చేయకుండా నెలలు, ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడితే చట్టసభల స్వతంత్ర ప్రతిపత్తిని హరించడమే అవుతుంది కదా?

ట్రంప్ నోట మళ్లీ జీరో టారిఫ్!



భారత్ సుంకాలను 100% తగ్గించనుందని పునరుద్ఘాటన.. గతంలోనే తోసిపుచ్చిన భారత్

పాలస్తీనా ప్రజలంతా లిబియాకు?

ట్రంప్ యంత్రాంగం కసరత్తు చేస్తున్నట్టు ప్రచారం

గాజాను అభివృద్ధి చేస్తానని గతంలో ట్రంప్ ప్రకటన

మాతృభూమిని రక్షించుకునేందుకు..

ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమన్న హమాస్ 7

మహిళల ఓట్లు మాకే

మళ్లీ అధికారం మాదే.. కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక కార్డులు

బడాబాబులు రుణాలు ఎగ్గొడుతున్నారు

మహిళలు క్రమశిక్షణతో తిరిగి చెల్లిస్తున్నారు

సహాయక సంఘాలకు రూ.లక్ష కోట్లు ఇస్తాం

ఆర్టీసీలో నడుపుకొనేందుకు మరో 600 బస్సులు

నియోజకవర్గ కేంద్రాలకూ వి-హబ్ విస్తరణ

నాలుగు జిల్లాల్లో 'విమెన్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్'

వి-హబ్ స్టార్టప్ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

డ్రగ్స్ కట్టడిలో రాష్ట్రానికి అవార్డుపై సీఎం హర్షం

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 90 లక్షల మంది మహిళలు కాంగ్రెస్‌కు ఓటేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కోటి మంది ఆడపడచులు తమకే ఓటేస్తారని, వారి ఓట్లతో రెండోసారీ కాంగ్రెస్సే అధికారంలోకి వస్తుందని అన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన విమెన్ ఆంత్రప్రెన్యూర్స్ హబ్ (వి-హబ్) రాష్ట్ర స్థాయి స్టార్టప్ సదస్సు శనివారం హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి.. వ్యాపార ఆలోచనలున్న

మిగతా 14వ పేజీలో...


వి-హబ్ స్టార్టప్ సదస్సులో మహిళా ఆంత్రప్రెన్యూర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి

త్వరలో మంత్రివర్గ విస్తరణ

ఈ నెలాఖరున లేదా జూన్ తొలివారంలో..

26 లేదా 27న పీసీసీ కార్యవర్గం ఖరారు

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాల కట్టడికి చట్టంపై కసరత్తు : మహేశ్‌గౌడ్ 13

ఏంటి... అంత ఖర్చవుద్దా!

నిజంగా రోజుకి అంతమంది ప్రయాణిస్తారా ?

మెట్రో రెండో దశ పార్ట్-ఏ డీపీఆర్‌పై కేంద్రం సందేహాలు !

లోపాలు సరిచేయాలని హెచ్ఏఎంఎల్‌కు సూచన

అనుమతుల జారీ మరింత జాప్యం 14


అందంగా.. గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో సుందరీమణులు



ఆటవిడుపు!

గచ్చిబౌలి స్టేడియంలో సందడిగా మిస్ వరల్డ్ స్పోర్ట్స్ డే

స్ప్రింట్, షాట్‌పుట్, బ్యాడ్మింటన్, ఫిట్‌నెస్ రన్, చెస్ పోటీలు.. మిస్ ఎస్టోనియా ఎలిస్ రాండ్మాకు స్వర్ణం

రామోజీ ఫిలింసిటీ సందర్శన.. బాహుబలి కుర్చీలో సెల్ఫీలు.. నేడు సచివాలయానికి అందాల భామలు

హైదరాబాద్ క్రీడాప్రతినిధి/హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి పోటీల్లో భాగంగా శనివారం నిర్వహించిన స్పోర్ట్స్ డే కార్యక్రమంలో అందాల భామలు తమ క్రీడా నైపుణ్యాలతో అదరగొట్టారు. ర్యాంప్ వాక్‌పై మాత్రమే కాదు మైదానంలోనూ మెరిసిపోగలమని నిరూపించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ దివిటీ వెలిగించి పోటీలను ప్రారంభించారు. 25 మీటర్ల స్ప్రింట్, షాట్‌పుట్, బ్యాడ్మింటన్, ఫిట్‌నెస్ రన్, చెస్, జుంబా పోటీలతో కూడిన ఈ స్పోర్ట్స్ చాలెంజ్‌లో మిస్ ఎస్టోనియా ఎలిస్ రాండ్మా స్వర్ణ పతకం గెలిచి.. మిస్ వరల్డ్ స్పోర్ట్స్ ఉమన్ టైటిల్ దక్కించుకున్నారు. మిస్ మార్టినిక్ ఆరేలి జోచిమ్‌కు రజతం, మిస్ కెనడా ఎమ్మా మారిసన్‌కు కాంస్య పతకం లభించాయి. క్రీడా పోటీల ప్రారంభానికి ముందు మల్లఖంబ్ క్రీడాకారులు రిషబ్, సాన్వి అద్భుత విన్యాసాలు, జిమ్నాస్టులు నిషిక అగర్వాల్, సురభి ప్రసన్న ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్ ప్రదర్శన అలరించింది. అర్జున అవార్డు గ్రహీత అర్జున్ బృందం నిర్వహించిన స్కేటింగ్ ప్రదర్శన ఆకట్టుకుంది. గురు దత్తాత్రేయ బృందం నిర్వహించిన యోగాసనాలు, మణిపూరి మార్షల్ ఆర్ట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చెస్‌లో అండర్-8 వరల్డ్ చాంపియన్ ఎ.దివిత్‌రెడ్డి ఒకేసారి నలుగురు మిస్ వరల్డ్ పోటీదారులతో ఆడి ఓడించాడు. గాదె శరణ్య కళ్లకు గంతలు కట్టుకుని మిస్ కెనడాతో చెస్ ఆడి గెలవడం విశేషం. కాగా, మహిళలు క్రీడల్లోనూ పురుషులకు దీటుగా రాణిస్తున్నారని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచ స్థాయిలో ఇనుమడింప జేసేలా ప్రపంచ సుందరి పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీల్లో క్రీడలను భాగం చేయడం విభిన్నమైన ఆలోచన అని, ఈ కార్యక్రమంతో

మిగతా 13వ పేజీలో...


తిరంగా ర్యాలీలో వెంకయ్యనాయుడు, ఏలేటి, కొండా, కిషన్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, రఘునందన్, ఈటల

ఆపరేషన్ సిందూర్

అద్భుత విజయం

3 రోజుల్లోనే కాళ్లబేరానికి వచ్చిన పాకిస్థాన్

యుద్ధాన్ని నివారిస్తూ కీలకంగా వ్యవహరించిన మోదీ

ట్యాంక్‌బండ్‌పై తిరంగా ర్యాలీలో వక్తల ప్రశంసలు

వేలాది మందితో జరిగిన ర్యాలీ.. పాల్గొన్న వెంకయ్యనాయుడు, కిషన్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు

హైదరాబాద్, కవాడిగూడ, మే 17(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైనిక సత్తా ప్రపంచానికి తెలిసి వచ్చిందని ట్యాంక్ బండ్‌పై నిర్వహించిన తిరంగా ర్యాలీలో వక్తలు చెప్పారు. పాక్ ఎయిర్ బేస్‌లపై బ్రహ్మోస్ క్షిపణుల వర్షంతో బీతిల్లిన పాక్ మూడు రోజుల్లోనే కాళ్లబేరానికి

మిగతా 13వ పేజీలో...


ట్యాంక్‌బండ్‌పై తిరంగా ర్యాలీ

కాంగ్రెస్‌ను కాదని

శశిథరూర్‌కు పట్టం

అఖిలపక్ష బృందాల్లో ఒకదానికి నేతృత్వం

మోదీ సర్కారు సంచలన నిర్ణయం

మండిపడ్డ కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

కాంగ్రెస్‌లో ఉండటం వేరు.. కాంగ్రెస్‌తో ఉండటం వేరని వ్యాఖ్య

దౌత్య ప్రచారానికి ఎంపీలతో 7 బృందాలు

ఇండియా కూటమి నుంచి ముగ్గురికి నేతృత్వం

ప్రపంచవ్యాప్తంగా పాక్‌ను ఎండగట్టడం లక్ష్యం



న్యూఢిల్లీ, మే 17 (ఆంధ్రజ్యోతి): పాక్ కుతంత్రాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు భారత్ దౌత్య యుద్ధాన్ని ఆరంభించింది. అయితే.. కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన నాలుగు పేర్లను కాదని.. ఓ బృందానికి కేంద్ర ప్రభుత్వం శశిథరూర్‌ను ఎంపిక చేయడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. ఏడాది కాలంగా శశిథరూర్ కాంగ్రెస్‌తో అంటీముట్టనట్లు వ్యవహరిస్తుండడం.. ఇటీవల ప్రధాని మోదీ కూడా కేరళలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయనను పొగడడం తెలిసిందే.! ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కేంద్రం తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శశిథరూర్‌ని ఉద్దేశించి మాట్లాడుతూ.. "కాంగ్రెస్‌లో ఉండడం వేరు.. కాంగ్రెస్‌తో ఉండడం వేరు" అని వ్యాఖ్యానించారు. సున్నితమైన విషయాల పట్ల కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతోందని మండిపడ్డారు. క్రికెట్ పరిభాషలో 'బాడీలైన్(నిబంధనలకు విరుద్ధం)'ను ఉటంకిస్తూ.. "కాంగ్రెస్ నిబంధనల ప్రకారం ఆడుతుంటే.. బీజేపీ బాడీలైన్ ఆడుతోంది" అని తీవ్రస్థాయిలో విమర్శించారు. "కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు

మిగతా 7వ పేజీలో...


జ్యోతి మల్హోత్రా

పాక్‌కు సైనిక రహస్యాలు

సైనిక, వైమానిక బేస్‌ల వీడియోలు చిత్రీకరించి పాక్‌కు పంపిన మహిళా యూట్యూబర్ అరెస్టు

మహిళలపై పాక్ ఏజెంట్ల డబ్బు, వలపు వల

పలు రాష్ట్రాల్లో నెట్‌వర్క్.. ఆరుగురి అరెస్టు

న్యూఢిల్లీ, మే 17: హరియాణాలోని హిస్సార్‌కు చెందిన జ్యోతి మల్హోత్రా ఓ యూట్యూబర్. ఆమెకు లక్షలమంది ఫాలోవర్లు ఉన్నారు. ట్రావెల్ బ్లాగర్‌గా పాక్ వెళ్లి ఆమె గూఢచర్యం బాట పట్టారు... పంజాబ్, హరియాణా, రాజస్థాన్, లద్దాఖ్‌లలోని భారత సైనిక పోస్ట్‌ల ముందు, వైమానిక దళ బేస్‌ల ముందు, డీఆర్‌డీవో టెస్ట్ రేంజ్‌ల ముందు దేశ భక్తి గీతాలు పాడుతూ... వందనం చేస్తూ ఏడాదిగా వీడియోలను అప్‌లోడ్ చేసింది. వీటిని చూస్తే ఎవరికీ ఆమె మీద అనుమానం రాదు.. వీటిలో జాతీయ జెండా ఎగురవేయడం, బీటింగ్ రిట్రీట్ కార్యక్రమాలు, గన్ సెల్యూట్‌ల వంటివి కనిపిస్తాయి. కాని వీటన్నిటి వెనుకా లోతైన గూఢచర్యం ఉందని హరియాణా పోలీసులు తెలిపారు. హై రిజల్యూషన్‌తో సైనికంగా సున్నిత ప్రాంతమంతా కనిపించేలా చిత్రీకరించడం, జీపీఎస్ ట్యాగ్‌లు, డ్రోన్‌లతో ఆయా సైనిక, వైమానిక బేస్‌లను, సైనిక వాహనాల బేలను,

మిగతా 7వ పేజీలో...

మా ఎయిర్‌బేస్‌లను భారత్ దెబ్బతీసింది

తొలిసారి అంగీకరించిన దాయాది దేశం

దాడుల విషయం అర్ధరాత్రి ఆర్మీచీఫ్ తెలిపారు

ప్రధాని షెహబాజ్ షరీఫ్

భారత్, పాక్‌లు చర్చించుకోవాలి: రష్యా 14

ముంబైలో ఇద్దరు ఐఎస్ సభ్యుల అరెస్ట్ 7

 7

జన్యువును మార్చి.. మృత్యువును ఏమార్చి..!

అమెరికాలో ఓ చిన్నారికి 'జన్యు సవరణ' చికిత్స

జన్యువులోని రసాయనాల అమరికలో మార్పు

భారత సంతతి వైద్యుడు కిరణ్ కీలకపాత్ర

రాష్ట్రపతికి గడువు.. కేంద్రమే పెట్టింది!

2016లో 2 మెమోలు జారీ చేసిన హోంశాఖ

రాష్ట్రాల బిల్లుల మీద 3 నెలల్లోపు ఆమోదం తెలుపాలని రాష్ట్రపతికి సూచన

ఇతర మంత్రిత్వశాఖలూ స్పందించాలని నిర్దేశం

జాప్యం నివారణకు అవసరమని స్పష్టీకరణ

ఆ మెమోలనే ప్రస్తావించిన సుప్రీంకోర్టు 7

 14

పిల్లల్లో స్వీట్లు తినే అలవాటు తగ్గించండి

పాఠశాలల్లో 'షుగర్ బోర్డులు' పెట్టండి

ప్రిన్సిపాళ్లకు సీబీఎస్ఈ ఆదేశాలు

మధుమేహంపై చిన్నతనం నుంచే అవగాహన

నక్సల్స్ మూలాలపై దెబ్బ

మావోయిస్టుల రిక్రూట్‌మెంట్, సమాచారం, రవాణా, వనరులపై వేటు

10 ఏళ్లలో తగ్గిన నక్సలిజం

నక్సల్స్ స్థావరాల్లో కేంద్ర బలగాల పాగా

ప్రజలపై ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం

126 నుంచి 6 జిల్లాలకు పరిమితమైన నక్సలిజం

నక్సల్స్ హింస 81% తగ్గు ముఖం

85% మేర తగ్గిన మరణాలు: పీఐబీ 11



నేడు నింగిలోకి నిఘా నేత్రం

పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ ద్వారా ఇస్రో ఈవోఎస్-09 ఉపగ్రహ ప్రయోగం 7

sru SR UNIVERSITY

nirf 98th ALL INDIA RANK in Engineering Category

nirf 101-150 Rank Band in University Category

NBA NATIONAL BOARD OF ACCREDITATION NBA Tier-I Accreditation to all B.Tech Programs (CSE | ECE | EEE | ME | CE)

OPENING DOORS TO NEW OPPORTUNITIES

HIGHEST PACKAGE

₹ 51 LPA

OFFERED BY Microsoft

OVERALL OFFERS

1200+ PLACEMENTS	2500+ INTERNSHIPS

OF 2025 BATCH

Our Superstars



Name	Batch	Package	Placed @
B. Shiva Krishna	CSE - BATCH 2025	51 LPA	Microsoft
Thangallapally Nihal	CSE - BATCH 2025	44 LPA	Salesforce
Bijigiri Vignesh	CSE - BATCH 2025	44 LPA	Servicenow
Ambati Krishna Sai	CSE - BATCH 2025	44 LPA	Servicenow
Jonnadula Sahith	CSE - BATCH 2025	34.5 LPA	PayPal
Harsha Vardhan	CSE - BATCH 2025	34.5 LPA	PayPal

380 students placed in **Accenture** from Batch 2025

WHY YOU SHOULD CHOOSE SRU

- **Scholarships** for Meritorious Students
- Ph.D. & Post-Doc faculty from **World-Class Universities, IITs & NITs.**
- State-of-the-Art **Campus Facilities**
- Experiential **Learning Methodology**
- Wide Range of **Extra Curricular Activities and Clubs**
- Robust Alumni Network with **Global Reach**
- Hands-on Learning for **Skill Development**
- Curriculum Aligned with **Industry Trends**
- One-to-one **Mentoring Support** and **Academic Advising** for Students.
- A hub for quality research with India's highest **Ph.D. Fellowship — up to ₹80,000/ Per month.**

Academics

- Degree with Honours | Minor | Specializations
- Branch / Specialization Change Option in II year
- Internships / Semester Abroad

50+ Collaborations with Foreign Universities

Faculty Listed in Top 2% World Researchers

srix SR Innovation Exchange

First Private University with a Technology Business Incubator in Telangana

160	57+ Cr	10+ Cr
Startups	Funds Raised by Startups	Funds Disbursed to Startups

56000+ Global Certifications by Students

100+ Programs

World Class Programs in UG, PG & Ph.D.

- **School of Computer Science & Artificial Intelligence**
  B.Tech. (CSE - AI & ML | Cybersecurity | Data Science | Gaming & ARVR | Cloud Engineering and DevOps Engineering) / BCA / MCA / M.Tech / Ph.D.
- **School of Engineering**
  B.Tech. (ECE | EEE | ME | CE) / M.Tech / Ph.D.
- **School of Business**
  B.Com / BBA / MBA / E MBA / Ph.D.
- **School of Agriculture**
  B.Sc. (Hons) Agriculture / M.Sc / Ph.D.
- **School of Sciences and Humanities**
  B.Sc / M.Sc / Ph.D.

INTERNATIONAL ENGINEERING PROGRAM (IEP)

Make your choice:

3+1
Year 1st, 2nd & 3rd Study at SR University & 4th Year Study at Partner Universities, USA

2+2
Year 1st & 2nd Study at SR University & Year 3rd & 4th Study at Partner Universities, USA

In Collaboration with US Universities

UMass Lowell | University of New Haven | Mizzou | University of Central Missouri

INTERNATIONAL BUSINESS ACCELERATED PROGRAM (IBAP)

BBA + MBA / MS
(FINANCE/BUSINESS ANALYTICS)

3+2
3 years Study at SR University
2 years Study at UMass Lowell, USA

UMASS LOWELL

BS @ The University of Melbourne, Australia

2+2
2 years Study at SR University
2 years Study at The University of Melbourne, Australia

THE UNIVERSITY OF MELBOURNE

170+ Acres Lush Green Sprawling Campus

On Campus Separate Hostels for Boys & Girls: Home Away From Home, Nutritious Tasty Food, Clean Water, Clean Rooms, & WiFi.

SR UNIVERSITY
Ananthasagar, Hasanparthy,
Warangal - 506371, Telangana, India

Follow US: /SRUniversity

For More Details Contact:
+91 8331003030
+91 8331004040

www.sru.edu.in

FOLLOW US

భూభారతితో భూసమస్యలకు పరిష్కారం

- రెవెన్యూ చట్టాల అధ్యయనం చేశాకే భూభారతి తెచ్చాం
- రాష్ట్ర వ్యాప్తంగా 6వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- భూభారతి అవగాహన సదస్సుల్లో మంత్రి పొంగులేటి
- భూధార్ కార్డు శుభపరిణామం : ఎంపీ రఘునందన్

మెదక్, బుగ్గారం, మే 17 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో భూసమస్యలకు సత్వర, శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో అమలులో ఉన్న రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసిన తర్వాతే రాష్ట్రంలో భూభారతిని అమలు చేస్తున్నామని చెప్పారు. మెదక్ జిల్లా చిలప్‌చేడ్ మండలం పరిధి శీలంపల్లిలో, జగిత్యాల జిల్లా బుగ్గారంలో శనివారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుల్లో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలతో లక్షలాది మంది ప్రజలు, మేధావుల అభిప్రాయాలు సేకరించి భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అందులో భాగంగానే శనివారం సాయంత్రం లోగా రాష్ట్రంలో 6,000 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నామని, జూన్ 2 నుంచి 10,956 రెవెన్యూ గ్రామాలకు రెవెన్యూ అధికారులను కేటాయిస్తామని చెప్పారు. గతంలో కేసీఆర్ నాలుగు గోడల మధ్య కూర్చొని ధరణి అనే చట్టాన్ని తీసుకొచ్చి ప్రజలను తిప్పలు పెట్టారని విమర్శించారు. ప్రతీ వ్యక్తికి ఆధార్ ఎలా ఉంటుందో, అలానే భూధార్‌ను చట్టంలో ప్రవేశపెట్టామన్నారు. భూ భారతి చట్టం ప్రకారం సర్వే చేసి సంబంధిత మ్యాపులను పాస్‌పుస్తకంపై ముద్రిస్తే భూసమస్యలకు చరమగీతం పాడవచ్చునని వివరించారు. రానున్న రోజుల్లో రిజిస్ట్రేషన్ సమయాల్లోనే సర్వేమ్యాప్ రిజిస్ట్రేషన్‌తోపాటు దస్తావేజును కంప్యూటర్లలో నిక్షిప్తం చేసే అంశాన్ని చట్టంలో పొందుపరుస్తున్నామని వివరించారు. ధరణిలో ఏ సమస్య వచ్చినా న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చేదని, భూ భారతి చట్టం ప్రకారం ఎమ్మార్వో, ఆర్డీవో, అదనపు కలెక్టర్, సీసీఎల్‌ఏ స్థాయిలో సమస్యలపై అప్పీలుకు వెళ్లే అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రంలోని 32 మండలాలలో భూ భారతి చట్టం తీసుకొచ్చామని, జూన్2 నాటికి వాటి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఆగస్టు 15 నాటికి భూభారతి చట్టం ద్వారా భూసమస్యలన్నింటికీ పరిష్కారాలు లభించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇక రాష్ట్రంలోని నిరుపేదలకు మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వనున్నామని తెలిపారు. శీలంపల్లిలో జరిగిన సదస్సులో పాల్గొన్న బీజేపీ నేత, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ధరణి తెచ్చి రైతుల్ని అరిగోస పెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం అలా చేయదని ఆశిస్తున్నామని అన్నారు. రైతులకు భూధార్ కార్డు ఇవ్వడం శుభపరిణామం అన్నారు. ఇదే సదస్సులో పాల్గొన్న బీఆర్‌ఎస్ నేత, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి మాట్లాడుతూ పాసు పుస్తకాలు లేని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు.


భూభారతి సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

భారత్ సిమ్ములతో పాక్‌లో వాట్సాప్ అకౌంట్లు

- అస్సాం పోలీసుల అదుపులో సంగారెడ్డి జిల్లా వాసి

సంగారెడ్డి క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి): భారత్‌కు సంబంధించిన ఫోన్ నంబర్లతో పాకిస్థానీయులకు ఓటీపీలు చెప్పి వాట్సాప్ అకౌంట్లు క్రియేట్ చేసేందుకు సహకరిస్తున్న ఏడుగురు నిందితులను అస్సాం పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఇందులో సంగారెడ్డి జిల్లా వాసి కూడా ఉన్నట్లు సమాచారం. ఈనెల 14న ఆపరేషన్ ఘోస్ట్ సిమ్ ప్రారంభించినట్లు అస్సాం డీజీపీ హర్మీత్‌సింగ్ వెల్లడించారు. దీంతో సంగారెడ్డి జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు.



అల్లుడిని కత్తితో పొడిచి చంపిన మామ

- ధర్మారంతండాలో ఘటన

కేసముద్రం, మే 17 (ఆంధ్రజ్యోతి) : తన భార్యకోసం అత్తగారి ఇంటికి వెళ్లగా వివాదం పెట్టుకొని అల్లుడిని మామ పొడవడంతో మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అన్నారం శివారు ధర్మారంతండాలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపిన ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన లూనావత్ బాల(35)కు ధర్మారంతండాకు చెందిన బానోత్ వీరన్న, కైల దంపతుల కుమార్తె మౌనికతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. భార్య వివాదం పెట్టుకొని తల్లిగారి ఇంటికి కొద్దిరోజుల క్రితం వెళ్లగా ఆమెను తీసుకవెళ్లేందుకు భర్త బాల శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో వచ్చాడు. ఈ క్రమంలో మామతో బాలకు వివాదం ఏర్పడి ఆవేశానికి గురైన మామ కత్తితో బాలపై దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన బాలను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అర్ధరాత్రి మృతి చెందాడు.


మృతి చెందిన బాల





ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొంత మంది కాంగ్రెస్ శాసనసభ్యులు తమ సభ్యత్వానికి రాజీనామా చేసి జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వైసీపీలో చేరారు. వారి రాజీనామాలు ఆమోదిస్తే, ఉప ఎన్నికలు వస్తాయి. అదే జరిగితే అప్పటి పరిస్థితులలో వైసీపీ విజయం సాధించేది. ఈ కారణంగా సభ్యుల రాజీనామాలను అప్పటి స్పీకర్ నాదెండ్ల మనోహర్ పెండింగ్‌లో పెట్టారు. తర్వాత రాష్ట్రం విడిపోయింది. తెలంగాణలో తెలుగుదేశం తరపున ఎన్నికైన తలసాని శ్రీనివాసయాదవ్‌ను పార్టీలో చేర్చుకొని మంత్రివర్గంలో చోటు కల్పించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంకల్పించారు. అయితే, అప్పటి గవర్నర్ నరసింహన్ తెలుగు దేశం తరపున ఎన్నికైన తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో ప్రమాణ స్వీకారం చేయించడానికి నిరాకరించారు. దీంతో ఆయనతో ఉత్తుత్తి రాజీనామాను స్పీకర్‌కు అందజే యించారు. చట్టంలోని లోపాలను అలా వాడుకున్నారు. ఆ తర్వాత ఇదే ట్రిక్కును ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం కూడా వాడుకుంది.

తెంపరి ట్రంప్‌తో తిప్పలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశీ గడ్డపై నుంచి చేస్తున్న ప్రకటనలు మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సొంత గడ్డపై ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ట్రంప్ ప్రకటనలతో అమెరికా మనకు మిత్ర దేశమా? శత్రు దేశమా? అని తెల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. మొదటి పర్యాయం అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ మన దేశానికి మిత్రుడిగా వ్యవహరించగా, రెండో పర్యాయం మాత్రం అనుకూల శత్రువుగా మారిపోయారు. ఆయన ప్రకటనలు దేశ ప్రయోజనాలకే కాకుండా ప్రధాని మోదీ రాజకీయ ప్రయోజనాలకు కూడా ముప్పుగా పరిణమిస్తున్నాయి. పహల్గాం దారుణం తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో మోదీ ప్రతిష్ఠ ఇంటా బయటా పెరిగింది. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ హఠాత్తుగా ఆగిపోవడం, ఇందుకు సంబంధించిన ప్రకటనను భారత్, పాకిస్థాన్‌లు అధికారికంగా చేయకముందే రెండు దేశాల మధ్య రాజీ కుదిరిందని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో దేశ ప్రజలు నివ్వెరపోయారు. రెండు దేశాల మధ్య అమెరికా దౌత్య పరంగా రాజీ కుదిర్చితే కుదర్చవచ్చునుగానీ, ఆ విషయాన్ని ఆయా దేశాలు ప్రకటించక ముందే ట్రంప్ తన 'ట్రూత్' ఖాతా ద్వారా ప్రకటించడంతో మన ప్రధాని మోదీ ప్రతిష్ఠకు మచ్చ ఏర్పడింది. అప్పటి నుంచి ట్రంప్ వరుసగా చేస్తున్న ప్రకటనలు మన దేశ ప్రయోజనాలకు ముప్పుగా పరిణమించాయి. భారత్‌తో పోల్చితే చైనా వైపే ట్రంప్ చూడటం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మన ప్రధాని మోదీని తెలివైనవారు అని ప్రశంసించిన ట్రంప్ ఇప్పుడు చేస్తున్న ప్రకటనలతో మోదీని ఇబ్బందుల్లోకి నెడుతున్నారు.

సత్తా చాటిన 'సిందూర్'.. అంతలోనే!

ఆపరేషన్ సిందూర్‌తో భారత్ తన సైనిక పాటవాన్ని ప్రపంచానికి తెలియజేసింది. అంతర్జాతీయ సరిహద్దులను అతిక్రమించకుండానే మన శత్రు దేశమైన పాకిస్థాన్‌లో ఉగ్రవాదులను మట్టుబెట్టడమే కాకుండా, ఆ దేశ వైమానిక స్థావరాలను కూడా ధ్వంసం చేయగలిగాం. అదే సమయంలో పాక్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లు మన దేశంలో నష్టం చేయకముందే వాటిని కూల్చివేశాం. దీంతో పాక్‌పై మనది పైచేయి అయింది. పహల్గాం తర్వాత పాక్‌పై పగ ప్రతీకారాలతో రగిలిపోయిన దేశ ప్రజలకు ఈ పరిణామం ఊరటనిచ్చింది. ఈ దశలో భారత్–పాక్ మధ్య యుద్ధం ముదురుతుందన్న భావన ఏర్పడింది. అయితే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హఠాత్తుగా చేసిన ప్రకటనతో మన దేశ ప్రజలు నిశ్చేష్టులయ్యారు. ఈ ఆధునిక యుగంలో యుద్ధాలు వాంఛనీయం కాదు. ఎంత జటిలమైన సమస్యనైనా చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవచ్చు. అందునా, అణ్వాయుధాలు కలిగి ఉన్న రెండు దేశాల మధ్య పూర్తి స్థాయి యుద్ధం జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఇలాంటి సందర్భాలలో ఉభయులకూ కావల్సిన దేశాలు మధ్యవర్తిత్వం నెరపడం కొత్త కాదు. అయితే యుద్ధరంగంలో తలమునకలై ఉన్న దేశాలతో నిమిత్తం లేకుండా రాజీకి చొరవ తీసుకున్న దేశాధినేతే ప్రకటన చేయడం ఇబ్బందిగా మారింది. అగ్రరాజ్యం మోచేతి కింద నీళ్లు తాగుతూ బతికే దేశాల విషయంలో ఇలా జరిగితే జరగవచ్చుగానీ, ప్రపంచంలోనే తృతీయ ఆర్థిక శక్తిగా ఎదగడానికి పరుగులు తీస్తున్న భారత్‌వంటి దేశం విషయంలో మన ప్రమేయం లేకుండా ప్రకటన రావడం అవమానకరంగా దేశ పౌరులు భావిస్తున్నారు. యుద్ధానికి సంబంధించిన రాజీ ప్రకటనతో ఆగిపోకుండా ట్రంప్ తన వరుస ప్రకటనలతో మన నాయకత్వాన్ని మరింత ఇబ్బందికర స్థితిలోకి నెట్టారు. చైనాపై అడ్డగోలుగా వేసిన పన్నులను తిరిగి పూర్వ స్థితికి తీసుకువస్తున్నట్టు ప్రకటించిన ట్రంప్, భారత్ విషయంలో మాత్రం పన్నులు తగ్గించేది లేదని ప్రకటించారు. ఉభయ దేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతుండగానే అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై జీరో టాక్స్ అమలుకు భారత్ అంగీకరించిందని ప్రకటించడం ద్వారా ట్రంప్ మరోసారి మన ప్రధాని మోదీని ఆత్మరక్షణలోకి నెట్టారు. అంతటితో ఆగకుండా 'యాపిల్' కంపెనీ తన ఐఫోన్ల ఉత్పత్తిని భారత్‌లో చేపట్టకూడదని తాను ఆ సంస్థను కోరానని మరో బాంబు పేల్చారు. ఈ ప్రకటనలన్నీ భారత్ ప్రయోజనాలకు విరుద్ధమైనవే.

ట్రంప్ తీరే వేరు...

మామూలుగా అయితే దేశాధినేతలు హుందాగా ప్రవర్తిస్తారు. ఇతర దేశాల అంతరంగిక వ్యవహారాలతో పాటు వాణిజ్య పరమైన అంశాలపై బహిరంగంగా ప్రకటనలు చేయరు. ఆయా దేశాలతో అవగాహన లేదా ఒప్పందాలు కుదిరినప్పుడు సంబంధిత శాఖల ద్వారా అధికారిక ప్రకటనలు చేయిస్తారు. అయితే, డొనాల్డ్ ట్రంప్ స్టయిలే వేరు. రెండవ పర్యాయం అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన తానొక అగ్రరాజ్యాధినేతలా కాకుండా సాదాసీదా నాయకుడిగా ఎడాపెడా ప్రకటనలు చేస్తూ నోటికి పని చెబుతున్నారు. వాణిజ్య పన్నులకు సంబంధించి ఆయన చేసిన ప్రకటనలతో ప్రపంచ దేశాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి. స్వదేశంలో కూడా ట్రంప్‌పై వ్యతిరేకత పెరిగింది. భారత్–పాక్ ప్రధానమంత్రులు కలిసి కూర్చొని డిన్నర్ చేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని ట్రంప్ తన వాచాలత్వం ప్రదర్శించారు. దాయాదుల మధ్య పోరు ఈనాటిది కాదు. ఇద్దరు ప్రధానులూ కూర్చొని భోజనం చేసినంత మాత్రాన పరిష్కారమయ్యే వైషమ్యాలా ఇవి? ప్రధానులు సరే అనుకున్నప్పటికీ 140 కోట్ల మంది భారతీయులు, 25 కోట్ల మంది పాకిస్థానీలను సంతృప్తిపరచడం సాధ్యమా? ఇలాంటి క్లిష్టమైన అంశాలను కూడా ట్రంప్ తేలికగా తీసుకోవడం ఆశ్చర్యంగా ఉంది. యావత్ ప్రపంచానికే తనను నాయకుడిగా ప్రకటించుకోవాలన్న దుగ్ధతోనే బహుశా ట్రంప్ ఇలా ప్రవర్తిస్తున్నారేమో తెలియదు. ఐదు దశాబ్దాల క్రితమే మన ప్రధాని ఇందిరా గాంధీ అమెరికా ఆధిపత్య ధోరణిని తిరస్కరించారు. అప్పటితో పోల్చితే భారత్ ఇప్పుడు ఆర్థికంగా, సైనిక పరంగా ఎన్నో రెట్లు బలపడింది. ఈ దశలో జనాభా పరంగా కూడా ద్వితీయ స్థానంలో ఉన్న భారత్‌ను సామంత రాజ్యంగా పరిగణించాలని అగ్రరాజ్యాధినేత భావించడాన్ని మన దేశ పౌరులు జీర్ణించుకోలేకపోతున్నారు. అమెరికాతో వాణిజ్య సంబంధం లేకపోతే ప్రపంచ దేశాలు మనుగడ సాగించలేవు అన్నట్టుగా ట్రంప్ తెంపరితనం ప్రదర్శిస్తున్నారు. ఇంతా చేస్తే అమెరికా జనాభా 35 కోట్లు మాత్రమే. 140 కోట్ల జనాభా ఉన్న దేశాన్ని 35 కోట్ల జనాభా ఉన్న అమెరికా వాణిజ్యపరంగా నియంత్రించాలని అనుకోవడం ఏమిటి? అని మన దేశ ప్రజలు సహజంగానే ప్రశ్నిస్తున్నారు. భారత్ విషయంలో ట్రంప్ వైఖరి మారడానికి కారణాలు తెలియాల్సి ఉంది. చైనాకు ఇస్తున్న ప్రాధాన్యత కూడా మనకు ఇవ్వకపోవడంపై భారతీయులు ఆగ్రహంగా ఉన్నారు. యుద్ధం ఆపేయకపోతే మీ రెండు దేశాలతో వాణిజ్య సంబంధాలను తెగదెంపులు చేసుకుంటానని బెదిరించడంతో... పాక్‌తో పాటు భారత్ కూడా దారికి వచ్చిందని ట్రంప్ చెప్పుకొంటున్నారు. ఈ ప్రకటనతో మన విదేశాంగ శాఖ విభేదించింది. నిజంగా కూడా అమెరికాతో వాణిజ్య సంబంధాలు లేకపోతే మన దేశం మనుగడ సాగించలేదా? ఈ విషయమై నిజానిజాలను ప్రజలకు తెలియజేయాల్సి ఉంది. అమెరికా అధ్యక్షుడిగా ఎవరున్నా తమ దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తారు. అది సహజం కూడా. ఈ క్రమంలోనే మిత్ర దేశాలకు అవసరమైన ఆర్థిక, ఆయుధ సహకారాన్ని అమెరికా అందిస్తూ వస్తోంది. నిన్న మొన్నటి వరకు భారత్‌ను మిత్ర దేశంగా అమెరికా పరిగణించింది. అయితే, ఇప్పుడు పరిస్థితులు మారిపోతున్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు అండగా నిలిచిన తుర్కియేకు క్షిపణులు సరఫరా చేయడానికి అమెరికా సిద్ధపడింది. ఇది దేనికి సంకేతం? మన విదేశాంగ విధానంలోనే లోపం ఉందా? లేక ప్రపంచ దేశాల వైఖరి మారుతోందా? ఏది ఏమైనా డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలతో ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చింది అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ట్రంప్ ప్రకటనలు భారత్ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ ప్రధానమంత్రి మోదీ నోరు విప్పకపోవడం ఏమిటి? ఆపరేషన్ సిందూర్ విషయంలో కూడా ముందుగా ట్రంప్ నుంచి ప్రకటన రావడం ఏమిటి? ఇటువంటి ప్రశ్నలను ప్రతిపక్షాలు సంధిస్తున్నాయి. అయితే ట్రంప్ తన నోటికి పని చెబుతున్నారని చెప్పి మన ప్రధాని కూడా ప్రతి దానికీ వివరణ ఇవ్వాలని ఆశించడం తగదు. దేశాధినేతలు చాలా హుందాగా, గుంభనంగా ఉండాలి. పరస్పరం గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలి. ఇతర దేశాధినేతలు తనకు సబార్డినేట్స్ అన్నట్టుగా ట్రంప్ వ్యవహరిస్తున్నట్టు ఇతర దేశాధినేతలు కూడా వ్యవహరించాలని కోరుకోలేం. బహుశా ఈ కారణంగానే కాబోలు ప్రధాని మోదీ గుంభనంగా ఉంటున్నారు. అమెరికా నుంచి దిగుమతయ్యే వస్తువులపై జీరో టాక్స్‌కు మనం సిద్ధపడ్డామని ట్రంప్ ప్రకటించినా ప్రధాని మోదీ తాను స్పందించకుండా విదేశాంగ శాఖ మంత్రి ద్వారా ప్రకటన చేయించారు. వాణిజ్య పరమైన అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయని, తుది నిర్ణయం ఏదీ తీసుకోలేదని విదేశాంగ శాఖ వివరణ ఇచ్చింది.

> చట్టాలను అపహాస్యం చేయకూడదు. సమస్యను పరిష్కరించవలసిన వారే సమస్యకు కారకులైనప్పుడు సుప్రీంకోర్టు కూడా పట్టించుకోకపోతే ఎలా? రాష్ట్రపతి లేఖపై రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు కావచ్చుగానీ సమస్యలకు కారణమైన వారే పరిష్కారం చెబితే ఇలాంటి సున్నితమైన అంశాలపై వివాదం ఏర్పడదు!

చులకన... పలుచన

సందర్భం వచ్చిన ప్రతిసారీ అమెరికా తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే వచ్చింది. అయితే ట్రంప్ మాదిరి గతంలో అధ్యక్షులుగా పనిచేసినవారు ప్రతి విషయాన్నీ తామే ప్రకటించాలని భావించలేదు. అమెరికా అధ్యక్షుడి నోటి వెంట వెలువడే ప్రతి మాటకూ ఎంతో విలువ ఉంటుంది. ఎందుకంటే, దాని ప్రభావం ప్రపంచ దేశాల మీద ఉంటుంది. ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ విషయంలో పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఆయన తన మనసులో ఏది మెదిలితే అది ప్రకటించేస్తున్నారు. తాను చేసిన ప్రకటనలను రోజుల వ్యవధిలోనే సరిదిద్దుకుంటున్నారు. దీంతో ఆయన ప్రకటనలలో సీరియస్‌నెస్ తగ్గిపోయింది. ప్రపంచ దేశాల ముందు ఆయన పలుచనవుతున్నారు. అమెరికా వంటి బలమైన దేశం ఒక పిచ్చివాడి చేతికి చిక్కిందన్న భావన ప్రజల్లో కూడా వ్యాపిస్తోంది. అమెరికా వంటి దేశానికి ఇలాంటి చౌకబారు నాయకుడా? అని ఈసడించుకొనే పరిస్థితి ఏర్పడింది. ఒక సాదా సీదా నాయకుడిగా డొనాల్డ్ ట్రంప్ తమ దేశంలోని మైనారిటీలను లక్ష్యం చేసుకొని మెజారిటీ ప్రజల మద్దతు కూడగట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే అమెరికా నుంచి తమ స్వదేశాలకు డబ్బు పంపే వారిని కూడా టార్గెట్‌గా చేసుకున్నారు. ఇలా పంపే డబ్బుపై ఐదు శాతం పన్ను విధిస్తానని కూడా ప్రకటించారు. ఈ చర్యలన్నీ అమెరికా పట్ల ఇతర దేశాలలో వ్యతిరేక భావాన్ని పెంపొందిస్తున్నాయి. అయితే... స్వదేశంలో ట్రంప్ బలపడినా ఆశ్చర్యం లేదు. ఇప్పటి వరకు అమెరికాను అపన్న హస్తం అందించే దేశంగానే భావించే వారికి ఈ పరిణామం వింతగా అనిపిస్తోంది. దీర్ఘకాలంలో ట్రంప్ తన ధోరణితో అమెరికాకు మేలు చేస్తారో? కీడు చేస్తారో వేచి చూడాలి. అయితే మారిన ఆయన వైఖరి వల్ల భారత్‌కు మంచి జరుగుతుందా? చెడు జరుగుతుందా? అన్నదే మనకు ముఖ్యం. ఈ నేపథ్యంలో మన విదేశాంగ విధానాన్ని సమీక్షించుకోవలసిన అవసరం ఉందనిపిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మనకు నమ్మకమైన మిత్ర దేశాలుగా ఉన్నవారు కూడా ఇప్పుడు మనకు దూరమవుతున్నారు. శ్రీలంక, నేపాల్, మాల్దీవులు వంటి దేశాలు ఇందుకు నిదర్శనం. మన మిత్ర దేశాలను చైనా తనవైపు ఆకర్షిస్తోంది. ఆయా దేశాలకు ఇబ్బడి ముబ్బడిగా ఆర్థిక సహాయం చేయడంతో పాటు పలు ప్రాజెక్టులలో పెట్టుబడులు పెట్టడం ద్వారా చైనా మనల్ని ఏకాకిగా మార్చాలని చూస్తున్నది. తాజాగా మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను కూడా ఈ కోణంలోనే చూడాలి. పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించవచ్చునని మన దేశ ప్రజలు భావిస్తున్నారుగానీ, పాక్ వెనుక చైనా ఉందని విస్మరిస్తున్నారు. యుద్ధం ముదిరితే చైనా ప్రత్యక్షంగా మరింత బలంగా పాక్‌కు బాసటగా నిలిచేది. ఒకప్పటి మన మిత్ర దేశం రష్యా కూడా ఇప్పుడు పూర్తి స్థాయిలో మనకు అండగా నిలవలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్‌కు విరామం ప్రకటించడం మంచిదే. మనం ఏమిటో ప్రపంచానికి చాటి చెప్పగలిగాం. ఉగ్ర మూకలు పాక్‌లో తలదాచుకున్నప్పటికీ వెంటాడి చంపుతామని రుజువు చేయగలిగాం. అయితే, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుకున్నారు. ఇలాంటి కోర్కెలన్నీ భావోద్వేగాల నుంచి పుట్టుకొస్తాయి. దీనికి తోడు అటు ప్రభుత్వం, ఇటు మీడియా కూడా ఆపరేషన్ సిందూర్‌కు విశేష ప్రచారం కల్పించాయి. ఈ కారణంగా ఆపరేషన్ అర్ధంతరంగా ఆగిపోవడాన్ని ప్రజలు జీర్ణించుకోవడానికి సమయం పడుతోంది. పుండు మీద కారం చల్లుతున్నట్టు ట్రంప్ పోకడలు తోడయ్యాయి. కారణం ఏమైనా, ఎవరైనా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు చల్లారడం శుభ పరిణామమే అని చెప్పవచ్చు. ట్రంప్ ప్రకటనల వల్ల ప్రధాని మోదీ తాత్కాలికంగా ఆత్మరక్షణలో పడినప్పటికీ దేశంలో బలమైన ప్రత్యామ్నాయ నాయకుడు కనుచూపు మేర కనిపించనందున రాజకీయంగా ఆయనకు వచ్చే నష్టం కూడా ఏదీ లేదని చెప్పవచ్చు.



'సుప్రీం' అధికారాలు...

ఈ విషయం అలా ఉంచితే, రాష్ట్రాల చట్టసభలు ఆమోదించిన బిల్లులను నిర్దుష్ట కాల వ్యవధిలోపే గవర్నర్లుగానీ, రాష్ట్రపతిగానీ ఆమోదించడమా లేదా తిరస్కరించడమా? ఏదో ఒకటి చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆక్షేపణ తెలుపుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. రాష్ట్రపతికి గడువు విధించడమా? రాజ్యాంగంలోనే ఆ అధికారం లేనప్పుడు సుప్రీంకోర్టు అలాంటి తీర్పు ఎలా ఇస్తుంది? ఇచ్చినా ఎలా చెల్లుబాటు అవుతుంది? అని రాష్ట్రపతి సుప్రీంకోర్టును నేరుగా ప్రశ్నించారు. రాజ్యాంగంలో కాలపరిమితి లేనప్పుడు సుప్రీంకోర్టు ఎలా కాలపరిమితి విధిస్తుందని కూడా రాష్ట్రపతి ప్రశ్నించారు. ఇదొక అసాధారణ పరిణామం! రాజ్యాంగపరంగా ఉత్పన్నమైన అతి క్లిష్టమైన సమస్య ఇది. ప్రత్యేక పరిస్థితులలో తమకు అసాధారణ అధికారాలను రాజ్యాంగం కల్పించిందని, ఆ అధికారాలతోనే రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు విధిస్తున్నామని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. దీంతో కొంత మంది న్యాయ నిపుణులు సుప్రీంకోర్టుకు మద్దతుగా, మరికొంత మంది రాష్ట్రపతికి మద్దతుగా తమ వాదనలు వినిపిస్తున్నారు. అయితే ఇలాంటి సంక్లిష్ట పరిస్థితి తలెత్తడానికి ఎవరు కారణమో ముందుగా తెలుసుకోవాలి. తమిళనాడులో స్టాలిన్ ప్రభుత్వం ఆమోదించిన బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ నెలల తరబడి పెండింగ్‌లో పెట్టారు. రాజ్యాంగం ప్రకారం న్యాయ వ్యవస్థ, చట్టసభలు, గవర్నర్లు, రాష్ట్రపతి ఎవరికి వారు తమ పరిధిలో స్వతంత్రంగా వ్యవహరించాలి. ఒకరి అధికార పరిధిలోకి మరొకరు చొరబడకూడదు. అయితే.. ఇటీవల దేశంలో, ముఖ్యంగా కొన్ని రాష్ట్రాల చట్టసభల్లో చోటుచేసుకుంటున్న పరిణామాల వల్ల సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతోందని చెప్పవచ్చు. బిల్లుల విషయం అలా ఉంచితే చట్టసభల సభ్యులు తమ సభ్యత్వాలకు రాజీనామా చేసినప్పుడు స్పీకర్లు లేదా చైర్మన్లు వాటిని ఆమోదించకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. పార్టీ ఫిరాయించిన సభ్యుల విషయంలో కూడా ఇలాగే జరుగుతోంది. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొంతమంది కాంగ్రెస్ శాసనసభ్యులు తమ సభ్యత్వానికి రాజీనామా చేసి జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వైసీపీలో చేరారు. వారి రాజీనామాలు ఆమోదిస్తే, ఉప ఎన్నికలు వస్తాయి. అదే జరిగితే అప్పటి పరిస్థితులలో వైసీపీ విజయం సాధించేది. ఈ కారణంగా సభ్యుల రాజీనామాలను అప్పటి స్పీకర్ నాదెండ్ల మనోహర్ పెండింగ్‌లో పెట్టారు. తర్వాత రాష్ట్రం విడిపోయింది. తెలంగాణలో తెలుగుదేశం తరపున ఎన్నికైన తలసాని శ్రీనివాసయాదవ్‌ను పార్టీలో చేర్చుకొని మంత్రివర్గంలో చోటు కల్పించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంకల్పించారు. అయితే, అప్పటి గవర్నర్ నరసింహన్ తెలుగుదేశం తరపున ఎన్నికైన తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో ప్రమాణ స్వీకారం చేయించడానికి నిరాకరించారు. దీంతో ఆయనతో ఉత్తుత్తి రాజీనామాను స్పీకర్‌కు అందజేయించారు. చట్టంలోని లోపాలను అలా వాడుకున్నారు. ఆ తర్వాత ఇదే ట్రిక్కును ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం కూడా వాడుకుంది. వైసీపీ తరఫున గెలిచిన భూమా అఖిల ప్రియతో ఉత్తుత్తి రాజీనామా చేయించి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. రెండు రాష్ట్రాలలో సదరు రాజీనామాలు ఆమోదం పొందిందీ లేదు– ఉప ఎన్నికలు వచ్చిందీ లేదు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు శాసనమండలికి ఎన్నికైన కొంత మంది సభ్యులు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించి శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు. అయితే, శాసనమండలి చైర్మన్‌గా ఉన్న ఆయన వైసీపీకి చెందిన వారు కావడంతో ఆయా సభ్యుల రాజీనామాలను ఆమోదించడంలేదు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం పోయి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. దీంతో భారత రాష్ట్ర సమితి తరఫున గెలిచిన కొంత మంది సభ్యులు కాంగ్రెస్‌లో చేరారు. ఇలా చేరిన వారిపై పార్టీ ఫిరాయింపుల చట్టం కింద చర్యలు తీసుకోవాలని శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను బీఆర్ఎస్ అర్థిస్తూ వచ్చింది. అయినా ఫలితం లేకపోవడంతో వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఇవన్నీ అవాంఛనీయ పరిణామాలే.

> ఒక సాదా సీదా నాయకుడిగా డొనాల్డ్ ట్రంప్ తమ దేశంలోని మైనారిటీలను లక్ష్యం చేసుకొని మెజారిటీ ప్రజల మద్దతు కూడగట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే అమెరికా నుంచి తమ స్వదేశాలకు డబ్బు పంపే వారిని కూడా టార్గెట్‌గా చేసుకున్నారు. ఇలా పంపే డబ్బుపై ఐదు శాతం పన్ను విధిస్తానని కూడా ప్రకటించారు. ఈ చర్యలన్నీ అమెరికా పట్ల ఇతర దేశాలలో వ్యతిరేక భావాన్ని పెంపొందిస్తున్నాయి. అయితే... స్వదేశంలో ట్రంప్ బలపడినా ఆశ్చర్యం లేదు. ఇప్పటివరకు అమెరికాను అపన్న హస్తం అందించే దేశంగానే భావించే వారికి ఈ పరిణామం వింతగా అనిపిస్తోంది. దీర్ఘకాలంలో ట్రంప్ తన ధోరణితో అమెరికాకు మేలు చేస్తారో? కీడు చేస్తారో వేచి చూడాలి. అయితే మారిన ఆయన వైఖరి వల్ల భారత్‌కు మంచి జరుగుతుందా? చెడు జరుగుతుందా? అన్నదే మనకు ముఖ్యం. ఈ నేపథ్యంలో మన విదేశాంగ విధానాన్ని సమీక్షించుకోవలసిన అవసరం ఉందనిపిస్తోంది.

ఎవరి బాధ్యత ఎంత?

చట్టసభల స్పీకర్లు, చైర్మన్‌లు తమ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదు. తమ రాజీనామాలను ఎంతకూ ఆమోదించనప్పుడు సదరు సభ్యులకు ఉన్న ప్రత్యామ్నాయం ఏమిటి? న్యాయ వ్యవస్థనే కదా వారు ఆశ్రయించవలసింది? రాజీనామాల విషయంలోనైనా, ఫిరాయింపుల విషయంలోనైనా సకాలంలో నిర్ణయాలు తీసుకొని ఉంటే న్యాయస్థానాలు జోక్యం చేసుకొనే అవసరం ఏర్పడదు కదా? అలాగే చట్టసభలు ఆమోదించిన బిల్లులను పెండింగ్‌లో పెట్టుకోవడం కూడా సమర్థనీయం కాదు. అలాంటి బిల్లులు ఏవైనా రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంటే వాటిని తిప్పి పంపే అధికారం గవర్నర్లకు ఉంటుంది. గవర్నర్లు ఆ పని చేయకుండా నెలలు, ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడితే చట్టసభల స్వతంత్ర ప్రతిపత్తిని హరించడమే అవుతుంది కదా? ఈ కారణంగానే తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం, నిర్దుష్టంగా మూడు నెలల గడువులోగా బిల్లులను ఆమోదించడమో లేదా తిరస్కరించడమో చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ తీర్పు రాజ్యాంగ విరుద్ధం అని అనుకుంటే తమిళనాడు చట్టసభల స్వతంత్ర ప్రతిపత్తి పరిస్థితి ఏమిటి? ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి లేని అధికారం గవర్నర్లకు ఉంటుందా? ఏ వ్యవస్థకైనా రాజ్యాంగమే గీటురాయి. రాజ్యాంగ నిర్మాతలు ఊహించని కొత్త సమస్యలు ఇప్పుడు వస్తున్నాయి. బిల్లులను ఇలా దీర్ఘకాలం ఎటూ తేల్చకుండా పెండింగ్‌లో పెడతారని రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరు. అలాగే చట్టసభల స్పీకర్లు, చైర్మన్లు రాజీనామాలు, ఫిరాయింపుల విషయంలో నాన్చుతారని అసలే ఊహించి ఉండరు. ఇలాంటి సందర్భాలలో జోక్యం చేసుకొనే అధికారం సుప్రీంకోర్టుకు లేదనే అనుకుందాం. మరి వివాదాలు ఎలా పరిష్కారమవుతాయి? రాజీనామాలను కూడా ఆమోదించకపోతే సభ్యుల ప్రాథమిక హక్కులను హరించినట్టు కాదా? ఈ నేపథ్యంలో రాష్ట్రపతి సంధించిన లేఖ సంచలనమైంది. ఎవరికి వారు తమ వాదనకు కట్టుబడి ఉంటే సమస్య పరిష్కారం కాదు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు వివాదాలే ఏర్పడకుండా వ్యవహరిస్తే... ఈ పరిణామాలు తలెత్తవు కదా? రాష్ట్రపతి గానీ, గవర్నర్లు గానీ, చట్టసభల అధిపతులు గానీ ముందుగా ఈ సమస్యకు పరిష్కారం చూపాలి. చట్టాలను అపహాస్యం చేయకూడదు. సమస్యను పరిష్కరించవలసినవారే సమస్యకు కారకులైనప్పుడు సుప్రీంకోర్టు కూడా పట్టించుకోకపోతే ఎలా? రాష్ట్రపతి లేఖపై రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు కావచ్చుగానీ సమస్యలకు కారణమైనవారే పరిష్కారం చెబితే ఇలాంటి సున్నితమైన అంశాలపై వివాదం ఏర్పడదు!

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

పురుషాధిక్యతపై యుద్ధారావం

స్త్రీ పురుష సమానత్వం కోసం చలం చేసిన అసాధారణ కృషి అవిస్మరణీయమైనది. సాహిత్యంలో పురుషాధిక్య ధోరణిని చీల్చిచెండాడిన భావ యోధుడు చలం. తెలుగు సమాజంలో ఛాందసత్వాన్ని కూకటివేళ్ళతో పెకలించడానికి పూనుకున్న సాంఘిక విప్లవకారుడు. నిత్యం సగటు మనిషిని పీల్చి పిప్పి చేస్తున్న అనేక దురాచారాలను నిష్కర్షగా నిలబెట్టి తన అక్షర జ్వాలలతో నిలువునా తగలబెట్టిన దార్శనికుడు చలం. 'జీవితాన్ని జీవితంగా మొట్టమొదట తెలుగువాళ్ళకి చూపించిన తెలుగు కథకుడు చలం' అని పురాణం సుబ్రహ్మణ్యశర్మ అన్నారు. 'తెల్లారి లేస్తే పప్పు, పిడకలు, మళ్ళు, చీదరలు, అలుకులు, అధికారాలు, మూలుగులు, మురుకులు, ఇవన్నీ వొదిలి సూర్యోదయాన్ని చూసి నవ్వే మనో వ్యవధి, సంతోషం, ఉత్సాహం ఎప్పుడు కలుగుతుంది మానవులకు?'... ఇలా ఒక జీవితకాలం ప్రశ్నని వేయగల రచయిత నాటికి నేటికీ చలం ఒక్కడే.

1925లో చలం 'Man and Woman' (Excluding The Aspect of Love)' అనే విశిష్ట రచనొకదాన్ని చేశారు. దీన్నే ఆ తర్వాత ఆయన 'స్త్రీ'గా విస్తరించి తెలుగు సమాజంలో ఒక విప్లవాత్మక భావ సంచలనం సృష్టించారు.

చలం 'స్త్రీ' కేవలం స్త్రీలకి మాత్రమే పరిమితం చేసిన రచన కాదు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ, లైంగిక, ఆరోగ్య, సాంస్కృతిక అంశాల విశ్లేషణాత్మక శోధన. ఈ నాటికి చలం 'స్త్రీ'లోని విషయాలు ఎంతో అపురూపమైనవిగా అనిపిస్తాయి. ఒక ఆసక్తికర విషయాన్ని ప్రస్తావించాలి. 1925లో ప్రపంచ మేధావి బెర్ట్రాండ్ రస్సెల్ 'వాట్ ఐ బిలీవ్?' అనే చిన్న పుస్తకాన్ని ప్రచురించాడు. స్త్రీ పురుష సంబంధాలు మొదలుకుని మనిషి నైతిక ప్రమాణాలు, సాంఘిక కార్యాచరణ మరెన్నో విషయాల్ని అందులో ఆయన చర్చించాడు. రస్సెల్ రచనకి విశేష ఆదరణ లభించింది. అదే ఏడాది చలం సూటిగా స్పష్టంగా రాసిన 'స్త్రీ' సంగతి మాత్రం కొద్దో గొప్పో చలం సాహిత్యంతో పరిచయం ఉన్న వారికి మినహా వేరేవరికి సరిగా తెలియను కూడా తెలియదు కదా. 'స్త్రీ' రచనకి మూలమైన, చలం ఏకైక ఆంగ్ల రచన 'Man and Woman'ను 'పురుషుడు–స్త్రీ'గా 2014లో పిఠాపురానికి చెందిన 'ప్రకృతి ప్రచురణలు' తెలుగులోకి తీసుకువచ్చేంత వరకు అసలు అలాటి రచనొకదాన్ని చలం చేశారని చాలా మందికి తెలియదు. పాఠ్యాంశాల్లో భాగం కావాల్సిన చలం రచనలు ఇప్పటికీ చాలా మందికి నిషిద్ధాలుగా ఉన్నాయి. అటు సంప్రదాయవాదులు, ఇటు ఆధునికులు, ఒకవైపు పాలకులు, మరోవైపు మేధావులు కలిసికట్టుగా మౌనం పాటించినా, చలం సాహిత్యాన్ని సమాజం ఆదరిస్తూనే ఉన్నది. ఎందుకంటే, లోకంలో జరుగుతున్న నేరాలు, ఘోరాలు ఎన్నింటికో సమాధానాలు, పరిష్కారాలు చలమే చెప్పగలడు, చూపగలడు కాబట్టి.

> వంద సంవత్సరాల క్రితం వెలుగు చూసిన 'స్త్రీ' చలం సాహిత్య సారాన్ని విశదం చేసే విశిష్ట రచన. తెలుగు సమాజంలోని ప్రగతిశీల ఆలోచనాపరులు ఈ పుస్తకాన్ని ఒక చారిత్రక దార్శనిక పత్రంగా గుర్తించడంలో ఎందుకు విఫలమయ్యారు?



వంద సంవత్సరాల క్రితం వెలుగుచూసిన 'స్త్రీ' చలం సాహిత్య సారాన్ని విశదం చేసే విశిష్ట రచన. మరి తెలుగు సమాజంలోని ప్రగతిశీల ఆలోచనాపరులు ఈ పుస్తకాన్ని ఒక చారిత్రక దార్శనిక పత్రంగా గుర్తించడంలో ఎందుకు విఫలమయ్యారు? వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ఎన్నడూ భాగం కాని స్త్రీ స్వేచ్ఛని, స్త్రీ పురుష సమానతని, జీవన సౌందర్యాన్ని, ప్రకృతి పారవశ్యాన్ని అన్నిటికీ మించిన మహోన్నత మానవతా వాదాన్ని తన మార్గంగా అమలు చేసిన చలాన్ని కనీసం అర్థం చేసుకోవడంలో కూడా అన్యాయమైన వైఖరిని అవలంబించడం దారుణం. ప్రతీ భారతీయ భాషలోకి తర్జుమా చేయాల్సిన చలం 'స్త్రీ' ఈనాటికీ ఎవరో కొద్దిమందికి మినహా తెలుగువారికే తెలియకపోవడం మన వెనుకబాటుతనానికి నిదర్శనం. కులమతాల కుళ్ళుని, వాదాల గోడలను పూర్తిగా నిరాకరించిన చలం చివరికి ఎవరివాడూ కాకుండా మిగిలిపోయాడు. చలాన్ని మరచిపోతే అది సమాజానికి నష్టం కానీ చలానికి కాదు. ఎందుకంటే తెలుగులో చలం పురోగామి చైతన్యానికి చిహ్నం. ఆ చైతన్యం లోపించిన ఏ సమాజంలో అయినా పురోగతి శూన్యం.

కవిగా, రచయితగా, అనువాదకుడిగా, సామాజిక ఆలోచనపరుడిగా, సంఘ సంస్కర్తగా, వ్యంగ్య వ్యాఖ్యాతగా, మహిళా పక్షపాతిగా, తిరుగులేని అధ్యయన వేత్తగా, సమానతా ఉద్యమ నిర్మాతగా అన్నింటికి మించి కళాత్మకత కలిగిన రసైకజీవిగా, గుణాత్మకత రగిలిన స్వాప్నికుడిగా, నిత్య సత్యాన్వేషణా పథంలో పయనించిన మానవీయ సౌందర్యారాధకుడిగా, ప్రకృతి ప్రేమికుడిగా, సౌహార్థిక చింతనశీలిగానే చలాన్ని గుర్తించడం సబబు. అలా, తెలుగులో ఎవరూ గుర్తించని మొదటి కళాత్మక అనార్కిస్టు చలమే.

మనిషి జీవితంలో లైంగికత ఒక దైనందిన వాస్తవం. సెక్స్ గురించిన సరైన అవగాహన లేకపోవడమే మానసిక, శారీరక సమస్యలకు ప్రధాన కారణం. ఈ సత్యాన్ని తెలుగు సమాజంలో గుర్తించిన మొదటి మేధావి చలం. మానవ జీవితంలోని కృత్రిమత్వాన్ని ఎండగట్టి, ఉద్యమ స్థాయిలో స్త్రీ స్వేచ్ఛ కోసం గొంతెత్తిన చలం లాంటి రచయితలు దేశంలోనే అరుదు. ఏ రాజకీయ సామాజిక సిద్ధాంతం జోలికి పోకుండానే ప్రజాస్వామిక విధానాన్ని తనదైన శైలిలో ప్రచారోద్యమంగా తెలుగులో నిర్మించిన ఘనత చలానిదే. మబ్బుల మాటున దాగిన నింగిలో నిబిడీకృతమైన ఎన్నెన్ని అరుదైన రంగురంగుల ఇంద్రధనుస్సుల్ని వెలికి తీసి ప్రపంచానికి పరిచయం చేశాడు? చలం లేని లోకం ఎన్నటికైనా స్వేచ్ఛా గీతాన్ని వినగలిగేదా? సప్తవర్ణాల్ని చూడగలిగేదా? మహిళల్ని, మల్లెపూలను, పిల్లల్ని, పిల్లగాలులను, సూర్యోదయాన్ని, సూక్ష్మమైన జీవిత సారాలను అర్థం చేసుకోగలిగేదా? అందుకనే, చలం వంటి జీవన ఋషి మరెక్కడా కానరాడు. అలాటి చలం, ఆయన రచనలు, జీవితం, చేసిన సుదీర్ఘ పయనం, తప్పొప్పులు అన్నీ తెలుగు జాతి విశిష్ట సంపద. వాటి వెలుగులో అసమానతల గోడల్ని కూలుస్తూ, సమతా మమతల సమాజాన్ని నిర్మించుకోవడమే చలానికి, ఆయన 'స్త్రీ'కి, మన తరం ఇవ్వాల్సిన నివాళి.

▪ గౌరవ్

(నేడు చలం జయంతి. ఈ ఏడాది ఆయన 'స్త్రీ'కి శత వసంతం)



ముక్తీశ్వరుడికి అభిషేకం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి దంపతులు


పుష్కరిణికి పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల, ఖమ్మం ఎంపీ రఘురామ్‌రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర

భక్తజన.. సంగమం

సరస్వతీ పుష్కరాలకు పోటెత్తిన జనం

- వారాంతపు సెలవులతో త్రివేణీ సంగమానికి పెరిగిన రద్దీ
- మూడో రోజు లక్ష మందికిపైగా వచ్చినట్టు అంచనా
- పితృదేవతలకు పిండప్రదానం చేసిన డిప్యూటీ సీఎం
- పుణ్యస్నానమాచరించిన మంత్రి తుమ్మల
- అర్ధరాత్రి వర్షంతో అంతా అతలాకుతలం
- ముక్తీశ్వరుడి దర్శనానికి తప్పని తిప్పలు
- కాళేశ్వరం దారిలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

6

పుష్కరిణికి హారతి పడుతున్న భక్తురాలు

త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

తాళం తెరుచుకుంది!

- సైన్స్ సెంటర్‌లోని ఎస్సీ, ఎస్టీ సెల్‌ను ఓపెన్ చేసిన అధికారులు
- ఉద్యోగులు లేక ఖాళీగానే ఉన్న కార్యాలయం
- అక్రమాలపై డీఎస్‌టీకి ఉద్యోగుల ఫిర్యాదుకు ఏర్పాట్లు
- నిధుల దుర్వినియోగంపై దృష్టి పెట్టని కలెక్టర్
- చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్, మే 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ సైన్స్ సెంటర్‌లోని ఎస్సీ, ఎస్టీ సెల్ కార్యాలయం తాళం తెరుచుకుంది. శనివారం 'ఆంధ్రజ్యోతి' ఉమ్మడిజిల్లా సంచికలో 'టీజీ కాస్ట్ నిధుల్లో గోల్‌మాల్' శీర్షికన ప్రచురితమైన కథనం చర్చనీయాంశమైంది. పైఅధికారుల ఆదేశాలతో ఎట్టకేలకు ఎస్సీ, ఎస్టీ సెల్ తాళం తెరుచుకుంది. అయితే వరంగల్ సైన్స్ సెంటర్‌కు ఎస్సీ, ఎస్టీల స్థితిగతులపై అధ్యాయనం చేసేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ), న్యూఢిల్లీ కేటాయించిన నిధుల గోల్‌మాల్‌పై విచారణపై అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోందన్న చర్చ జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీల స్థితిగతులపై పరిశోధనలు చేసేందుకు మూడేళ్లకు గాను డీఎస్‌టీ రూ.8,08,92,521 కేటాయించింది. ఇందులో మొదటి విడత రూ.1,77,37,953, రెండో విడత రూ.1,65,04,328.. మొత్తం రెండు విడతల్లో రూ.3,42,42,281 విడుదల చేయగా, ఇంకా రూ.4,66,50,240 విడుదల చేయాల్సి ఉంది. అయితే పరిశోధనల రిపోర్టులు చేయకుండానే రెండు ఏజెన్సీలకు నిధులు విడుదల చేయటం, ఉద్యోగులను పరిశోధనలకు పంపించకపోవడం లాంటి అంశాలు డీఎస్‌టీ దృష్టికి వెళ్లింది. ఈ క్రమంలో ప్రాజెక్టుకు కేటాయించిన మూడేళ్ల కాలవ్యవధి కూడా పూర్తయింది. అయితే మూడో విడత నిధులు విడుదల చేయకపోవటం, ప్రాజెక్టు పూర్తయినట్లుగా డీఎస్‌టీ నుంచి టీజీ కాస్ట్‌కు ఎలాంటి సమాచారం రాలేదు. అయినప్పటికి వరంగల్ సైన్స్ సెంటర్ అధికారులు ఎస్సీ, ఎస్టీ సెల్ కార్యాలయానికి తాళం వేయటంతో పాటు ఓ అధికారి వేధింపులతో బయటకు కొందరు ఉద్యోగులు వెళ్లిపోగా, మిగిలిన ఇద్దరిని కూడా ఆఫీసుకు రావద్దని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఉద్యోగులు లేకుండా ఆఫీసు మాత్రమే మిగిలింది.



తెరుచుకున్న సైన్స్‌సెంటర్‌లోని ఎస్సీ, ఎస్టీ సెల్ కార్యాలయం, ఉద్యోగులు లేక ఖాళీగా ఉన్న కార్యాలయం

సూత్రధారి ఎవరు?

టీజీ కాస్ట్ నిధుల గోల్‌మాల్‌లో అసలు సూత్రధారి ఎవరనేది చర్చనీయాంశంగా మారింది. డీఎస్‌టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎస్సీ, ఎస్టీల సామాజిక స్థితిగతులపై అధ్యయనం, అవగాహన కోసం నిధులు కేటాయిస్తే, వాటిని సద్వినియోగం చేయకుండా దారి తప్పించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వెనుక ఎవరున్నారనే చర్చ జరుగుతోంది. సైన్స్ సెంటర్‌లోని ఓ అధికారితో పాటు మరికొందరి హస్తం ఉందనే ప్రచారం జరుగుతోంది. వరంగల్ సైన్స్ సెంటర్‌కు చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ ఈ విషయంపై విచారణకు ఆదేశిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని మాజీ ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఓ సీనియర్ మంత్రి అభయహస్తంతోనే సైన్స్ సెంటర్ లోని ఓ అధికారి చక్రం తిప్పుతున్నారని, ఎలాంటి విచారణ జరుగకుండా సదరు మంత్రితో ఒత్తిడి తీసుకొస్తున్నా రనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది అక్రమా ర్కుల వల్ల డీటీఎస్ ద్వారా ఎస్సీ, ఎస్టీల స్థితిగతులపై జరగాల్సిన పరిశోధనలు ముందుకు సాగకుండా అయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, టీజీ కాస్ట్ నిధుల గోల్‌మాల్‌పై న్యూ ఢిల్లీలోని డీఎస్‌టీలో ఫిర్యాదు చేసేందుకు సైన్స్ సెంటర్‌లోని ఎస్సీ, ఎస్టీ సెంటర్‌లో పని చేసిన తాజా మాజీ ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. తమకు రావాల్సిన వేతనాలతో పాటు నకిలీ ట్రావెలింగ్ బిల్లులు పెట్టి రూ.6లక్షలకు పైగా తీసుకున్న వైనంపై వారు డీటీఎస్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ప్రారంభ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

- అధికారులకు దక్షిణమధ్య రైల్వే జీఎం ఆదేశాలు
- వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాట్ల పరిశీలన


ప్రారంభోత్సవ ఏర్పాట్లపై చర్చిస్తున్న జీఎం అరుణ్ కుమార్ జైన్

గిర్మాజీపేట, మే17 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకం కింద రూ.25.41 కోట్లతో అభివృద్ధి చేసిన వరంగల్ రైల్వేస్టేషన్‌ను ఈనెల 22న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని, ఇందుకోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ భరతేష్ కుమార్, వివిధ విభాగాల డివిజనల్ అధికారులతో కలిసి వరంగల్ రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. ఉదయం 9.30 గంటలకు ప్రత్యేక రైలులో వరంగల్‌కు చేరుకున్న ఆయన.. నూతనంగా ఏర్పాటుచేసిన ఎస్కలేటర్‌ను, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని పరిశీలించారు. లిఫ్టులు, ర్యాంపులను చూసి జీఎం సంతృప్తి వ్యక్తం చేశారు.జనరల్, ప్రీపెయిడ్ విశ్రాంతి మందిరాలను పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. తరువాత వీఐపీ లాంజ్, స్టేషన్ మేనేజర్ రూమ్‌లు, బుకింగ్ కౌంటర్, ఎటీవీఎంలను పరిశీలించారు. తరువాత వరంగల్ వైపు ల్యాండ్ స్కేపింగ్, స్టేషన్ ఎలివేషన్‌ను చూశారు. 22న జరిగే ప్రారంభోత్సవ ఏర్పాట్లకు సంబంధించి అధికారులతో చర్చించారు. ప్రధాన మంత్రి వర్చువల్‌గా ప్రారంభిస్తున్నందున కెమెరాలు, టీవీ తెరలు ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్‌లో చేసిన అభివృద్ధి పనులను డీఆర్ఎం భరతేష్ కుమార్, సీనియర్ డీసీఎం బాలాజీ కిరణ్, డిఈఎన్ (సౌత్) దినకర్ జీఎంకు వివరించారు. అనంతరం 10.40 గంటలకు జీఎం పెద్దపల్లికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దేబస్మిత చటోపాధ్యాయ బెనర్జీ, సీనియర్ డిఓఎం సురేష్ రెడ్డి, వరంగల్ సీసీఐ బి.రాజ్‌గోపాల్, కాజీపేట అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ సుభాష్, వరంగల్ ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాస్ గౌడ్, జీఆర్‌పీ సీఐ పి.సురేందర్, ఇతర రైల్వే అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయండి


స్విమ్మింగ్‌పూల్ పనులను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

- నగర మేయర్ గుండు సుధారాణి
- కౌన్సిల్‌హాల్, స్విమ్మింగ్ పూల్ పనుల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, మే 17 (ఆంధ్రజ్యో తి): బల్దియా ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. శనివారం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి కౌన్సిల్‌హాల్, స్విమ్మింగ్‌పూల్ వద్ద జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించారు. అక్కడి ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కౌన్సిల్‌హాల్‌లో చేపడుతున్న టైల్స్ నమూనాను పర్యవేక్షించా రు. తర్వాత స్విమ్మింగ్‌పూల్ వద్దకు చేరుకుని ఆక్వా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్, కమిషనర్ అదేశించారు. త్వరగా స్విమ్మింగ్‌పూల్ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలని సంయుక్తంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఈఈలు రవికుమార్, మాధవీలత, డీఈ కార్తీక్‌రెడ్డి, ఏఈలు రాగి శ్రీకాంత్‌రెడ్డి, నరేష్‌లు పాల్గొన్నారు.

'జల్‌హీ అమృత్' కార్యక్రమ లక్ష్యాలను అమలు చేయండి

'జల్‌హీ అమృత్' కార్యక్రమ లక్ష్యాలను అమలు చేయాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. శనివారం మేయర్ చాంబర్‌లో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0లో భాగంగా చేపడుతున్న జల్‌హీ అమృత్ కార్యక్రమ లక్ష్యాలను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్టార్ ర్యాంకింగ్ రేటింగ్ ప్రకారం వరంగల్ నగర పాలక సంస్థ చోటు సంపాదించుకోగా రూ.3కోట్ల ప్రత్యేక నిధులు జల్ హీ అమృత్ పథకం ద్వారా మంజూ రు అయ్యాయని అన్నారు. ప్రస్తుతం రూ.2.10 కోట్లు విడుదల కాగా, వరంగల్ నగరంలో 5.15ఎంఎల్‌డీ ఎస్‌సీపీలలో ఆన్‌లైన్ కంటిన్యూ యిస్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా ఎస్‌టీపీ ద్వారా సోలార్ ఎనర్జీని తయారు చేయడంతో పాటు మురకినీటి శుద్ధీకణ జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు రవికుమార్, మాధవిలత, సంతోష్‌బాబు, స్మార్ట్‌సిటి పీఎంసీ ఆనంద్ ఓలేటి పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరంతో రాష్ట్రం సుభిక్షం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



త్రివేణి సంగమంలో పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కాళేశ్వర్యం, మే 17 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమంలోని అంతర్వాహినిగా ఉన్న సరస్వతి నదీ పుష్కరాలలో శనివారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పుష్కర స్నానమచరించారు. ఈ సందర్భంగా ఆయన ముక్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సరస్వతీ పుష్కరాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తోం దన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్వర్యంలో మొదటి సారి ఈ పుష్కరాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని, ఏర్పాట్లు ఘనంగా చేశామని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు, జిల్లా అధికారులకు కితాబిచ్చారు. ఆయన వెం ట ఖమ్మం ఎంపీ రామసాయం రఘురామిరెడ్డి, రామగుండం, భూపాలపల్లి ఎమ్మెల్యేలు మక్కల్ సింగ్, గండ్ర సత్యనారయణరావు ఉన్నారు.

పుష్కర స్నానమాచరించిన తపోవనం పీఠాధిపతి

ఆలయంలో మూడోరోజు స్వయంవర పార్వతి, హయగ్రీవ హోమాలు

కాళేశ్వరం, మే 17 (ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాల్లో మూడోరోజైన శనివారం తుని తపోవనం పీఠాధిపతి శ్రీసచ్చిదానంద సరస్వతీ స్వామి పుష్కర స్నానమాచరించారు. సరస్వతీ ఘాట్ వద్దకు చేరుకున్న ఆయనకు దేవాదాయ శాఖ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం త్రివేణి సంగమంలో ప్రత్యేక పూజలు చేసి పుణ్యస్నానమాచరించి ముక్తీశ్వరాలయానికి రాగా ఆయనకు ఆలయ అధికారులు, అర్చక స్వాములు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో మహారుద్రాభిషేకం, శుభానంద దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సచ్చిదానంద సరస్వతికి వినాయక స్వామి విగ్రహన్ని బహూకరించారు. కాగా నేడు పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతి మహాస్వామి రానున్నారు. సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో మూడో రోజు శ్రీకాళేశ్వరాలయంలో స్వయంవర పార్వతి హోమం, శ్రీహయగ్రీవ హోమాలను వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మేదాశక్తి, జ్ఞాపక శక్తి పెరిగేందుకు హయగ్రీవ హోమం, వివాహం కోసం స్వయంవర పార్వతి హోమాలను నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు.



ఆలయానికి వస్తున్న సచ్చిదానంద సరస్వతి స్వామి

అంతర్వాహినీ.. పావనం సరస్వతీ పుష్కరాలు

భక్తజన.. సంగమం

సరస్వతీ పుష్కరాలకు పోటెత్తిన జనం

- వారాంతపు సెలవులతో త్రివేణి సంగమానికి పెరిగిన రద్దీ
- మూడోరోజు లక్ష మందికి పైగా వచ్చినట్లు అంచనా
- పితృదేవతలకు పిండ ప్రదానం చేసిన డిప్యూటీ సీఎం
- పుణ్య స్నానమాచరించిన మంత్రి తుమ్మల
- అర్ధరాత్రి వర్షంతో అతలాకుతలం
- ముక్తీశ్వరుడి దర్శనానికి తప్పని తిప్పలు
- కాళేశ్వరం దారిలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్





సరస్వతీ ఘాట్ వద్ద భక్తుల పుణ్యస్నానాలు, అకాల వర్షంతో చిత్తడిగా మారిన పుష్కరఘాట్ పరిసరాల నుంచి ఎడ్లబండ్లపై భక్తుల రాకపోకలు

భూపాలపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి) : త్రివేణి సంగమం.. భక్తజన సంద్రమైంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తొలిసారిగా నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాలకు మూడో రోజు భక్తజనం పోటెత్తారు. 'నమామీ సరస్వతీ మాత.. హర హర మహదేవ' అన్న నామకీర్తనలతో కాళేశ్వరం పరవశించింది. వారాంతపు సెలవులు రావడంతో శనివారం భక్తుల సంఖ్య ఊహించని స్థాయిలో పెరిగింది. వెరసి కాళేశ్వర పరిసరాలు వేలాది వాహనాలతో కిక్కిరిసి పోయాయి. ఇక మూడోరోజైన శనివారం సుమారు లక్ష మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలచరించారు. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

అకాల వర్షంతో సతమతం

శుక్రవారం అర్ధరాత్రి భారీ వర్షం కురవడంతో కాళేశ్వర పరిసరాలన్నీ చిత్తడిగా మారి పార్కింగ్ పాయింట్లు నిరుపయోగంగా మారాయి. దీంతో మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వచ్చే దారిలో సుమారు ఏడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం ఏర్పడింది. అయినప్పటికి భక్తులు కాలినడకన పుష్కరఘాట్లకు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. సరస్వతీ పుష్కరఘాట్ సమీపంలో ఏర్పాటు చేసిన టెంట్ సిటీలో కొన్ని గదులు స్వల్పంగా ఒరిగాయి. గాలి తీవ్రతకు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన టెంట్లు, చలువ పందిళ్లు ఎక్కడిక్కడ కూలిపోయాయి. దేవాదాయశాఖ, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కటౌట్లు నేలమట్టమయ్యాయి. ఫ్లెక్సీలు ఎక్కడిక్కడ చిరిగిపోయాయి. శనివారం ఉదయం నుండి అధికార యంత్రాంగం దిద్దుబాటు చర్యలు చేపట్టినా భక్తుల సంఖ్య పెరగడంతో అందుబాటులోకి రాలేదు. సాయంత్రం వరకు టెంట్ల పునురుద్ధరణ పూర్తయ్యింది. విద్యుత్ లైన్లు సైతం నేలకొరగగా ఉదయం పది గంటల వరకు పునరుద్ధరించారు.

ఏడు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

శనివారం పుష్కరాలకు భక్తుల తాకిడి పెరగడంతో మహదేవపూర్-కాళేశ్వరం మధ్యలో సుమారు 7కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఊహించని స్థాయిలో వాహనాలు రావడం, ట్రాఫిక్‌జాం కావడంతో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే సిబ్బందికి బదులుగా తామే స్వయంగా వెళ్లి ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు యత్నించారు. ఆ తర్వాత సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు.





సమన్వయం కుదిరేదెప్పుడు ?

సరస్వతీ పుష్కరాలు ప్రారంభమై మూడు రోజులు గడిచిన ప్రధాన శాఖల్లో సమన్వయం కుదరడం లేదు. దేవాదాయ, పోలీసు శాఖలతో పాటు పలు శాఖల్లో ఈలోపం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధానంగా దేవాదాయ శాఖ అధికారులు ఇతర ఏ శాఖకు సహకరించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు పోలీసు అధికారులతో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు దేవాదాయ శాఖ అధికారుల తీరుపై ఆగ్రహంగా ఉన్నారు. పోలీస్ శాఖతో పాటు ఇతర శాఖల్లోనూ ఉన్నతాధికారుల ఆదేశాలను కింది స్థాయి సిబ్బంది బేఖాతరు చేయడంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అటు ఆలయంలో పనిచేసే అర్చకులను పదే పదే పోలీస్ శాఖ అధికారులు బయటకు పంపడం చర్చనీయాంశంగా మారుతోంది. ఈ విషయంలో జిల్లా అధికార యంత్రాంగాన్నే ఆలయ అధికారి ఒకరు తప్పుదోవ పట్టిస్తున్నారనే చర్చ నడుస్తోంది. ఇప్పటికైన అధికార యంత్రాంగం దిద్దుబాటు చర్యలు చేపడితే మిగతా రోజుల్లోనైన ఈసమస్యలను అధిగవించే అవకాశాలున్నాయి. ఆలయ ఆవరణతో పాటు పుష్కరఘాట్‌ల వద్ద చిన్న చిన్న సమస్యలు తలెత్తిన వాటిని పరిష్కరించలేని విధంగా యంత్రాంగం పనిచేస్తుందనే విమర్శలు వస్తున్నాయి.

కరువైన మౌలిక వసతులు

సరస్వతీ పుష్కర ఘాట్ వద్ద త్రివేణి సంగమంలో కనీస మౌలిక వసతులు కరువయ్యాయి. తాగునీరు లేకపోవడంతో పాటు మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హడావుడితో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లకు డోర్లు సరిగా లేకపోవడంతో ఉన్నా లేని చందమైంది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో మంచినీరు, శీతల పానియాల ధరలు అమాంతం పెంచేశారు. ఒక్క రూపాయి ఉన్న వాటర్ ప్యాకెట్‌ను ఐదు రూపాయలకు విక్రయిస్తుండటం ఇందుకు నిదర్శనం.

పుష్కరాలకు వీఐపీల తాకిడి

మూడోరోజు పుష్కరాలకు వీఐపీల తాకిడి కూడా పెరిగింది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పుణ్యస్నానాలాచరించారు. వీరితో పాటు ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, ఠాకూర్ మక్కాన్ సింగ్ తదితరులు కూడా ఉన్నారు. అంతకుముందు ఉపముఖ్యమంత్రి భట్టి తన సోదరుడితో కలిసి త్రివేణి సంగమం వద్ద తమ పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. అనంతరం ఆలయంలో కాలసర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం ఉపముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం పాడిపంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కాళేశ్వరాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో నదులు సక్రమంగా పారుతూ పంటలతో విరాజిల్లాలని ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా రాష్ట్రం ప్రపంచంతో పోటీపడే స్థాయికి ఎదగాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు దగ్గరుండి పుష్కర ఏర్పాట్లను పర్యవేక్షించారని ప్రశంసించారు. మంచి మనసుతో అమ్మవారిని కోరుకుంటే అన్ని సిద్ధిస్తాయని, అమ్మ చల్లని చూపు ప్రజలపై ఉంటుందని, పుష్కర స్నానంతో సకల పాపాలు తొలగుతాయన్నారు. పుష్కరాలకొచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం మంచి సదుపాయాలు కల్పించిందని కితాబిచ్చారు.



అధికారులకు సూచనలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



చిన్నారికి స్నానం



సెల్ఫీ తీసుకుంటున్న కుటుంబం



పితృదేవతలకు సామూహిక పిండ ప్రదానాలు



కాళేశ్వరానికి వచ్చే దారిలో ట్రాఫిక్ జామ్ కావడంతో నడుచుకుంటూ వస్తున్న భక్తులు

'ఫ్రీ' బస్సుతో పెరిగిన మహిళల రాక

కాళేశ్వరం, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో తెలంగాణ నలుమూలల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పుష్కరాలకు తరలొస్తున్నారు. సరస్వతీ పుష్కరాలకు అధిక మొత్తంలో బస్సులు నడుపుతున్న ప్రభుత్వం.. మహిళలకు ఉచిత ప్రయాణం అని ప్రకటించడంతో మహిళల రాక పెరుగుతోంది.



కాళేశ్వరం బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తున్న మహిళలు

వైభవంగా నవరత్న హారతి

కాళేశ్వరం, మే 17 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వర త్రివేణి సంగమంలో సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకుని శనివారం రాత్రి 8 గంటలకు ఏడుగురు కాశీపండితులు నవరత్న హారతీ వైభవోపేతంగా నిర్వహించారు. సమాజ హితం కోసం పలురకాలుగా దోహదపడే విధంగా నవరత్న హారతులను 12రోజుల పాటు ఘనంగా నిర్వహించడానికి దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మిక సంగీతంతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హారతులతో కూడిన నవరత్న హారతిని పండితులు కనుల పండువగా నిర్వహించారు. సుమారు గంటపాటు నిర్వహించిన నవరత్న హారతీ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు అందుబాటులో మరిన్ని బస్సులు

అన్ని డిపోల నుంచి వేల సంఖ్యలో కాళేశ్వరానికి సర్వీసులు

హనుమకొండ టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమైన సరస్వతీ పుష్కరాలకు పుణ్యస్నానాలకు వెళ్లే ప్రయాణికుల కోసం వరంగల్ రీజినల్ పరిధిలో ఆర్టీసీ అధికారులు బస్‌స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే హనుమకొండ బస్టాండ్ నుంచి కాళేశ్వరం వరకు 15న గురువారం రోజున 64 బస్సు సర్వీస్‌లను నడపగా 2,777 మంది ప్రయాణించారన్నారు. శుక్రవారం 84 బస్సు సర్వీసులు నడుపగా 3,288 మంది ప్రయాణం చేసినట్లు తెలిపారు. శనివారం 98 బస్సు సర్వీసుల్లో 4,300మందికి పైగా ప్రయాణికులు కాళేశ్వరం తరలివెళ్లినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు బస్సు సర్వీస్‌లను ఏర్పాటు చేసి సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుస్తున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. హనుమకొండ బస్టాండ్ నుంచి నాన్ స్టాప్ బస్సులతో ప్రయాణికులకు బస్సు సర్వీసులను అందుబాటులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకొని హనుమకొండ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీతో బస్టాండ్ ప్రాంగణం కిక్కిరిసిపోతోంది. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఆర్టీసీ సెక్యూరిటీ అధికారులు, పోలీసు సిబ్బంది, షీటీమ్స్, ఏఆర్ పోలీసు సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్నట్లు ఆర్ఎం తెలిపారు.

ట్రాఫిక్ విధుల్లో కలెక్టర్, ఎస్పీ

కాళేశ్వరం, మే 17 (ఆంధ్రజ్యోతి) : పుష్కరాల మూడో రోజైన శనివారం భక్తుల తాకిడి పెరగడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అన్నారం క్రాస్ నుంచి కాళేశ్వరం వరకు 7 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోవడం, సమస్య జటిలం కావడం తో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే రంగంలోకి దిగారు. వారే స్వయంగా బైక్‌పై వెళ్లి ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు యత్నించారు. వారాంతం కావడంతో భారీగా భక్తులు తరలివస్తారన్న అంచనాలున్నా అధికారులు సరిపడా పోలీస్ సిబ్బందిని నియమించకపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో కలెక్టర్, ఎస్పీ తప్పనిపరిస్థితుల్లో ట్రాఫిక్ విధుల్లోకి దిగాల్సి వచ్చింది.



ట్రాఫిక్‌ను క్లియర్ చేయించడానికి బైక్‌పై వెళ్తున్న కలెక్టర్, ఎస్పీ

పుష్కరాల్లోనూ 'బేటీ బచావో.. బేటీ పడావో'

కాళేశ్వరం, మే 17 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రజాహిత, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన, ప్రచార కార్యక్రమాలు చేపట్టి సేవలందిస్తున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం, పోషణ్ అభియాన్ తదితర విభాగాలతో స్టాల్‌ను ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకోవడానికి ఆటవస్తువుల ఏర్పాటు, పోషకాహారం పదార్థాలు ఏర్పాటు చేశారు. భేటీ పడావో..భేటీ బచావో.. కార్యక్రమంలో భాగంగా 'సెల్ఫీ విత్ డాటర్' పేరిట కూతుళ్లతో ఫొటోలు దిగడానికి ఏర్పాట్లు చేసినట్లు సీడీపీవో రాధిక తెలిపారు.



'సెల్ఫీ విత్ డాటర్' పాయింట్ వద్ద దంపతులు, అధికారులు

పాక్‌కు సైనిక రహస్యాలు

(మొదటి పేజీ తరువాయి)



జ్యోతి మల్హోత్రా

అక్కడి ఎలక్ట్రానిక్ సెన్సార్లను చిత్రీకరించి వాట్సాప్, టెలిగ్రామ్‌ల ద్వారా పాక్ ఏజెంట్లకు చేరవేసిందని పేర్కొన్నారు. ఈ కేసులో జ్యోతి మల్హోత్రాని శనివారం అరెస్టు చేయగా న్యాయస్థానం ఐదు రోజుల రిమాండ్ విధించింది.

ఇలా పట్టేశారు...

చిత్రీకరించిన సైనికపరంగా సున్నితమైన వీడియోల ఫుటేజీ మొత్తాన్ని ఆమె వెంటనే పాక్ హై కమిషన్ కార్యాలయం నుంచి భారత్ బహిష్కరించిన ఉద్యోగి అహ్సాన్ ఉర్ రహీమ్ అలియాస్ డానిష్ నంబరుకు పంపిస్తోందని హరియాణా-పంజాబ్ సైబర్ సెల్ పోలీసులు గుర్తించారు. పోలీసులు అరెస్టు చేసిన మరో ఐదుగురి వద్దా ఆ నెంబరును గుర్తించారు. 'ఆపరేషన్ గోస్ట్ సిమ్' పేరిట చేసిన పరిశోధనలో వీరందరిని గుర్తించి అధికారిక రహస్యాలు అక్రమంగా చేరవేసిన కేసులో అరెస్టు చేశారు.

ఇఫ్తార్ విందులో...

మల్హోత్రా గత ఏడాది మార్చిలో పోస్ట్ చేసిన ఓ వీడియోలో ఢిల్లీలోని పాక్ హై కమిషన్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం కనిపిస్తోంది. ఇందులో అక్కడి ఏర్పాట్లను ఆమె ఎంతో మెచ్చుకున్నారు. పాకిస్థాన్ మరెన్నోసార్లు వెళ్లాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. పాక్ హై కమిషన్ ఉద్యోగి డానిష్‌తో సంభాషిస్తూ ఆమె ఆ వీడియోలో కనిపించారు. గతంలో తాము కలుసుకున్న సందర్భాలనూ ప్రస్తావించారు. అతడి భార్యతోనూ చనువుగా మాట్లాడారు. సాధారణ పరిచయాన్ని మించిన సన్నిహితత్వం వారి మధ్య కనిపించింది. కాగా జ్యోతి మల్హోత్రాతో పాటు మరో ఇద్దరు మహిళలు, ముగ్గురు యువకులను హరియాణా పోలీసులు ఈ కేసులో అరెస్టు చేశారు. వీరి నెట్‌వర్క్ హరియాణా, పంజాబ్ రాష్ట్రాలతోపాటు ఉత్తర భారతమంతా విస్తరించినట్లు భావిస్తున్నారు. 'ట్రావెల్ విత్ జో' పేరిట యూట్యూబ్ చానల్ నడుపుతోన్న జ్యోతి మల్హోత్రా 2023లో పాకిస్థాన్‌కు వెళ్లింది. ఆ సమయంలో ఢిల్లీలోని పాకిస్థాన్ హై కమిషన్ కార్యాలయంలో పనిచేసే డానిష్ ఆమెకు పరిచయమయ్యాడు. ఇతడు జ్యోతికి పలువురు పాకిస్థాన్ ఏజెంట్లను పరిచయం చేశాడు. వాట్సాప్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్‌ల ద్వారా జ్యోతి వారితో టచ్‌లో ఉంది. షకీర్ అలియాస్ రాణా షహబాజ్ అనే పాక్ ఏజెంట్ వారిలో ఒకడు. అతడి నంబరును జాట్ రణ్‌ధావా పేరుతో జ్యోతి సేవ్ చేసుకుంది. సామాజిక మాధ్యమాల్లో పాక్ గురించి మంచిగా ప్రచారం చేసేందుకు ఈమెను ఉపయోగించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఒక పాక్ ఏజెంట్‌కు బాగా దగ్గరయిన జ్యోతి అతడితో ఇండోనేషియా పర్యటనకూ వెళ్లింది. కాగా డానిష్‌ను ఈ నెల 13న కేంద్రం అవాంఛనీయ వ్యక్తిగా ప్రకటించి దేశం విడిచి వెళ్లాల్సిందిగా ఆదేశించింది. జ్యోతితో పాటు పంజాబ్‌లోని మలేర్‌కోట్లకు చెందిన మరో వితంతు మహిళ గుజాల(32) కూడా ఈ కేసులో కీలక నిందితురాలు. వీసా కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో పాక్ హై కమిషన్ కార్యాలయానికి వెళ్లిన ఆమెకు డానిష్ పరిచయమయ్యాడు. అతడితో తరచూ మాట్లాడుతూ ఉండేది. పెళ్లి చేసుకుంటానని డానిష్ ఆమెకు దగ్గర అయ్యాడు. ఏప్రిల్ 23న గుజాల మలేర్‌కోట్లకే చెందిన వితంతు మహిళ బాను నస్రీనను పాక్ హై కమిషన్ కార్యాలయానికి తీసుకువెళ్లగా డానిష్ ఆమెకు మరుసటి రోజే పాక్ వీసా ఇప్పించాడు. కాగా ఈ కేసులో అరెస్టయిన మరో ముగ్గురు వ్యక్తులు మలేర్‌కోట్లకు చెందిన యమీన్ మహమ్మద్, పటియాలలోని ఖల్సా కళాశాల విద్యార్థి దేవిందర్ సింగ్ ధిల్లాన్, నుహ్‌కు చెందిన అర్మాన్. యమీన్ డానిష్‌తో కలిసి ఆర్థిక, వీసా జారీ వ్యవహారాలు నడిపాడు. ధిల్లాన్ మే 12న తన ఫేస్‌బుక్ ఖాతాలో గన్, పిస్టల్ చిత్రాలను పోస్ట్ చేశాడు. దీంతో అతడిని అరెస్టు చేసిన పోలీసులు పలు కీలక వివరాలు రాబట్టారు. గత ఏడాది నవంబరులో కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా పాక్ వెళ్లిన అతడు అక్కడ ఐఎస్ఐ ఏజెంట్లకు భారత్‌కు సంబంధించిన సున్నిత సమాచారాన్ని అందజేశానని వెల్లడించాడు. అందుకు తనకు పెద్దమొత్తంలో డబ్బు ముట్టిందని చెప్పాడు. పటియాల కంటోన్మెంట్ వీడియోలూ ఇతడు పాక్‌కు పంపినట్లు గుర్తించారు. అర్మాన్ సిమ్ కార్డులు సమకూర్చడం, డబ్బు పంపిణీ వ్యవహారాలు చేశాడు. అంతేగాక పాక్ ఏజెంట్ల సూచనల మేరకు డిఫెన్స్ ఎక్స్‌పో-2025ని కూడా సందర్శించాడు. కాగా నిందితులంతా తమ నేరాలను అంగీకరించారు. పాక్ ఏజెంట్లు సమాజంలో మతపరంగా, సామాజికంగా సున్నిత మనస్తత్వం గలవారిని గుర్తించి డబ్బు, ప్రేమ, పెళ్లి పేరిట వలలో వేసుకుంటున్నారని పోలీసులు తెలిపారు.

పాలస్తీనా ప్రజలంతా లిబియాకు?

వాషింగ్టన్, మే 17: ఇజ్రాయెల్ దాడుల్లో కకావికలమైన గాజా ప్రాంతం నుంచి పాలస్తీనీయులను ఖాళీ చేయించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. సుమారు పది లక్షల మంది పాలస్తీనా ప్రజలను శాశ్వతంగా లిబియాకు తరలించనున్నట్టుగా అమెరికా అధికార వర్గాలను ఉటంకిస్తూ.. ఎన్‌బీసీ న్యూస్ కథనాన్ని ప్రచురించింది. దీనికి సంబంధించి లిబియా ప్రభుత్వంతో అమెరికా సీనియర్ అధికారులు చర్చలు జరుపుతున్నారని పేర్కొంది. పాలస్తీనా ప్రజల తరలింపునకు బదులుగా అమెరికా ఫ్రీజ్ చేసిన వేల కోట్ల రూపాయల లిబియా నిధులను విడుదల చేస్తామని ప్రతిపాదించినట్టు తెలిపింది. పూర్తిగా విధ్వంసమైన గాజా పరిస్థితి ఏమీ బాగోలేదని, ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, వారిని ఖాళీ చేయించి.. దానిని స్వేచ్ఛా ప్రాంతం(ఫ్రీడమ్ జోన్)గా అభివృద్ధి చేస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలోనే ప్రకటించడం గమనార్హం. మరోవైపు పాలస్తీనా తమ మాతృభూమి అని, దాన్ని రక్షించుకునేందుకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని పాలస్తీనా హమాస్ సీనియర్ అధికారి బసెమ్ స్పష్టం చేశారు. లిబియాలో సుమారు 14 ఏళ్ల క్రితం అంతర్యుద్ధం చెలరేగింది. అప్పటి నుంచీ ఆ దేశంలో పరిస్థితి అస్తవ్యస్తంగానే ఉంది. లిబియా పశ్చిమ ప్రాంతంలో అబ్దుల్ హమీద్ నేతృత్వంలో, తూర్పు ప్రాంతంలో ఖలీఫా హఫ్తార్ నేతృత్వంలో పాలన కొనసాగుతోంది. మొత్తం దేశంపై పట్టు కోసం ఈ రెండు వర్గాల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇదిలా ఉండగా, ఆపరేషన్ 'గిడియాన్స్ చారియట్స్' పేరుతో ఇజ్రాయెల్ శనివారం గాజాపై విరుచుకుపడింది. ఈ దాడుల్లో 100 మంది మరణించారు. గాజా భూభాగంలో యుద్ధాన్ని ఉధృతం చేయడంలో భాగంగా అపహరణకు గురైనవారి విడుదలతో పాటు హమాస్‌ను ఓడించడం వంటి లక్ష్యాలను సాధించడానికే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు ఇజ్రాయెల్ సైన్యం 'టెలిగ్రాం'లో పోస్టు చేసింది.

ట్రంప్ నోట మళ్లీ జీరో టారిఫ్ మాట!



న్యూయార్క్, మే 17: భారత సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి అక్కసు వెళ్లగక్కారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 100 శాతం సుంకాలను తగ్గించుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందంటూ మళ్లీ మొదటికొచ్చారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం కోసం తానేమి తొందరపడటం లేదని చెప్పారు. తాజాగా ఓ న్యూస్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. 'ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. వారు వ్యాపారాలు చేయడాన్ని దాదాపు అసాధ్యం చేస్తున్నారు. ప్రతీకార సుంకాల నేపథ్యంలో అమెరికాకు 100% సుంకాలు తగ్గించుకునేందు (జీరో టారిఫ్‌ల) కు సిద్ధంగా ఉన్నారు. ఆ దేశంతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం అమల్లోకి రానుంది. ఈ విషయంలో నాకేం తొందరలేదు. మాతో ఒప్పందానికి చాలా దేశాలు ముందుకొస్తున్నాయి. అందరితో ఒప్పందాలంటే మా వల్ల కాదు. ప్రస్తుతం భారత్‌తో చర్చలు జరుగుతున్నాయి' అంటూ వ్యాఖ్యానించారు. ఇదివరకు ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలే చేయగా.. భారత్ తోసిపుచ్చింది.

'నీట్' ఫలితాల విడుదలపై మద్రాస్ హైకోర్టు స్టే

చెన్నై, మే 17(ఆంధ్రజ్యోతి): 'నీట్' ఫలితాల విడుదలపై మద్రాసు హైకోర్టు స్టే విధించింది. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర యూజీ వైద్య కోర్సులకు మే 4న నీట్‌ను నిర్వహించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందిపడిన తమకు మళ్లీ పరీక్ష నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ తిరువళ్లూర్, రాణిపేట జిల్లాలకు చెందిన 13మంది విద్యార్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలను విచారించిన మద్రాసు హైకోర్టు... ఫలితాల విడుదలపై స్టే విధించింది.

మా ఎయిర్‌బేస్‌లను భారత్ దెబ్బతీసింది



నూర్‌ఖాన్ వైమానిక స్థావరంపై దాడి చేసింది

- తొలిసారి అంగీకరించిన దాయాది దేశం
- దాడుల విషయం ఆర్మీచీఫ్ అర్ధరాత్రి తెలిపారు
- ధ్రువీకరించిన ప్రధాని షెహబాజ్ షరీఫ్

న్యూఢిల్లీ, మే 17 : ఆపరేషన్ సిందూర్ దెబ్బ బలంగా తగిలిన విషయం ఎట్టకేలకు దాయాది దేశం అంగీకరించింది. తమ వైమానిక స్థావరాలపై భారత్ దాడులు జరిపిందని పాకిస్థాన్ తొలిసారి ఒప్పుకొంది. రావల్పిండిలోని నూర్‌ఖాన్ సహా పలు ప్రాంతాల్లోని ఎయిర్‌బేస్‌లపై ఈ దాడులు జరిగాయని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ స్వయంగా ధ్రువీకరించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలు, ఎయిర్‌బేస్‌లపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. తమ ఎయిర్‌బేస్‌లు లక్ష్యంగా దాడులు జరిగినట్టు ఈ నెల 10వ తేదీ తెల్లవారుజామున, 2.30 గంటలకు, ఆర్మీ చీఫ్ మునీర్ ఫోన్‌చేసి తనకు తెలిపారని షెహబాజ్ వివరించారు. ఆయన ప్రకటనకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఆ వీడియోను అనుసరించి.. ప్రధాని షరీఫ్ శుక్రవారం రాత్రి ఓ కార్యక్రమంలో మాట్లాడారు. భారత క్షిపణులు తమ లక్ష్యాన్ని చేరుకున్నాయని ఆయన అంగీకరించారని పాకిస్థాన్‌కు చెందిన జియో న్యూస్‌ను ఉటంకిస్తూ ఏఎన్ఐ వార్తాసంస్థ తెలిపింది. భారత్ దాడులను ఎదుర్కొనేందుకు స్వదేశీ సాంకేతికతతోపాటు చైనా తయారీ జెట్లను వైమానిక దళం ఉపయోగించిందని తెలిపారు. కాగా, పాక్ ప్రధాని వ్యాఖ్యల వీడియోను బీజేపీ నేత అమిత్ మాలవీయా 'ఎక్స్'లో పంచుకున్నారు. "నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ సహా ఇతర స్థావరాలను భారత్ పేల్చివేసిందని స్వయంగా పాకిస్థాన్ అంగీకరించింది. పాక్‌లో బాగా లోపలకు చొచ్చుకెళ్లి మనం జరిపిన క్షిపణి దాడుల వార్తలతో అర్ధరాత్రి ప్రధాని షెహబాజ్ షరీఫ్ నిద్రలేశారు. ఆపరేషన్ సిందూర్ విధ్వంస విస్తృతి ఏ స్థాయిలో ఉన్నదనేది ఇది తెలియజేస్తోంది" అని ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌ను కాదని థరూర్‌కు పట్టం

(మొదటి పేజీ తరువాయి)

మా పార్టీ అధ్యక్షుడు ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీని.. అఖిలపక్షం బృందాలకు పేర్లను పంపాలని కోరారు. కేంద్ర మాజీ మంత్రి ఆనంద్ శర్మ, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్, రాజ్యసభ ఎంపీ సయ్యద్ నాసిర్ హుస్సేన్, లోక్‌సభ ఎంపీ రాజా బ్రార్ పేర్లను రాహుల్‌గాంధీ ప్రతిపాదించారు. కేంద్రం మాత్రం ఏకపక్షంగా శశిథరూర్ పేరును ప్రకటించింది. దీన్ని బట్టి, ముందుగానే పేర్లను నిర్ణయించుకుని, నామమాత్రంగా ఖర్గే, రాహుల్‌ను పేర్లివ్వాలని అడిగారని స్పష్టమవుతోంది" అని వ్యాఖ్యానించారు. ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రకటనపై మోదీ మౌనం వీడడం లేదని ఎద్దేవా చేశారు.



థరూర్, రవిశంకర్, బైజయంత్, సంజయ్‌కుమార్ ఝా, కనిమొళి, సుప్రియా సూలే, శ్రీకాంత్ శిందే

ఆ ఏడుగురు ఎంపీలు వీరే..

ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించబోమనే సందేశాన్ని ఐక్య రాజ్య సమితి(ఐరాస) భద్రతామండలిలోని సభ్య దేశాలతోపాటు.. ఇతర ప్రధాన భాగస్వామ్య దేశాలకు వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం శనివారం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో ఆరేడుగురు ఎంపీలతో పాటు.. సీనియర్ దౌత్యవేత్తలు, మాజీ రాయబారులుంటారు. ఈ బృందాలకు.. ఏడుగురు ఎంపీలు నేతృత్వం వహిస్తారు. వీరిలో నలుగురు అధికార ఎన్డీయే కూటమి, మరో ముగ్గురు విపక్ష ఇండియా కూటమి పార్టీల పార్లమెంట్ సభ్యులు. ఈ జాబితాలో శశిథరూర్(కాంగ్రెస్), రవిశంకర్‌ప్రసాద్(బీజేపీ), బైజయంత్ పాండా(బీజేపీ), సంజయ్‌కుమార్ ఝా(జేడీయూ), కనిమొళి(డీఎంకే), సుప్రియా సూలే(ఎన్‌సీపీ-శరద్‌పవార్), శ్రీకాంత్ శిందే(శివసేన) ఉన్నారు. ఈ నెల 22 తర్వాత ఈ బృందాలు విదేశాలలో పర్యటించే అవకాశాలున్నాయి. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది చనిపోవడం, పాక్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్', పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఈ బృందాలు విదేశాలలో ప్రచారం చేస్తాయి.


పీవీ బాటలో మోదీ!

దౌత్య యుద్ధంపై మాజీ ప్రధాని పీవీ బాటనే ఇప్పుడు మోదీ ఎంచుకున్నట్లు తెలుస్తోంది. 1994లో కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ పాకిస్థాన్ దుష్ప్రచారం చేసింది. జెనీవాలోని ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల కమిషన్‌లో తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. దాంతో పీవీ అప్పటి విపక్ష నేత వాజ్‌పేయి నేతృత్వంలో ఓ ప్రతినిధి బృందాన్ని జెనీవాకు పంపించారు. ఆ బృందంలో అప్పటి జమ్మూకశ్మీర్ సీఎం ఫరూక్ అబ్దుల్లా, సల్మాన్ ఖుర్షీద్, హామీద్ అన్సారీ ఉన్నారు. వీరి దౌత్య నీతితో పాక్ ప్రవేశపెట్టిన తీర్మానం వీగిపోయింది. 2008లో కూడా ముంబై ఉగ్రదాడుల్లో పాక్ ప్రమేయముందనే సందేశాన్ని ప్రపంచదేశాలకు అందించేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ బృందాలను పంపారు. ఇప్పుడు మోదీ కూడా.. పాక్ కుతంత్రాలపై ప్రపంచానికి వివరించే ప్రయత్నం చేస్తున్నారు.

డీ4 వ్యవస్థ కోసం బీఈఎల్, ఆర్మీ మధ్య ఒప్పందం

డ్రోన్ దాడులను సమర్థవంతంగా అడ్డుకునేందుకు దోహదపడే ఇంటిగ్రేటెడ్ డ్రోన్ డిటెక్షన్ అండ్ ఇంటర్‌డిక్షన్ సిస్టమ్ (ఐడీడీఐఎస్ లేదా డీ4)కు సంబంధించి భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), భారత ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ శుక్రవారం ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ వ్యవస్థను మేక్ ఇన్ ఇండియాలో భాగంగా డీఆర్‌డీవో, బీఈఎల్‌లు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. శత్రు డ్రోన్లను గుర్తించడంతోపాటు ట్రాక్ చేయడం, ధ్వంసం చేయడానికి ఐడీడీఐఎస్‌ను అభివృద్ధి చేశారు. ఇది గగనతల ముప్పుల నుంచి రక్షణ కల్పించడంలో కీలకంగా మారుతోంది. గత ఏప్రిల్ 7 తర్వాతి నుంచి అదనంగా రూ.572 కోట్ల విలువైన ఆర్డర్లను పొందినట్టు బీఈఎల్ వెల్లడించింది. సంస్థ పొందిన ప్రధాన ఆర్డర్లలో ఐడీడీఐఎస్‌తో పాటు సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో(ఎస్‌డీఆర్), జామర్లు, విడిభాగాలు వంటివి ఉన్నాయి.

లోకం తీరు



తుర్కియేకు అమెరికా 'సైడ్ విండర్' క్షిపణులు

న్యూఢిల్లీ, మే 17 : తుర్కియేకు 304 మిలియన్ డాలర్ల విలువైన క్షిపణులను విక్రయించే ఒప్పందానికి ఇటీవల ఆమోదం తెలిపిన అమెరికా.. ఆ ఒప్పందంలో భాగంగా 60 ఏఐఎం-9ఎక్స్ సైడ్ విండర్ క్షిపణులను సరఫరా చేయనుంది. స్వల్ప శ్రేణి ఎయిర్ టు ఎయిర్ క్షిపణి అయిన సైడ్ విండర్‌ను ఎఫ్-16వీ యుద్ధ విమానాల్లో వినియోగించవచ్చు. గగనతలంలో యుద్ధ విమానాల మధ్య జరిగే పోరులో ఈ సైడ్ విండర్ క్షిపణులు అత్యంత ప్రభావం చూపుతాయి. తుర్కియే ఇటీవల 40 ఎఫ్-16వీ విమానాలను సమకూర్చుకోగా.. ఈ సైడ్ విండర్‌లతో ఆ దేశ వాయుసేన మరింత బలోపేతం కానుంది. అయితే, భారత్‌కు వ్యతిరేకంగా ఇటీవల పాకిస్థాన్‌కు డ్రోన్లు, క్షిపణులు అందజేసిన తుర్కియే.. ఈ సైడ్‌విండర్‌లను కూడా పాక్‌కు ఇచ్చే ప్రమాదం ఉంది.

బ్రహ్మోస్ క్షిపణుల కోసం మరో 20 సుఖోయ్ విమానాల అప్‌గ్రేడ్

న్యూఢిల్లీ, మే 17: పాకిస్థాన్, చైనాలకు కంటి మీద నిద్ర లేకుండా చేసేందుకు మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. ఆపరేషన్ సిందూర్‌లో పాక్ వెన్ను విరవడంలో బ్రహ్మోస్ క్షిపణులు కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో బ్రహ్మోస్-ఏ క్షిపణులను మోసుకెళ్లేందుకు వీలుగా మరో 20 సుఖోయ్ యుద్ధ విమానాలను అప్‌గ్రేడ్ చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో బ్రహ్మోస్-ఏ క్షిపణులను మోసుకెళ్లే సామర్థ్యం గల సుఖోయ్ యుద్ధ విమానాల సంఖ్య 60కి చేరుకుంది. ఈ బాధ్యతను హెచ్ఏఎల్‌కి అప్పగించారు. ప్రస్తుతం 2.5-టన్నుల బ్రహ్మోస్-ఎ క్షిపణిని సుఖోయ్ విమానం మోసుకెళ్లగలుగుతుంది. ఇక నుంచి 2.8 టన్నుల బ్రహ్మోస్-ఎ క్షిపణిని 400 కి.మీలకు పైగా దూరంలోని లక్ష్యాన్ని ఢీకొట్టేలా సుఖోయ్ విమానాలను అభివృద్ధి చేస్తారు.

రాష్ట్రపతికి గడువు.. కేంద్రమే పెట్టింది!



2016లో రెండు మెమోలు జారీ చేసిన కేంద్ర హోంశాఖ

- రాష్ట్రాల బిల్లుల మీద 3 నెలల్లోపు ఆమోదం తెలుపాలని రాష్ట్రపతికి సూచన
- ఆ మెమోలనే ప్రస్తావించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 17: రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించి పంపిన బిల్లుల మీద గవర్నర్లు, రాష్ట్రపతి నిర్ణీత గడువులోపు ఆమోదముద్ర వేయాలని పేర్కొంటూ సుప్రీంకోర్టు తీర్పునివ్వటం మీద రాష్ట్రపతి తాజాగా ఆక్షేపణ తెలిపిన విషయం తెలిసిందే. అయితే, బిల్లుల ఆమోదం గడువు విషయంలో సుప్రీంకోర్టు కొత్తగా ఏమీ చెప్పలేదని, కేంద్రప్రభుత్వం గతంలో స్వయంగా విడుదల చేసిన కొన్ని అధికారిక ఉత్తర్వులనే ప్రస్తావించి, వాటిని అమలు చేయాలని నిర్దేశించిందని తాజాగా వెల్లడైంది. ప్రభుత్వ నిర్ణయాల్లో జాప్యాన్ని నివారించటం కోసం.. బిల్లులను రాష్ట్రపతి మూడు నెలల్లోపు ఆమోదించాలని సూచిస్తూ కేంద్ర హోంశాఖ 2016లో రెండు మెమోలు జారీ చేసింది. తీర్పును వెలువరించిన సందర్భంగా జస్టిస్ జేబీ పార్దివాలా వీటి గురించి ప్రస్తావిస్తూ.. 'గవర్నర్ సిఫార్సు మేరకు అందిన బిల్లుల మీద మూడు నెలల్లోపు రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర హోంశాఖ పేర్కొన్న గడువు సముచితమైనదేనని భావిస్తున్నాం' అని స్పష్టం చేశారు. ఈ మేరకు 2016 ఫిబ్రవరి 4వ తేదీన కేంద్ర హోంశాఖ జారీ చేసిన తొలి మెమోను సుప్రీంకోర్టు తన తీర్పులో ఉదహరించింది. 'స్పష్టమైన నిబంధనలున్నప్పటికీ, రాష్ట్రాల బిల్లులకు సంబంధించి అనవసర జాప్యం జరుగుతోంది. దీనిని నివారించటానికి, రాష్ట్రాల నుంచి బిల్లు అందిన మూడు నెలల్లోపు తుది నిర్ణయం తీసుకోవాలి. దీనిని కచ్చితంగా పాటించాలి' అని ఈ మెమో స్పష్టంగా పేర్కొనటం గమనార్హం. అంతేకాదు, రాష్ట్రాల నుంచి వచ్చిన బిల్లులలోని అంశాల ఆధారంగా సదరు బిల్లులను సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలకు పంపటంలో కేంద్రహోంశాఖ మధ్యవర్తిగా వ్యవహరిస్తుందని, బిల్లులోని భాష, పదాల కూర్పు, రాజ్యాంగపరమైన ఆమోదాన్ని కలిగి ఉందా? అన్నవాటిని పరిశీలించటానికి కేంద్ర న్యాయ శాఖకు పంపాలని ఆ మెమో పేర్కొంది. బిల్లును అందుకున్న మంత్రిత్వశాఖ 15 రోజుల్లోపు తన స్పందన హోంశాఖకు తెలియజేయాలని, జాప్యం జరిగితే అందుకు కారణాలు తెలపాలని స్పష్టం చేసింది. నెలలోపు ఎటువంటి స్పందన లేకపోతే, సదరు శాఖకు ఆ బిల్లు మీద అభ్యంతరాలు లేవని భావించాలని తెలిపింది.

నెలలోపు రాష్ట్రాలు వివరణ ఇవ్వాలి

2016 ఫిబ్రవరి 4వ తేదీనే కేంద్రహోంశాఖ జారీ చేసిన రెండో మెమోను కూడా సుప్రీంకోర్టు తన తీర్పులో ఉదహరించింది. బిల్లు మీద సంబంధిత కేంద్ర మంత్రిత్వశాఖకు ఏమైనా అభ్యంతరాలున్నా, మరిన్ని వివరాలు కావాలని భావించినా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కచ్చితంగా తెలియజేయాలని, రాష్ట్ర ప్రభుత్వాలు నెలలోపు వివరణ ఇవ్వాలని ఈ మెమో పేర్కొంది. నిర్ణయాత్మక ప్రక్రియలో ఉన్న వివిధ భాగస్వాములకు గడువు విధించటం అనేది.. రాజ్యాంగ విధులను నిర్దేశించే ఆర్టికల్ 201కు ఏ రకంగానూ విరుద్ధం కాదని జస్టిస్ పార్దివాలా స్పష్టం చేశారు. ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ పంపిన బిల్లులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని గతంలో వచ్చిన సర్కారియా, పూంఛీ కమిషన్లు చేసిన సిఫార్సులకు తగినట్లుగానే 2016లో కేంద్రం జారీ చేసిన మెమోలు ఉన్నాయని నిపుణులు గుర్తు చేస్తున్నారు.

ముంబైలో ఇద్దరు ఐఎస్ సభ్యుల అరెస్ట్

న్యూఢిల్లీ, మే 17: ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్ర సంస్థకు చెందిన నిద్రాణ దళాల(స్లీపర్ మాడ్యూల్)తో సంబంధం ఉన్న ఇద్దరు వ్యక్తులను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అరెస్ట్ చేసింది. అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ డైపర్‌వాలా, తల్హా ఖాన్ 2023లో మహారాష్ట్రలోని పుణెలో ఐఈడీ తయారీ, పరీక్షలకు సంబంధించిన కేసులో నిందితులు. రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నారు. వీరిపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. వీరి సమాచారం ఇచ్చిన వారికి ఎన్ఐఏ రూ.3 లక్షల చొప్పున నగదు బహుమతిని ప్రకటించింది. తాజాగా వీరిద్దరూ ఇండోనేషియా రాజధాని జకర్తాలో తలదాచుకుంటున్నట్లు సమాచారం అందుకున్న ఎన్ఐఏ.. బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ సాయంతో అరెస్టు చేసింది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎన్ఐఏ వీరిని అదుపులోకి తీసుకుంది.

జన్యువును మార్చి.. మృత్యువును ఏమార్చి!

- అమెరికాలో 7 నెలల చిన్నారికి అరుదైన 'జన్యు సవరణ' చికిత్స
- భారత సంతతి వైద్యుడు కిరణ్ ముసునూరు కీలకపాత్ర



కిరణ్ అండ్ రెబెక్కా

వాషింగ్టన్, మే 17: అమెరికాలోని పెన్సిల్వేనియాకు చెందిన చిన్నారి కేజే మల్దూన్. పుట్టుకతోనే ఏదో అనారోగ్యం. పరీక్షలు చేసిన వైద్యులు 'సీపీఎస్ 1'గా పిలిచే అరుదైన జన్యులోపంగా గుర్తించారు. సగటున ప్రతి 13 లక్షల మందిలో ఒకరికి మాత్రమే వచ్చే సమస్య. ఇలా పుట్టిన చిన్నారుల్లో చాలా మంది కొన్ని నెలల్లోనే చనిపోతారు. ఒకవేళ బతికినా మానసిక, శారీరక ఎదుగుదల సరిగా ఉండక.. జీవచ్ఛవంలా బతకాల్సిందే. లక్షల మందిలో ఒకరికి వచ్చే సమస్య కాబట్టి.. దీనిపై పెద్ద స్థాయిలో పరిశోధనలు, ఔషధాల తయారీ వంటివేవీ లేవు. కానీ.. అమెరికా వైద్య నిపుణులు అత్యంత అరుదైన జన్యు సమస్యకు.. అంతే వినూత్నమైన 'జన్యు సవరణ (జీన్ ఎడిటింగ్)' చికిత్స చేసి కేజే ప్రాణాలు నిలబెట్టారు. జన్యుమార్పిడి చికిత్సల్లో ఉపయోగించే క్రిస్పర్ విధానం సాయంతో.. ఆ చిన్నారిలోని జన్యువులోని రసాయనాల అమరికలో ఉన్న లోపాన్ని సవరించారు. ఇలా 'ఓ వ్యక్తిలోని జన్యులోపాన్ని వారికే ప్రత్యేకించిన (పర్సనలైజ్డ్/ కస్టమైజ్డ్ జీన్ ఎడిటింగ్ థెరపీ) చికిత్స'తో నయం చేయడం ప్రపంచంలో ఇదే మొదటిసారి.

సరికొత్త విధానంలో రూపొందించి..

కేజే పుట్టిన రెండు వారాలకే అతడి కాలేయ కణాల్లోని ఓ జన్యువులో లోపాన్ని వైద్యులు గుర్తించారు. జీవక్రియల్లో భాగంగా మన శరీరంలో ఉత్పత్తయ్యే అమ్మోనియా, ఇతర విష పదార్థాలను నిర్వీర్యం చేసే ఎంజైమ్‌ను కాలేయం ఉత్పత్తి చేయడానికి ఆ జన్యువే కీలకం. దానిలో లోపం వల్ల ఆ ఎంజైమ్ సరిగా ఉత్పత్తిగాక.. శరీరంలో విష పదార్థాలు పేరుకుపోయి.. మెదడు దెబ్బతింటుంది. కోమాలోకి వెళ్లిపోయి, చనిపోయే ప్రమాదం ఉంటుంది. దీనిపై ఫిలడెల్ఫియా పిల్లల ఆస్పత్రి నిపుణురాలు రెబెక్కా ఆర్లెన్స్ నిక్లాస్, పెన్సిల్వేనియా యూనివర్సిటీ వైద్య నిపుణుడు, భారత సంతతికి చెందిన కిరణ్ ముసునూరు బృందం ఫోకస్ చేసింది. వినూత్నమైన ప్రయోగాత్మక చికిత్స చేసేందుకు కేజే తల్లిదండ్రులు నికోల్, కైల్‌లను ఒప్పించింది. కణాల్లోని జన్యువులను కత్తిరించి.. ఏదైనా భాగాన్ని తొలగించడానికి, అవసరమైతే అతికించడానికి వీలయ్యే 'క్రిస్పర్ కాస్9' విధానాన్ని వినియోగించింది. కేజే కాలేయ కణాలను సేకరించి పరిశోధన చేసింది. అతడి కాలేయ కణాల్లోకి చొచ్చుకెళ్లి.. లోపం ఉన్న జన్యుభాగాన్ని మార్చేలా ఆదేశాలు ఇచ్చే పదార్థాన్ని రూపొందించింది. ఇందుకోసం సుమారు ఆరు నెలల సమయం పట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కేజే (అప్పటికి ఏడు నెలల వయసు)కు దానితో చికిత్స చేసింది. రెండు నెలల పాటు పూర్తిగా పర్యవేక్షణ చేసి, చికిత్స విజయవంతమైందని తేల్చింది. ఇప్పుడు కేజే పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్టు ప్రకటించింది. జన్యుపరమైన సమస్యలతో బాధపడుతున్నవారికి ప్రత్యేకించిన చికిత్సలు చేసేందుకు ఈ ప్రయోగం మార్గం సుగమం చేసిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

నేడు నింగిలోకి నిఘా నేత్రం

- పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ ద్వారా ఈవోఎస్-09 ఉపగ్రహ ప్రయోగం



ఐదేళ్ల దాకా సేవలు

ఈ ఉపగ్రహం ఐదేళ్లు సేవలందించనుంది. పాకిస్థాన్‌తో పాటు చైనా సరిహద్దుల్లోని సున్నిత ప్రదేశాలపై ఈ ఉపగ్రహం కన్ను ఉంటుంది. దేశ సరిహద్దు రక్షణే కాకుండా వ్యవసాయం, అటవీ, భూగర్భం, ప్రకృతి వైపరీత్యాలపై ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తుంది. రీశాట్-1బీ ఉపగ్రహం కక్ష్యలోకి చేరిన 101 నిమిషాల తరువాత తన పని ప్రారంభిస్తుంది.

సూళ్లూరుపేట, మే 17(ఆంధ్రజ్యోతి): సరిహద్దుల్లో నిరంతర నిఘా కోసం ఉద్దేశించిన ఈవోఎస్-09 (రీశాట్-1బీ) ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీసీ 61 రాకెట్ నేడు నింగిలోకి మోసుకెళ్లనుంది. తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి ఆదివారం ఉదయం 5.59 గంటలకు ఈ ప్రయోగం జరగనుంది. శనివారం ఉదయం 7.59 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. 22 గంటల పాటు ఈ కౌంట్‌డౌన్ కొనసాగుతుంది. ఒకటో ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీసీ 61 రాకెట్ అంతరిక్షంలోకి దూసుకెళ్లనుంది. కాగా, రాకెట్‌లో ద్రవ ఇంధనం, హీలియం, నైట్రోజన్ గ్యాస్‌ను నింపే కార్యక్రమాన్ని శాస్త్రవేత్తలు పూర్తిచేశారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ శుక్రవారం రాత్రి షార్‌కు చేరుకొని ప్రయోగ వేదిక పైనున్న పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్‌ను పరిశీలించారు. రీశాట్-1బీ ఉపగ్రహం బరువు 1,696.24 కిలోలు. దేశ భద్రత, సైనిక అవసరాల కోసం దీన్ని ప్రయోగిస్తున్నారు. భారత్‌కు ఇప్పటికే అంతరిక్షంలో 50కి పైగా ఉపగ్రహాలు ఉన్నాయి. ఈ రాడార్ ఇమేజింగ్ శాటిలైట్ వాటితో జత కలవనుంది. ఇప్పటికే కార్టోశాట్-1 ఉపగ్రహం లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో తిరుగుతూ చిత్రాలు అందిస్తోంది. అయితే అది రాత్రివేళల్లో ప్రతికూల వాతావరణంలో ఉపయోగపడటం లేదు. తాజాగా పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ ద్వారా ప్రయోగించే ఈవోఎస్-09 ఉపగ్రహంలో అమర్చిన సీ-బ్యాండ్ సింథటిక్ ఎపర్చర్ రాడార్ ద్వారా ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా అధిక రెజల్యూషన్‌తో కూడిన భూ ఉపరితల చిత్రాలు లభిస్తాయి.

అందుబాటులో సబ్సిడీ జీలుగ విత్తనాలు

హసన్‌పర్తి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, పీఏసీఎస్ సొసైటీలలో పచ్చిరొట్ట(జీలుగ) విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి అడ్లూరి అనురాధ తెలిపారు. ప్రస్తుతం మండలానికి 300 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరి అయ్యాయని, అవసరమైన రైతులకు 30 కిలోల బస్తాకు రైతు వాటా కింద రూ.2137.50 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత ఏఈవోల దగ్గర పట్టా పాస్‌పుస్తకం, ఆధార్‌తో సంప్రదించి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం హసన్‌పర్తి ఆగ్రోస్ సేవా కేంద్రంలో 300 బస్తాలు, వంగపహాడ్ పీఏసీఎస్ కేంద్రంలో 200 బస్తాలు, మల్లారెడ్డిపల్లి పీఏసీఎస్ కేంద్రంలో 166 బస్తాలు, పెగడపల్లి పీఏసీఎస్ కేంద్రంలో 334 బస్తాలు (పెగడపల్లి పీఏసీఎస్ 184 బస్తాలు, పీఏసీఎస్ ముచ్చర్లలో 150 బస్తాలు) అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సోమవారం నుంచి రైతులు జీలుగ బస్తాల కోసం సంబంధిత పీఏసీఎస్ సేవా కేంద్రాలతోపాటు ఆగ్రోస్ సేవా కేంద్రాలను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ సత్యేంద్రనాథ్

రక్తపోటుపై అవగాహన ర్యాలీ

వరంగల్ మెడికల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా సోమిడి పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ర్యాలీ అనంతరం సోమిడి జంక్షన్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కన్సల్టెంట్ డాక్టర్ సత్యేంద్రనాథ్ మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, ఆందోళన కారణంగా రక్తపోటు, డయాబెటిస్ కేసులు చాలావరకు పెరుగుతున్నాయని తెలిపారు. తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం ద్వారా వీటిని నియంత్రించవచ్చని సూచించారు. 30 ఏళ్ల పైబడిన వారందరినీ ఆరోగ్య సిబ్బంది స్క్రీనింగ్ చేస్తారని, రక్తపోటు నివారణకు మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఇఫ్తిదర్ అహ్మద్, మాతా శిశు సంక్షేమ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మంజుల, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, సోమిడి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనిత, ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ఖాదర్ అబ్బాస్, క్రాంతి, సూపర్‌వైజర్ రమేశ్, సీహెచ్ జ్యోతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీఎస్ ఏసీపీగా కిరణ్‌కుమార్



వరంగల్ క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ఏసీపీగా వి.కిరణ్‌కుమార్ శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. నర్సంపేట ఏసీపీగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను ఇటీవలే డీజీపీ కార్యాలయా నికి అటాచ్ చేశారు. తాజాగా శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ సీసీఎస్ ఏసీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేయడంతో తక్షణమే కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

ఇద్దరు అధ్యాపకులకు పదోన్నతి



అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సహోద్యోగులు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ ఈ.కృష్ణయ్య, డాక్టర్ శ్రీదేవిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, శ్రీనాథ్, శివనాగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భర్త సోదరి ఇంటి వద్ద భార్య ఆందోళన

వరంగల్ క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి) : దంపతుల మధ్య చోటుచేసుకున్న మనస్పర్థల కారణంగా రెడ్డికాలనీలో భర్త సోదరి ఇంటి ఎదుట భార్య చంటి పాపతో శనివారం ఆందోళనకు దిగింది. స్థానికులు డయల్ 100కు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన విరమింపచేసి స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై ఎస్సై పరుశురాములను వివరణ కోరగా భార్యాభర్తలకు, వారి కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి నట్లు తెలిపారు. కాగా, గతంలోనే భార్య ఫిర్యాదుతో భర్తపై కేసు నమోదై నట్లు పోలీసులు తెలిపారు.

సీసీ కెమెరాలకు పోలీసుల మరమ్మతు

హనుమకొండ టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలో పనిచేయని సీసీ కెమెరాలకు సీఐ పి.సత్యనారాయణరెడ్డి ఆదేశాలతో పోలీసు సిబ్బందితో మరమ్మతులు చేపట్టారు. ఇటీవలకాలంలో వరుస చోరీలతో అప్రమత్తమైన సుబేదారి పోలీసులు.. శనివారం పోలీసుస్టేషన్ పరిధిలోని పలుకాలనీలను సందర్శించి పనిచేయని కెమెరాలను గుర్తించారు. సుమారుగా 750కి పైగా సీసీ కెమెరాలు ఉండగా, 100 కెమెరాలు మాత్రమే పనిచేస్తున్నాయని సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. త్వరలోనే మిగతా కెమెరాలను అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా వేగవంతంగా మరమ్మతులు చేస్తున్నట్లు వెల్లడించారు.

రైల్వేస్టేషన్‌లో డ్రగ్స్ కంట్రోల్ టీమ్ తనిఖీ



కాజీపేట రైల్వేస్టేషన్‌లో జాగిలంతో తనిఖీ చేస్తున్న డ్రగ్స్ కంట్రోల్ టీమ్

వరంగల్ క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా శనివారం కాజీపేట రైల్వేస్టేషన్‌లో సీపీ ఆదేశాలతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్స్ కంట్రోల్ టీమ్ జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానిత వ్యక్తులతో పాటు బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సురేశ్, ఆర్ఐ శివకేశవులు, ఆర్ఎస్సై పూర్ణేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడికి ప్రత్యేక పూజలు

మడికొండ, మే 17 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని బురుజు వద్ద గల ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో వైశాఖ మాస పంచమి సందర్భంగా స్వామి వారికి ఆలయ పూజారి ఉపద్రష్ట మంత్రవాది వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలు, పంచవర్ణాలతో అభిషేకాలు చేశారు. పూజలలో హనుమాన్ మాలధారులు పసుల కిషన్, జిట్ట చంటి, అంకూస్ అప్పి, ఆసోద భవిత్, ప్రశాంత్, వలబోజు క్రిష్ణ, కొలిపాక భాస్కర్, వలబోజు నాగార్జున, జిట్ట సదానందం, దండిగం రాజు, రాజేందర్, పవన్, బన్నీ, కృతిక, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- రూ.40 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కాజీపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాజీపేటను అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ఏకైక లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాజీపేట 62వ డివిజన్ సోమిడిలోని పలు కాలనీల్లో రూ.40 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే నాయిని శనివారం మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. సోమిడి బతుకమ్మ ఆట స్థలం కోసం చెరువు పునరుద్ధరణ పనులకు రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నామని, అధికారులు వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమార్‌స్వామి, సుంచు అశోక్, నాయకులు అరూరి సాంబయ్య, సిరిల్ లారెన్స్, మాచర్ల జయాకర్, రఫీ, రవి, నీలక్క, బొంద్యాల్, శివరాం, అశోక్, రమేశ్, తాడూరి ప్రశాంత్, జక్కుల నవీన్, రాంకీ, సుధీర్, సుంచు వేణు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్

ఆటో కార్మికులకు అండగా ఉంటా..

నగరంలో ఆటో కార్మికులకు ఎలాంటి సమస్యలొచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కాజీపేటకు చెందిన ట్రైసిటీ ఆటో యూనియన్ నాయకులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఇందులో ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలు విన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటానని అన్నారు. అనంతరం ఆటో యూనియన్ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు మైసారపు సిరిల్ లారెన్స్, ముఖ్య సలహాదారుడు సిలవేరు విజయ్‌భాస్కర్, అధ్యక్షుడు గడప శ్రీనివాస్, కోశాధికారి జేరుపోతుల వెంకటేశ్వర్లు, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

వడ్డేపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): పింగిళి ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు అందిస్తున్న అవకాశాలను విద్యార్థినులు అందిపుచ్చుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో జూలై 25, 26 తేదీల్లో 'డిజిటల్ ఎకానమీ ద ఇంపాక్ట్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆన్ గ్లోబల్ మార్కెట్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి గౌడ్, సదస్సు కన్వీనర్ డాక్టర్ పి.పద్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకుకు ఐఎస్‌వో సర్టిఫికెట్

హనుమకొండ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాలకు అత్యుత్తమ సేవలందించినందుకు గుర్తింపుగా వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అంతర్జాతీయ ప్రామాణీకరణ సంస్థ(ఐఎస్‌వో) సర్టిఫికెట్‌ను అందుకుంది. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు శనివారం సర్టిఫికెట్‌ను అందుకున్నారు. హైదరాబాద్‌లోని టెస్కాబ్ ప్రధాన కార్యాలయంలో ఐఎస్‌వో మేనేజింగ్ డైరెక్టర్ శివయ్య నుంచి రవీందర్‌రావు సర్టిఫికెట్‌ను పొందారు. నాబార్డ్, ఆర్‌బీఐ ఆదేశాలను అనుసరిస్తూ వ్యవసాయ సంబంధిత రంగాలు, రైతులకు ఆర్థిక సేవలను ఉత్తమంగా అందచేస్తున్నందుకు డీసీసీబీకి గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా మార్నేని రవీందర్ మాట్లాడుతూ.. బ్యాంక్ పాలకవర్గం, ఉద్యోగులు రైతులకు సేవలు అందించడంతో సమష్టిగా చేసిన కృషి ఫలితమే ఐఎస్‌వో గుర్తింపుగా పేర్కొన్నారు. ఐదేళ్ల నుంచి ఎన్నో సమస్యలు ఎదురైనా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, ప్రణాళిక ప్రకారం బ్యాంకు ఉన్నతమైన స్థానాలను చేరుకుంటుందన్నారు. పాలకవర్గం, బ్యాంకు సిబ్బందికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియచేస్తున్నట్లు వెల్లడించారు. రైతులకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా మరింత బాధ్యతతో పని చేస్తామని రవీందర్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో టెస్కాబ్ ఎండీ కృష్ణారావు, అదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి పాల్గొన్నారు.



ఐయస్‌వో సర్టిఫికెట్ అందుకుంటున్న మార్నేని రవీందర్‌రావు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం వడ్డేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని మిత్రగనర్, డాక్టర్స్ కాలనీ, ప్రణయ్‌భాస్కర్ కాలనీ, కేఎస్‌ఆర్ అపార్ట్‌మెంట్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కార్పొరేటర్ శివకుమార్

హసన్‌పర్తి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగట్టు గుట్ట క్రాసు రోడ్డులోని దేవాలయ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా నిర్మాణాలను తొలగించాలని 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌ను కోరారు. శనివారం గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌కు లిఖితపూర్వకమైన ఫిర్యాదు అందజేశారు. గతంలో కూడా కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా ఎర్రగట్టు దేవాలయ భూమి, సంస్కృతి విహార్ భూమిని ఆనుకొని అక్రమ నిర్మాణాలు చేపట్టారని, వీటిపై కూడా సమగ్ర విచారణ జరిపి నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయాలని కోరారు. ప్రస్తుతం సమాజంలో పలుకుబడి కలిగిన ఓ వ్యక్తి ఆలయ భూమిలో కార్పొరేషన్ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, ఈవిషయంపై కేయూసీ పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్రమ నిర్మాణాలలో ఉన్న పోల్స్‌ను తొలగించినట్లు తెలిపారు. అయినప్పటికి కొంత మందిని తన పలుకుబడితో మచ్చిక చేసుకొని తిరిగి అక్రమంగా నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నట్లు తెలిపారు ఇప్పటికైనా సంబంధిత కార్పొరేషన్ అధికారులు దేవాలయ భూమి సమీపంలో కార్పొరేషన్ అనుమతులు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన ఇళ్లపై పునఃపరిశీలన చేసి తక్షణమే కూల్చివేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కార్పొరేటర్ శివకుమార్ అధికారులను కోరారు.



దేవాలయ భూమిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన దృశ్యం


చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

హసన్‌పర్తి, మే 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. మండలంలోని కోమటిపల్లి కమ్యూనిటీ హాల్‌లో శనివారం సఖి సెంటర్ నిర్వహణ, బాధిత మహిళలకు అందిస్తున్న సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట లైంగిక వేధింపులు, అత్యాచారాలకు గురైన పుడు రక్షణ పొందడానికి సఖి సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. సమస్య ఉన్న మహి ళలు ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబర్ 181, చైల్డ్ లైన్ నెంబర్ 1098కు కాల్ చేయడం ద్వారా తక్షణ సహాయం, రక్షణ లభిస్తుందని తెలిపారు. 08702452112, 7382983088 నెంబర్లకు కాల్ చేస్తే బాధిత మహిళలకు తక్షణ సహాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో సఖి కేస్ వర్కర్లు భారతి, శోభ, ఇందిర, కళావతి, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

డీపీఎల్ రెండో సెషన్ ప్రారంభం

వరంగల్ మెడికల్, మే 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్స్ ప్రీమియం లీగ్ సెషన్-2 పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలో ఈ పోటీలను కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి శనివారం రాత్రి ప్రారంభించారు. పలువురు వైద్యులు ఆసక్తిగా ఈ లీగ్‌లో పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్సీ, బీఎల్ఐఎస్సీ పరీక్షల తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రం తదితరులు

కేయూ క్యాంపస్, మే 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రంలో నిర్వహిస్తున్న బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ పరీక్షలను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ కట్లలు శనివారం తనిఖీ చేశారు. నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ పి.వెంకటయ్య, డాక్టర్ జి.పద్మజ, డాక్టర్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఎంబీఏ ఆఖరు సెమిస్టర్ పరీక్షలు షురూ

కాకతీయ యూనివర్సిటీ ఎంబీఏ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో జరిగిన పరీక్షల కేంద్రంలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ పరిశీలించారు. మొత్తం 2100మంది విద్యార్థులకు 1950 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షల కేంద్రాన్ని సర్శించిన వారిలో కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసీం ఇక్బాల్, డాక్టర్ ప్రగతి, అమరవేణి పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న నలుగురిపై కేసు

ఎక్స్‌కవేటర్, మూడు ట్రాక్టర్లు సీజ్

హసన్‌పర్తి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారం పెద్ద చెరువు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని ఒక ఎక్స్‌కావేటర్‌తోపాటు మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు. నాగారం పెద్ద చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండా శనివారం కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు మొరం తరలిస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఇజ్జగిరి వినోద్‌కు చెందిన ఎక్స్‌కావేటర్, మునిపల్లికి చెందిన మూల శ్రావణ్, నాగారంకు చెందిన కుమారస్వామి, సీతనాగారంనకు చెందిన కొప్పుల రమేష్‌లకు చెందిన ట్రాక్టర్లను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. అనంతరం ఇరిగేషన్ ఏఈ నాగవెల్లి శ్రీనివాస్‌కు సమాచారం అందించి వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

ముత్య కిడ్నీ సెంటర్‌లో అరుదైన శస్త్ర చికిత్స

లేజర్ విధానంతో మూత్రపిండంలోని రాళ్లు తొలగింపు




పేషెంట్‌తో డాక్టర్లు మన్నెం శ్రీనాథ్‌రెడ్డి, బచ్చు చందుకృష్ణ

వరంగల్ మెడికల్, మే 17 (ఆంధ్రజ్యోతి): అత్యంత అరుదైన లేజర్ చికిత్స విధానం ద్వారా మూత్రపిండంలోని రాళ్లను శస్త్ర చికిత్స ద్వారా తొలగించామని హనుమకొండలోని ముత్య కిడ్నీ సెంటర్ ప్రముఖ యూరాలజిస్టులు డాక్టర్ మన్యం శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ బచ్చు చందుకృష్ణ తెలిపారు. భద్రాచలా నికి చెందిన 54 ఏళ్ల వ్యక్తి వెన్నె ముక వంకరగా ఉండే సమస్య (క్రైఫో స్కోలియోసిస్)తోపాటు అభివృద్ధి చెందలేని ఎడమ ఊపిరి తిత్తులతో బాధపడుతూ మూత్ర పిండంలో రాళ్ల సమస్యతో తమ ఆస్పత్రికి వచ్చినట్లు తెలిపారు. కొన్నిరకాల వైద్య నిర్ధారణ పరీక్షల అనంతరం రోగి ఎడమ మూత్ర పిండం పొజిషన్ తప్పుగా ఉండి అందులో మూడు రాళ్లు ఉన్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. మూత్రనాళాలు వంకరగా ఉండటం, వెన్నుముక వంకరగా ఉండటంతో పాటు బలహీనంగా ఉండటంవల్ల కిడ్నీ శస్త్ర చికిత్సతో పాటు స్పైనల్ అనస్థీషియా ఇవ్వడం కూడా పెద్ద సవాల్‌గా మారిందని వివరించారు. రోగి క్లిష్ట పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని అనస్థీషియా వైద్య వైద్య నిపుణుడు డాక్టర్ కృష్ణ వైబోగి శరీరంలోని దిగువ భాగానికి మాత్రమే స్పైనల్ అనస్థీషి యా సమర్థవంతంగా ఇచ్చి శస్త్ర చికిత్సకు సురక్షిత మార్గం ఏర్పర్చారని తెలిపారు. అనంతరం యూరాలజిస్టు డాక్టర్ మన్నెం శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ బచ్చు చందుకృష్ణలు కలిసి అత్యాధునిక 60 వాట్ లేజర్ సాంకేతికతతో ఎడమ రెట్రోగ్రేడ్ ఇంట్రా రినల్ సర్జరీ పూర్తి చేసి మూడు రాళ్లను కోత, కుట్టు లేకుండా 45 నిమిషాల్లో తొలగించామని వివరించారు. రోగి కోలుకొని ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారని, గతంలో హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైన శస్త్ర చికిత్సలు హనుమకొండలోని తమ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బీఆర్‌పీ సభను జయప్రదం చేయాలి

పార్టీ రాష్ట్ర మహిళా కన్వీనర్ బానాల మరియ

వడ్డేపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జూన్ 7న నిర్వహించే బహుజన రాజ్యాధికార పార్టీ (బీఆర్‌పీ) ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర మహిళా కన్వీనర్లు బానాల మరియ, ఎం.డి.సాహిద, పీసరి రజిత పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ వడ్డేపల్లిలో నిర్వహించిన బీఆర్‌పీ సమావేశంలో ఆవిర్భావ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ, ఉపాధిరంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడమే బీఆర్‌పీ ప్రధాన లక్ష్యమన్నారు. బహుజన మహనీయులు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, బీఆర్ అంబేద్కర్, కాన్షీరాం, బొజ్జతారకం ఆశయాలను ఆదర్శంగా తీసుకొని తమ పార్టీ ముందుకు సాగుతూ మహిళల హక్కుల సాధన కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌పీ జిల్లా నేతలు కోట కవిత, తనుగుల స్వప్న, అంజి, మాదాసి రాధ, సంపూర్ణ, వనమ్మ, స్రవంతి, భవ్యశ్రీ, మారపల్లి శ్రీలత, మచ్చిక విజయ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌పీ ఆవిర్భావ సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మహిళా నేతలు

ఓంకార్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న గాదగోని రవి

ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

వడ్డేపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోరాట యోధుడిగా అసెంబ్లీకి వన్నె తెచ్చిన ఓంకార్ కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలని కోరారు. వరంగల్-నర్సంపేట రహదారికి ఓంకార్ పేరు పెట్టడంతో పాటు నర్సంపేటలో స్మారక పార్కును నిర్మించాలని, నర్సంపేటలోని మెడికల్ కళాశాలకు, వల్లబ్‌నగర్ క్రీడా స్టేడియానికి ఓంకార్ పేరు పెట్టి సముచిత స్థానాన్ని కల్పించాలని కోరారు. ఓంకార్ శత జయంతి ఉత్సవాలు ఇప్పటి నుంచి 2026, మే 12 వరకు సంవత్సరం పాటు జరుగుతాయని రవి తెలిపారు. సమావేశంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి, వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి, రాష్ట్ర నాయకులు మంద రవి, కర్ర రాజిరెడ్డి, గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.





హైదరాబాద్‌లో జరుగుతున్న 'ప్రపంచ సుందరి' పోటీలు ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్నాయి. వందకుపైగా దేశాల నుంచి సుందరీమణులు హాజరవుతున్న ఈ పోటీలకు సంబంధించిన వీడియోలను కోట్ల మంది వీక్షిస్తున్నారు. తాజాగా 55 దేశాల అందగత్తెలు రామప్ప దేవాలయాన్ని, వేయి స్తంభాల గుడిని సందర్శించారు. ఈ సందర్భంగా వారు కట్టుకున్న చీరలు, ఓణీలు, లెహంగాలు అందరి దృష్టినీ ఆకర్షించాయి. వాటిని రూపొందించిన ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ గౌరంగ్ షా... వాటి వెనుక ఉన్న కథను 'నవ్య'కు వివరించారు.

విశ్వ సుందరీమణుల చేనేత సింగారం





"సుమారు రెండు నెలల క్రితం- అప్పటి పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ నాకు ఫోన్ చేశారు. హైదరాబాద్‌లో ప్రపంచ సుందరి పోటీలు జరుగుతున్నాయని, వాటిలో పాల్గొనే సుందరీమణులు రామప్ప దేవాలయాన్ని, వేయి స్తంభాల గుడిని సందర్శిస్తారని.. వారికి తగిన దుస్తులను డిజైన్ చేయాలని కోరారు. తెలంగాణ చేనేత వస్త్రాలతోనే వీరి దుస్తులను రూపొందించాలని షరతు విధించారు. తెలంగాణలో చేనేతలకు సంబంధించి మూడు ముఖ్యమైన ప్రాంతాలు ప్రసిద్ధి. వీటిలో మొదటిది పోచంపల్లి. రెండోది గద్వాల్. మూడోది నారాయణపేట. ఈ మూడు చేనేతలతోనే వీరికి చీరలు, బ్లౌజులు, లంగా ఓణీలు, లెహంగాలు రూపొందించాం. బోర్డర్ల కోసం ఇతర ప్రాంతాలకు చెందిన రకరకాల హస్తకళల సాయం కూడా తీసుకున్నాం.

పది రోజుల ముందే...

సాధారణంగా మేము ఫ్యాషన్ షోల కోసం డిజైన్ చేసేటప్పుడు- మూడు యూనివర్సల్ సైజులలో కుడతాం. మోడల్స్ వచ్చి, వాటిని ధరించాక... చిన్న చిన్న మార్పులు ఉంటే అప్పటికప్పుడు చేస్తాం. ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొనేవారి కొలతలు కూడా ఈ మూడు యూనివర్సల్ సైజుల్లోనే ఉంటాయని ముందే ఊహించి, దానికి తగ్గట్టుగా డిజైనింగ్‌ను చేయటం మొదలుపెట్టాం. మాకు ఈ పోటీల్లో పాల్గొనేవారి వివరాలు ముందే అందించారు. ఈ నెల ఒకటి నాటికి వారి కొలతలు కూడా తెలిసాయి. వీటికి తగ్గట్టుగా దుస్తులను డిజైన్ చేయటం మొదలుపెట్టాం. ఈ నెల 10కి అందరూ హైదరాబాద్ వచ్చేశారు. 11న వారందరికీ దుస్తుల ట్రయల్ వేశాం. ముందుగా అనుకున్నట్లే అన్ని సరిగ్గా కుదిరాయి. వారిలో చాలామందికి చీరలు, లెహంగాలు కట్టుకోవటం తొలిసారి. కానీ ఏ ఒక్కరు వాటిని ధరించి ఇబ్బంది పడలేదు. చాలా బావున్నాయని మెచ్చుకున్నారు.

పోచంపల్లికి మళ్లీ వైభవం...

రామప్ప గుడికి, వెయ్యి స్తంభాల గుడికి వెళ్లిన సుందరీమణులు తమ ఇన్‌స్టా అకౌంట్లలో ఆ ఫోటోలను షేర్ చేశారు. దీనివల్ల ఈ దుస్తులకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభించింది. ఈ మధ్య కాలంలో పోచంపల్లి వస్త్రాలకు కొద్దిగా డిమాండ్ తగ్గింది. సుందరీమణుల పర్యటన తర్వాత మళ్లీ వీటికి ఆదరణ పుంజుకుంది. అనేకమంది చేనేత కార్మికులు నాకు కూడా ఫోన్లు చేసి మా దగ్గర కూడా ఈ తరహా దుస్తులు ఉన్నాయని చెబుతున్నారు.

మూడు రకాలుగా...

సుందరీమణులందరూ గుడికి వెళ్తున్నారు కాబట్టి ఆ సందర్భానికి తగినట్టుగా దుస్తులు, అలంకరణ ఉండాలి. మన భారతీయ సంస్కృతిలోని అత్యంత అందమైన దుస్తుల్లో చీర ఒకటి. ఇది అన్ని సందర్భాలకు పనికొస్తుంది. సందర్భానుసారంగా దాన్ని కట్టుకుంటే చాలు! అందుకే సుమారు 20 మందికి చీరలు, వాటికి తగిన బ్లౌజులు కుట్టాం. మిగిలిన వారిలో 20 మందికి లెహంగాలు.. మరో 15 మందికి లంగా ఓణీలు కుట్టాం. వీటన్నింటినీ పోచంపల్లి ఇక్కత్, గద్వాల్, నారాయణపేట చేనేతలతోనే రూపొందించాం. తెలుపు-నలుపు కలనేత, నీలం, ఎరుపు, గంధం రంగు- నేపథ్యంలోనే మొత్తం దుస్తులు కనిపిస్తాయి. ఇక కొన్ని దుపట్టాలు, బోర్డర్లు ఇతర చేనేతలకు సంబంధించినవి కూడా ఉన్నాయి. తెలంగాణ చేనేతలను సహజసిద్ధమైన రంగులతో తయారు చేస్తారు. ఒకో చేనేతకు ఒకో ప్రత్యేకత ఉంది. పోచంపల్లి ఇక్కత్, డబుల్ ఇక్కత్‌ల డిజైన్‌లు భిన్నంగా ఉంటాయి. గద్వాల్ సిల్క్ కట్టుకున్నవారికి హుందాతనాన్ని ఇస్తాయి. నారాయణపేట చేనేతలు కట్టుకొన్నవారికి సరికొత్త రూపాన్ని ఇస్తాయి. వీటి మూడింటినీ కలగలిపితే సరికొత్త అందం ఏర్పడుతుంది.



నందినీ గుప్తా

మిస్ ఇండియా వరల్డ్ కోసం...

ఈసారి పోటీల ప్రారంభోత్సవంలో మిస్ ఇండియా వరల్డ్ నందినీ గుప్తాకు కూడా దుస్తులను నేనే డిజైన్ చేశాను. దీని వెనక ఒక చిన్న కథ ఉంది. ఈసారి పోటీలు దక్షిణ భారత దేశంలో జరుగుతున్నాయి కాబట్టి చీర కట్టుకోవాలని నందిని భావించారు. నందిని నా దగ్గరకు వచ్చినప్పుడు ఆమె టీమ్ అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. నేను వారికి కొన్ని చీరలు చూపించాను. నందిని కట్టుకుంటే అవి చాలా బావున్నాయి. కానీ నందిని కేవలం దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించటం లేదు. మొత్తం భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. కాబట్టి ఆమె ధరించే దుస్తులు కూడా ఆ విధంగానే ఉండాలి. అందుకోసం నేను సుమారు మూడు ఏళ్ల నుంచి తయారుచేస్తున్న జమ్దాని లెహంగాను ఆమెకు చూపించాను. దీనికి మేము వాడిన బోర్డర్ తయారుచేయటానికి దాదాపు రెండేళ్లు పట్టింది. దీనితో పాటుగా ఆమె దుప్పట్టా కోసం పొందూరు ఖద్దరును వాడాము. ప్రారంభోత్సవ వేళ నందిని వేసుకున్న ఈ దుస్తులకు ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రశంసలు లభించాయి."



ఎవరికైనా ఒకటే...

సాధారణంగా మోడల్స్ చాలా సన్నగా ఉంటారని., వారికి చీరలు బావుండవనే అపోహ చాలామందిలో ఉంటుంది. కానీ చీరకు కట్టే పద్ధతి వల్ల అందం వస్తుంది. సరైన రీతిలో కడితే ఏ ఖండం వారికైనా చీర బావుంటుంది. అంతేకాదు, చీరలు తెల్లగా ఉన్నవారికే బావుంటాయని భావన కొందరిలో ఉంటుంది. అది కూడా నిజం కాదు. నా ఉద్దేశంలో తెలుపు, నలుపు అనేవి అందాన్ని నిర్ణయించే అంశమే కాదు. చీర కట్టుకున్న తర్వాత వారు ఎలా ప్రవర్తిస్తున్నారు? ఎంత హుందాగా ఉన్నారనే విషయంపైనే అందం ఆధారపడి ఉంటుంది.



గౌరంగ్ షా
ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...



ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ	ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్			జియో హాట్‌స్టార్		
సారా సిల్వర్‌మాన్	హాలీవుడ్ మూవీ	మే 20	ల్యాండ్‌మాన్	వెబ్‌సిరీస్	మే 21
రియల్ మెన్	వెబ్‌సిరీస్	మే 21	హార్ట్‌బీట్ 2	తెలుగు సిరీస్	మే 22
ది వైల్డ్ రోబో	యానిమేషన్ మూవీ	మే 24	ఫైండ్ ది ఫర్జీ	హిందీ రియాలిటీ షో	మే 23
అమెజాన్ ప్రైమ్			ఈటీవీ విన్		
మోటార్‌హెడ్స్	వెబ్‌సిరీస్	మే 20	కథాసుధ: కాలింగ్‌బెల్	తెలుగు సిరీస్	మే 18

హార్ట్ అదే బీట్ వేరే

గతేడాది విడుదలై ప్రేక్షకాదరణ పొందిన మెడికల్ డ్రామా వెబ్‌సిరీస్ 'హార్ట్‌బీట్'. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగిన ఈ సిరీస్‌కు సీజన్ 2 త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. అబ్దుల్ కబీజ్ దర్శకుడు. కార్పొరేట్ హాస్పిటల్ ఇతివృత్తంగా తెరకెక్కిన సిరీస్ ఇది. హాస్పిటల్ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రీనా జీవితంలో జరిగిన సంఘటనల సమాహారంగా కథ సాగుతుంది. పేషంట్లకు చికిత్స అందించే క్రమంలో అక్కడి వైద్యుల భావోద్వేగాలు, వారి మధ్య అనుబంధాన్ని వినోదాత్మకంగా చూపించారని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది.



ఇటీవల లండన్‌లోని మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియంలో గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తన అనుభూతులను మెగాస్టార్ చిరంజీవి 'నవ్య'తో ప్రత్యేకంగా పంచుకున్నారు..

పుత్రోత్సాహము తండ్రికి...



"నేను 1983లో మోకాలి ఆపరేషన్ కోసం లండన్ వెళ్లాను. అప్పటికి ఇంకా చరణ్ పుట్టలేదు. ఆపరేషన్ జరిగే ముందు నేను, సురేఖ లండన్‌లో కొన్ని ఆసక్తికరమైన ప్రాంతాలు చూడాలనుకున్నాం. వాటిలో 'మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియం' కూడా ఒకటి. ప్రపంచంలో లబ్ధప్రతిష్ఠులైనవారి మైనపు బొమ్మలను తొలిసారి నేను అక్కడ చూశాను. అవన్నీ జీవం ఉట్టిపడుతున్నాయి. సినీ రంగంలో నాకు అత్యంత ఇష్టమైన చార్లీ చాప్లిన్, నేను స్ఫూర్తిగా భావించే గాంధీజీ, అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ... ఇలా అనేకమంది విగ్రహాలను చూసినప్పుడు చరిత్ర నా కళ్లముందు వచ్చి నిలిచినట్లు అనిపించింది. వారెవ్వరినీ నేను ప్రత్యక్షంగా చూడలేదు. కానీ వారి మైనపు విగ్రహాలను చూస్తే కాలం వెనక్కి తిరిగి... 'వారు నా ముందుకు వచ్చి నిలబడ్డారా?' అనేటంత సజీవంగా ఉన్నాయి. గాంధీజీ, ఇందిరాగాంధీ, చార్లీ చాప్లిన్‌ల విగ్రహాల ముందు నేను, సురేఖ ఫోటోలు తీసుకున్నాం. ఆ సమయంలో నాకు గుర్తున్నంత వరకు తుస్సాడ్స్ మ్యూజియంలో భారతీయుల విగ్రహాలు గాంధీ, ఇందిరాగాంధీలవి మాత్రమే ఉండేవి. 'వీరు చాలా అదృష్టవంతులు కదా! పూర్వజన్మ సుకృతం చేసుకోవటంవల్లే వాళ్లందరూ ఆ మ్యూజియంలో ఉన్నారు. మనల్ని బ్రిటిష్‌వారు 200 ఏళ్లు పాలించారు. తర్వాత వదిలేయాల్సి వచ్చింది.. వాస్తవానికి తమను వెళ్లగొట్టినందుకు బ్రిటిష్ వారికి గాంధీగారి మీద విపరీతమైన కోపం ఉండాలి. కానీ బ్రిటిష్ వారి రాజధానిలో ఆయన విగ్రహం పెట్టుకోక తప్పలేదు' అనుకున్నాను. ఆయన విగ్రహం చూసి నాకు చాలా గర్వంగా కూడా అనిపించింది. ఆ మ్యూజియంను చూడటం మాకు మరపురాని అనుభవం. మన దేశానికి తిరిగి వచ్చిన తర్వాత స్నేహితులు, బంధువులు అందరూ ఆ ఫొటోలను చాలా ముచ్చటగా చూశారు. ఆ తర్వాత మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియం బ్రాంచీలను హాలీవుడ్‌లో, దుబాయ్‌లో, సింగపూర్‌లో పెట్టారనే వార్తలు వింటూనే ఉన్నాను.

క్వీన్ ఎలిజబెత్ తరువాత చరణే...

ఒక రోజు చరణ్ వచ్చి- తుస్సాడ్స్‌లో తన బొమ్మ పెట్టాలనే ప్రతిపాదన వచ్చిందని చెప్పాడు. నాకు 1983 నాటి జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి. నా బొమ్మే ఆ మ్యూజియంలో పెడుతున్నారన్నంత ఆనందం కలిగింది. సురేఖలో కనిపించిన సంతోషాన్ని వర్ణించలేను. "అప్పుడు మనం ఫోటోలు తీయించుకున్నాం గుర్తుందా? ఆ సమయంలో చరణ్ నీ కడుపులో కూడా పడలేదు. అప్పుడు మనకు ఒక పిల్లాడు పుడతాడని, వాడికి 35 ఏళ్లు వచ్చే సరికి తుస్సాడ్స్‌లో విగ్రహం పెడతారని అనుకున్నామా? ఇదంతా అద్భుతమనిపిస్తోంది. ఈసారి మనం అక్కడకు వెళ్లి చరణ్‌తో ఫొటో తీయించుకుందాం" అని తనతో అన్నాను. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. 1983 తర్వాత బాలీవుడ్, టాలీవుడ్‌కు చెందిన కొందరు నటుల విగ్రహాలు దుబాయ్‌లో, సింగపూర్‌లలో పెట్టారు. వారిలో చరణ్ సహనటులు కూడా కొందరున్నారు. కానీ చరణ్ విగ్రహం విషయంలో ఒక ప్రత్యేకత ఉంది. చరణ్ దగ్గరకు విగ్రహ ప్రతిపాదన వచ్చినప్పుడు- తన కుక్క అయిన రైమ్ విగ్రహం కూడా ఉండాలని ఒక షరతు పెట్టాడు. ఇప్పటిదాకా క్వీన్ ఎలిజబెత్‌తో పాటు ఆవిడ పెంపుడు కుక్క విగ్రహం మాత్రమే పెట్టారు. అంటే తుస్సాడ్స్‌లో ఈ తరహా విగ్రహం పెట్టడం ఈ మ్యూజియం చరిత్రలో ఇది రెండోసారి. వాస్తవానికి ఇలా విగ్రహం పెట్టాలంటే మామూలు కన్నా ఎక్కువ ఖర్చు అవుతుంది. దానికి కూడా వారు అంగీకరించారు. సందర్భం వచ్చింది కాబట్టి ఇక్కడో విషయం చెప్పాలి. తుస్సాడ్స్ మ్యూజియంలో విగ్రహాలకు జీవం ఉండదు కానీ ఆ బొమ్మలకు అమర్చేవన్నీ నిజమైనవే అయి ఉంటాయి. ఉదాహరణకు రైమ్ మైనపు విగ్రహంపై బొచ్చు అంతా నిజమైనదే! ఒకో వెంట్రుక తీసుకొని దాన్ని ఆ విగ్రహానికి జాగ్రత్తగా అమర్చారు.


ఆ పద్యం గుర్తుకొచ్చింది...

ఈ విగ్రహం ఆవిష్కరణకు లండన్‌కు రమ్మని ఆహ్వానం వచ్చినప్పుడు 'పుత్రోత్సాహము తండ్రికి.. పుత్రుడు జన్మించినపుడె పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగ పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ' అనే పద్యం గుర్తుకొచ్చింది. చాలా గర్వంగా అనిపించింది. ఇక విగ్రహాన్ని చూసినప్పుడు ఎందుకో తెలియదు కానీ నా కళ్లు చెమర్చాయి. కొడుకులు లబ్ధప్రతిష్ఠులు అయినప్పుడు బహుశా గర్వంతో తండ్రులకు అలాంటి భావనే కలుగుతుందేమో! సురేఖ తన కొడుకు విగ్రహాన్ని మురిపెంగా చూసుకుంటూ ఉండిపోయింది. వచ్చేటప్పుడు... "అచ్చంగా చరణ్‌లాగే ఉన్నాడు. మనం వెళ్లిపోతే వాడు ఒంటరిగా ఉండిపోతున్నాడండి. వాడి ఆలనా పాలన ఎవరు చూసుకుంటారు?" అంది. "ఉపాసనను అక్కడ వదిలి వచ్చేయ్" అని సరదాగా నవ్వుతూ అన్నాను కానీ కొడుకు విగ్రహాన్ని చూసినా తల్లికి అంత ప్రేమ కలుగుతుందా? అనిపించింది. నా జీవితంలో నేను సాధించిన విజయాల్లో అక్కడ చరణ్ విగ్రహం పెట్టడం కూడా ఒకటని కచ్చితంగా చెప్పగలను. ఇక ఈ విగ్రహాన్ని చూసి క్లింకారకు ఇద్దరు నాన్నలు ఎలా ఉన్నారో అర్థం కాలేదు. మేము ఎంత ఆపినా వినకుండా విగ్రహంవైపు వెళ్లిపోయింది. రైమ్‌కు తనలాంటిదే మరొక జీవి వచ్చిందనుకొని- విగ్రహాన్ని నాకడం మొదలుపెట్టింది. మొత్తంగా చూస్తే- ఉత్సుకత అంతా ఉపాసనది, క్లింకారది. ఎమోషనల్ జర్నీ అంతా సురేఖది. ఇక చరణ్‌కు ఎలాంటి ఫీలింగ్ ఉందో మాకు ఇంకా తెలీదు. సాధారణంగా ఏ విషయంపైనైనా తన ఎక్సైట్‌మెంట్ బయటకు కనిపించదు. బహుశా తనకు నా పోలికే వచ్చిందనుకుంటా! గతంలో నా ఫ్రెండ్స్- "మీ సినిమా సూపర్ హిట్ అయింది. మీకు ఉత్సాహంగా ఉండదా? హుషారు ఉండదా?" అని అడుగుతూ ఉండేవారు. "నాది ప్రసవ వేదన లాంటిది. కష్టపడి అలసిపోతాం కదా! అప్పుడు వచ్చే విజయం ఆనందంగానే ఉంటుంది. కానీ అది అలసట వల్ల బయటకు కనిపించదు" అనేవాడిని. చరణ్‌కు కూడా అదే వచ్చిందనుకుంటా! చివరగా... ఈ విగ్రహం గురించి ఆలోచిస్తున్నప్పుడు 'అది శాశ్వతంగా ఉండిపోతుంది కదా.. భవిష్యత్ తరాల వారికి కూడా చరణ్ విగ్రహం ద్వారానే నా జ్ఞాపకాలు అందుతాయి కదా! ఎంతైనా వాడు నాకు ఒక ఎక్స్‌టెన్షన్ కదా' అనిపిస్తోంది.

> 'గత తరంవారు ఏం సాధించారు?' అనే విషయాన్ని చెప్పటానికి, స్ఫూర్తి పొందటానికి విగ్రహాలు అవసరం. కొన్ని సార్లు కాల ప్రవాహంలో, చరిత్రలో కొందరు మరుగున పడిపోతూ ఉంటారు. అలాంటివారి జ్ఞాపకాలను వెలికి తీసేవి విగ్రహాలే! ప్రస్తుత తరం వారు వెనక్కి తిరిగి చూసుకోవటానికి, భవిష్యత్ తరంవారు తమ వారసత్వం గురించి తెలుసుకోవటానికి విగ్రహాల అవసరం ఉందనేది నా అభి ప్రాయం!

• సీవీఎల్ఎన్ ప్రసాద్





సంక్రాంతికి రఫ్ఫాడిద్దాం!



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించే చిత్రం త్వరలో సెట్స్‌కు వెళ్లనుంది. పూర్తి స్థాయి వినోదభరితంగా రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో చాలా కాలం తర్వాత చిరంజీవి కంప్లీట్ హ్యూమరెస్ రోల్ చేయనున్నారు. ఈ సినిమాలో నయనతార కథానాయికగా నటించనున్నట్లు వెల్లడిస్తూ ఓ వీడియో విడుదల చేశారు దర్శకుడు అనిల్ రావిపూడి ఈ వీడియోలో నయనతార తన టీమ్‌తో తెలుగులో మాట్లాడడం, కారు ప్రయాణంలో చిరంజీవి క్లాసిక్ పాటలు వినడం, చివరికి దర్శకుడు అనిల్ రావిపూడితో కలసి 'సంక్రాంతికి రఫ్ఫాడిద్దాం' అని చెప్పడం ఆకట్టుకుంది. అనౌన్స్‌మెంట్ దగ్గర నుంచి సాంకేతిక బృందాన్ని పరిచయం చేయడం, నయనతారను లీడ్ యాక్ట్రెస్‌గా ప్రకటించడం.. వరకూ జరిగిన ప్రతి ప్రమోషన్ వినూత్నంగా, ఆకట్టుకొనేలా సాగింది. 2026 సంక్రాంతికి సినిమా విడుదల చేయడానికి నిర్ణయించుకొన్నట్లు శనివారం విడుదల చేసిన వీడియోలో మరోసారి స్పష్టం చేశారు అనిల్ రావిపూడి.

తెలుగులోకి విజయ్ సేతుపతి 'ఏస్'



విజయ్ సేతుపతి సినిమా అనగానే తమిళంలోనే కాదు తెలుగు ప్రేక్షకులకు కూడా ఆసక్తే. మంచి కాన్సెప్ట్, ఎమోషనల్ కంటెంట్ ఉంటాయని భావిస్తుంటారంతా. ఆయన తాజా చిత్రం 'ఏస్' ఇప్పుడు తమిళంతో పాటు తెలుగులో కూడా విడుదల కానుంది. రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం కోసం ప్రముఖ సంస్థలు పోటీ పడినా ఫ్యాన్సీ రేటు ఇచ్చి పద్మినీ సినిమాస్ సంస్థ అధినేత బి.శివప్రసాద్ హక్కులు సొంతం చేసుకున్నారు. ఈ నెల 23న చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుంది

- విజయ్ కనకమేడల



"భైరవం' అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న మంచి యాక్షన్ థ్రిల్లర్. సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకులు ఉత్కంఠకు, భావోద్వేగాలకు గురవుతారు. కచ్చితంగా ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ అవుతుంది' అని అన్నారు దర్శకుడు విజయ్ కనకమేడల. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన చిత్రం 'భైరవం'. డా.జయంతిలాల్ గడా సమర్పణలో కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈనెల 30న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'కథ కమర్షియల్‌గా నాకు చాలా నచ్చింది. అలాగే ముగ్గురు హీరోలతో పనిచేసే అవకాశం కూడా కలిగింది. ఇది రీమేక్ చిత్రమైనప్పటికీ ఒరిజినల్‌లో ఉన్న ఆర్గానిక్ ఎమోషన్ ఇందులో ఉంటుంది. క్యారెక్టరైజేషన్ ప్రజెంటేషన్ నా స్టయిల్‌లో ఉంటుంది. మంచి నటుల నుంచి సినిమా వస్తే ప్రేక్షకులు కచ్చితంగా థియేటర్‌కి వస్తారనే నమ్మకం ఉంది. నా గత సినిమాలతో పోల్చుకుంటే ఈ చిత్రం ఎక్కువ ఆహ్లాదకరంగా ఉంటుంది' అని తెలిపారు.







కాళేశ్వర క్షేత్రం.. భక్తజన సందోహం

సరస్వతీ పుష్కరాలకు పోటెత్తుతున్న భక్తులు... మూడో రోజు లక్ష మందికిపైగా భక్తుల రాక

- డిప్యూటీ సీఎం భట్టి, తుమ్మల పుణ్యస్నానాలు
- అర్ధరాత్రి వర్షంతో ఏర్పాట్లు అతలాకుతలం

భూపాలపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కర పుణ్య క్షేత్రమైన కాళేశ్వర క్షేత్రం భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయింది. పుష్కరాల మూడోరోజైన శనివారం లక్ష మందికి పైగా భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి రహదారులు బురదమయంగా మారినా, ఏడు కి.మీ. మేర ట్రాఫిక్ స్తంభించినా.. భక్తులు కాలి నడకన పుష్కర ఘాట్లకు చేరుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరించి, సరస్వతీ మాతను, కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. వారాంతపు సెలవులు కావడంతో విద్యార్థులు మహిళలు, ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. ట్రాఫిక్ స్తంభించినప్పటికీ భక్తులు లెక్కచేయకుండా కాళేశ్వరానికి తరలిరావడం గమనార్హం. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరాగా, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచీ భారీ సంఖ్యలో వచ్చారు. భక్తుల సంఖ్య ఒక్కసారిగా పెరగడంతో అధికారులు రద్దీని నియంత్రించలేని పరిస్థితిని ఎదుర్కొన్నారు. అధికారులు.. వీఐపీల దర్శనాలకు ప్రాధాన్యమిచ్చి సామాన్యులను విస్మరించడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు.



కాళేశ్వరం వద్ద పుష్కర స్నానాలు చేస్తున్న భక్తులు, ఆలయానికి వస్తున్న మంత్రి తుమ్మల





నదిలో పితృదేవతలకు పిండ ప్రదానం చేస్తున్న భట్టి

వర్షంతో భక్తుల ఇక్కట్లు..

వర్షం కారణంగా సరస్వతీ పుష్కరఘాట్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక నిర్మాణాలు, టెంట్ సిటీ దెబ్బతిన్నాయి. భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు, టెంట్లు కూలిపోయాయి. విద్యుత్ సరఫరా వ్యవస్థ ధ్వంసమైంది. దాంతో అధికారులు ఉదయం 9గంటల వరకు యుద్ధ ప్రాతిదికన మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు. కలెక్టర్ రాహుల్ శర్మ దగ్గరుండి పరిస్థితిని సమీక్షించగా.. పోలీసులు రద్దీ నిర్వహణ చేపట్టారు. అయితే ఊహించని రీతిలో భక్తులు రావడం, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు లేకపోవడంతో 7కి.మీ. మేర వాహనాలు నిలిచిపోయాయి. కాగా, ప్రైవేటు వాహనాల్లో వచ్చిన భక్తుల నుంచి గ్రామపంచాయతీ కాంట్రాక్టర్లు ముక్కుపిండి టోల్ వసూలు చేయడం, దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో సర్దుకున్న అధికారులు శుక్రవారం నుంచి టోల్ వసూళ్లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

పుణ్యస్నానాలు ఆచరించిన మంత్రులు

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, ఠాకూర్ మక్కాన్‌సింగ్ తదితరులు శనివారం పుష్కర స్నానం చేసి కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అంతకు ముందు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఆయన సోదరుడు ప్రసాద్.. వారి పితృదేవతలకు పిండ ప్రదానం చేసి గోదావరిలో తర్పణం వదిలారు. అలాగే ముక్తీశ్వరాలయంలో భట్టి కుటుంబ సభ్యులు కాలసర్పదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. కాళేశ్వరాలయంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాడిపంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ప్రపంచంతో పోటీపడే స్థాయికి రాష్ట్రం ఎదగాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు దగ్గరుండి పుష్కర ఏర్పాట్లను పర్యవేక్షించారని ప్రశంసించారు.

లిఫ్ట్ ప్రమాదాలపై సుమోటో విచారణ

- లేఖను వ్యాజ్యంగా స్వీకరించిన హైకోర్టు

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్లలో లిఫ్టులు సరిగా లేక ప్రాణాలు పోతున్న ఘటనలపై హైకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ ప్రమాదాలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. లిఫ్టుల భద్రతకు సంబంధించి నిబంధనలు అమలు కాకపోవడం వల్ల పలు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన ఘటనలు ఉన్నాయంటూ అందిన లేఖను హైకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ పిల్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం స్వీకరించింది. విచారణను వేసవి సెలవుల తర్వాతకు వాయిదా వేసింది.

రేపు కాళేశ్వరానికి పవన్ కల్యాణ్?

కాళేశ్వరం, మే 17 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌లోని కాళేశ్వర క్షేత్రానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం రానున్నారు. సరస్వతీ పుష్కరాల్లో భాగంగా పుష్కర స్నానం ఆచరిస్తారు. ఈ మేరకు స్థానిక అధికారులకు సమాచారం అందినట్లు తెలిసింది. అయితే వారి నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. పవన్ కల్యాణ్ వస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

ఎన్టీపీసీ విద్యుత్తు కొనుగోలుకు తెలంగాణ ఈఆర్‌సీ సమ్మతి

- యూనిట్‌కు రూ.4.12గా అంచనా
- సింగరేణి రెండో దశపై పిటిషన్ వెనక్కి

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎన్టీపీసీ నిర్మించిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ స్టేషన్‌లో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడో యూనిట్ నుంచి కరెంట్ కొనుగోలుకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ) సమ్మతి తెలిపింది. ఈ మేరకు మండలి ఛైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆ తర్వాత విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) చేసుకోవాలని కమిషన్ నిర్దేశించింది. తొలి దశలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్ల నుంచి కరెంట్ కొనుగోలు చేస్తున్నారు. తాజాగా మూడో యూనిట్ నుంచి తొలి ఏడాది యూనిట్‌కు రూ.4.12 ధరతో కరెంట్ అందనుంది. ఇక సింగరేణి రెండో దశలో నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల ప్లాంట్ల నుంచి కరెంట్ కొనుగోలుపై పునఃపరిశీలన చేస్తామని డిస్కమ్‌లు కోరడంతో.. ఆ కేసుకు సంబంధించిన పిటిషన్‌పై కమిషన్ ఏ నిర్ణయం తీసుకోకుండా వెనక్కి తీసుకోవడానికి అనుమతినిచ్చింది. గుజరాత్‌లోని కచ్ జిల్లాలో ఎన్ఎల్‌సీఐఎల్ నిర్మించిన 200మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను కొనుగోలుకు ఈఆర్‌సీ ఆమోదం తెలిపింది. యూనిట్‌కు రూ.2.57కు కరెంట్ కొనుగోలు చేయనున్నార

వేటగాళ్ల ఉచ్చుకు పెద్దపులి బలి

- చర్మం, గోళ్లను ఎత్తుకెళ్లిన దుండగులు
- ఆసిఫాబాద్ జిల్లాలో దారుణం

కాగజ్‌నగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండలంలోని ఎల్లూరు అటవీ ప్రాంతంలో వేటగాళ్లు అమర్చిన ఉచ్చుకు చిక్కి పెద్దపులి మృతి చెందింది. శనివారం కాగజ్‌నగర్ అటవీ డివిజనల్ కార్యాలయంలో ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్(ఎఫ్‌డీపీటీ) శాంతారాం కేసు వివరాలను వెల్లడించారు. పెంచికల్‌పేట అటవీ ప్రాంతం సమీపంలో తిరుగుతున్న పులి కదలికలు ఈ నెల 13 వరకు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. 14 నుంచి పులి కనిపించకపోవడంతో అటవీ సిబ్బంది వాకబు చేశారు. ఎల్లూరు అటవీ ప్రాంత సమీపంలో పులిని పాతి పెట్టినట్టు ప్రచారం కావటంతో అటవీ సిబ్బంది శుక్రవారం రాత్రి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ తవ్వి చూడగా ఏడేళ్ల వయసున్న ఆడ పులి కే-8 కళేబరం దొరికింది. అది వేటగాళ్ల అమర్చిన ఉచ్చుకు బలైనట్టు అటవీ సిబ్బంది నిర్ధారించారు. పులి చర్మం, గోళ్లను వేటగాళ్లు ఎత్తుకెళ్లారు. ఘటనపై అటవీ అధికారులతో పాటు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ(ఎన్టీసీఏ) బృంద సభ్యులు విచారణ జరుపుతున్నారు.

రైతును నీళ్లలోకి లాక్కెళ్లిన మొసలి

కృష్ణ, మే 17 (ఆంధ్రజ్యోతి): ఓ రైతుపై మొసలి దాడి చేసి నీళ్లలోకి లాక్కెళ్లిన ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధి కూసుమూర్తి గ్రామ శివారు భీమానదిలో శనివారం చోటుచేసుకుంది. కూసుమూర్తికి చెందిన రైతులు జింకల తిప్పన్న (55), శివప్ప గౌడ కలిసి తిప్పన్న నారుమడి వద్దకు వెళ్లారు. నీటి మోటార్‌ను ఆన్ చేయగా నీళ్లు పోయలేదు. ఫుట్‌బాల్ నుంచి మోటార్ పంపునకు నీరు రావడంలేదని గమనించి అక్కడున్న చెత్తను తొలగించేందుకు తిప్పన్న నీళ్లలోకి దిగాడు. అక్కడే ఉన్న మొసలి ఆయనపై ఒక్కసారిగా దాడి చేసి నీళ్లలోకి లాక్కెళ్లిందని శివప్ప చెప్పారు. ఆయన సమాచారం ఇవ్వడంతో గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. జాలర్లను రప్పించి గల్లంతైన రైతు కోసం గాలింపు చేపట్టారు. తిప్పన్న ఆచూకీ తెలియకపోవడంతో భార్య తిమ్మవ్వ, కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

సిరిసిల్లలో మరో నేతన్న ఆత్మహత్య

- పని దొరక్క అనారోగ్యంతో అప్పుల పాలు
- స్థానికుల విరాళాలతో అంత్యక్రియలు



సాగర్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి): నేత కార్మికుడిగా నెలలో పూర్తిగా పని లేక, భార్యా కూతుళ్లకు అనారోగ్యంతో శస్త్ర చికిత్సల కోసం అప్పులు చేసిన వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజన్న-సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. సాయినగర్ వాసి మేరుగు సాగర్ (38) తన భార్య అస్మితకు నాలుగు శస్త్ర చికిత్సలు, కూతురు మధుప్రియ కిడ్నీల్లో రాళ్ల తొలగింపు శస్త్ర చికిత్స కోసం రూ.5 లక్షలు అప్పు చేశాడు. నెలలో 15-20 రోజులే పని ఉండటంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులు నిద్రిస్తున్నప్పుడు సాగర్ ఉరేసుకున్నాడు. అర్ధరాత్రి దాటాక ఈ సంగతి గమనించిన భార్య అస్మిత.. ఇరుగు పొరుగు వారికి, బంధువులకు సమాచారం అందించారు. శనివారం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం తర్వాత ఇంటి యజమాని.. మృతదేహాన్ని ఇంట్లోకి తేవడానికి అనుమతించలేదు. దీంతో నెహ్రూ నగర్‌లోని ఓ కమ్యూనిటీ హాలులో మృతదేహాన్ని ఉంచి.. స్థానికుల విరాళాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

ప్లంజ్‌పూల్ విస్తరించలేదు

- గుర్తించిన జలవనరుల శాఖ
- శ్రీశైలం మరమ్మతుల ప్రక్రియ వేగవంతం

అమరావతి, మే 17(ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశయం దుస్థితిపై కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ(సీడీఎస్ఏ) తీవ్ర హెచ్చరికలు చేసిన నేపథ్యంలో.. మరమ్మతులపై రాష్ట్ర జల వనరుల శాఖ వేగం పెంచింది. స్పిల్‌వేకు ఎదురుగా ప్లంజ్ పూల్(భారీ గొయ్యి) విస్తరించిందేమోనని జల వనరుల శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. విస్తరించలేదని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు. అలాగే కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్, దెబ్బతిన్న స్టీల్ సిలెండర్లపై సీడీఎస్ఏ హెచ్చరికలతో వాటి మరమ్మతులపై రాష్ట్ర జల వనరుల శాఖ దృష్టి సారించింది. ఇప్పటిదాకా శ్రీశైల జలాశయం దుస్థితిపైనా, మరమ్మతులపైనా అధ్యయనం చేసేందుకు కేంద్ర జలసంఘం, కేంద్ర వాటర్ అండ్ పవర్ పరిశోధనా సంస్థ అధ్యయనం చేసేందుకు రూ.50 లక్షల చెల్లించాల్సిందిగా కోరాయి. ఈ మొత్తాన్ని చెల్లించాకే తాము అధ్యయనం చేస్తామంటూ సీడబ్ల్యూసీ, సీడబ్ల్యూపీఆర్ఎస్ తేల్చి చెప్పాయి. ఈ సమాచారాన్ని జలవనరుల శాఖ ఇప్పటికే పలు దఫాలుగా రాష్ట్ర ఆర్థిక శాఖకు తెలియజేసింది. ఈ నిధులు ఇచ్చేందుకు ఆర్థికశాఖ యథావిధిగా తిరస్కరించడంతో శ్రీశైల జలాశయం భద్రతా చర్యలపై అధ్యయనం ఆగిపోయింది. 'ఆర్థిక శాఖతోనే అసలు పేచీ' శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. జలాశయాల నిర్వహణపై నిధులు ఇచ్చేందుకు ఆర్థిక శాఖ తిరస్కరించిన ఫైళ్లపై సీఎంవో ఆరా తీసింది. శ్రీశైల జలాశయం భద్రతపై సెంట్రల్ డ్యామ్ డిజైన్ ఏజెన్సీ ఇచ్చిన నివేదికతో ఒక్కసారిగా ప్రభుత్వంలో కదలిక వచ్చింది. సీడీడీఏ సూచించిన మేరకు అప్రోచ్ రోడ్, స్టీల్ సిలెండర్ల మార్పిడి కోసం టెండర్లను పిలిచేందుకు జలవనరుల శాఖ సిద్ధమైంది. ఇందు కోసం కేంద్ర ఓషనోగ్రఫీ సంస్థను సంప్రదించింది. తమకు ఇప్పుడు శ్రీశైలం జలాశయం పనులు పరిశీలించడం సాధ్యం కాదంటూ ఈ సంస్థ తేల్చి చెప్పడంతో ఇతర సంస్థల సేవలను వినియోగించుకునేందుకు జల వనరుల శాఖ సిద్ధమైంది. జలాశయం మరమ్మతులకు మొత్తం ఎంత వ్యయం అవుతుందోనన్న అంచనాలు వేస్తోంది. ప్రస్తుతం రూ.37 కోట్ల దాకా వ్యయం అవుతుందని ప్రాథమికంగా భావించినా.. సమగ్ర నివేదికను జల వనరుల శాఖ సిద్ధం చేస్తోంది. సమగ్ర నివేదికలూ, అంచనా వ్యయంపై సోమవారం ఆర్థికశాఖతో కలసి జల వనరుల శాఖ ఉన్నత స్థాయి సమీక్షను నిర్వహించేందుకు సిద్ధమైంది.

నక్సల్స్ మూలాలపై దెబ్బ

గత 10 ఏళ్లలో తగ్గిన నక్సలిజం.. వివరాలను వెల్లడించిన కేంద్రం

చర్ల, మే17(ఆంధ్రజ్యోతి): గడిచిన పదేళ్లలో దేశంలో నక్సలిజం చాలా వరకు తగ్గిపోయిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి నక్సలిజాన్ని తుడిచిపెట్టాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు గుర్తుచేసింది. 'నేషనల్ పాలసీ అండ్ యాక్షన్ ప్లాన్' పేరుతో ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలతో నక్సల్స్ హింస 81%మేర తగ్గడమే కాకుండా.. మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య 126 నుంచి 6కు చేరినట్లు వెల్లడించింది. ఒకప్పుడు మావోయిస్టులకు కంచుకోటలుగా ఉన్న ప్రాంతాల్లో కేంద్ర బలగాలు క్యాంపులను ఏర్పాటు చేశాయని, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో చిన్నారులకు విద్య, యువతకు వృత్తి నైపుణ్యతలో శిక్షణ, రోడ్ల నిర్మాణం, 4జీ నెట్‌వర్క్‌తో సెల్‌ఫోన్ సౌకర్యం, పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు చేసినట్లు తెలిపింది. గత నెల 21నుంచి ఈ నెల 11వరకు తెలంగాణ-ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో చేపట్టిన ఆపరేషన్‌లో 16మంది మహిళా నక్సల్స్ సహా.. 31 మంది మావోయిస్టులు హతమయ్యారని, ఆ ప్రాంతంలో కేంద్ర బలగాలు క్యాంపులను ఏర్పాటు చేసినట్లు వివరించింది. అదే సమయంలో మావోయిస్టుల రిక్రూట్‌మెంట్లు, కమ్యూనికేషన్, రవాణా, వనరులపై దెబ్బ కొట్టినట్లు పేర్కొంది. ఆయా వివరాలను 'బ్రేకింగ్ రెడ్ గ్రిప్' పేరుతో శనివారం ఓ నివేదికను విడుదల చేసింది. అందులోని కీలకాంశాలు..

- 2014లో 126 జిల్లాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా ఉండగా.. వాటి సంఖ్య 2018లో 90కి, 2021లో 70కి, 2024లో 38కి.. ప్రస్తుతం 12కి తగ్గింది. ఈ 12 జిల్లాల్లో ఆరింటిలో మాత్రం మావోయిజం తీవ్రంగా ఉంది. అవి.. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకేర్, నారాయణపూర్, సుకుమా, ఝార్ఖండ్‌లోని వెస్ట్ సింగ్‌భూమ్, మహారాష్ట్రలోని గడ్చిరోలి
- గడిచిన పదేళ్లలో 8 వేల మంది మావోయిస్టులు హింసా మార్గాన్ని విడిచిపెట్టారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం 18 వేల చ.కి.మీ. నుంచి 4,200 చ.కి.మీ.కు తగ్గింది. 2010-24 మధ్య నక్సల్స్ హింస 81%, నక్సల్స్ హింసలో మరణాలు 85%మేర తగ్గాయి
- 2014లో 330 పోలీస్‌స్టేషన్ల పరిధిలో మావోయిస్టుల హింసపై కేసులు నమోదవ్వగా.. 2024లో ఆ సంఖ్య 104కు తగ్గింది. 2004-14 మధ్యకాలంలో 16,463 మావోయిస్టుల హింస సంఘటనలు నమోదవ్వగా.. 2014-24 మధ్యకాలంలో 53% మేర తగ్గి.. 7,744కు చేరుకున్నాయి. మావోయిస్టుల కాల్పులు, మందుపాతరల కారణంగా 2004-14లో భద్రతాబలగాలకు చెందిన 1,851 మంది మరణించగా.. 2014-24లో ఆ సంఖ్య 509కి చేరింది

నక్సల్స్ ప్రాంతాల్లో చేపట్టిన పథకాలు

- భద్రత ఖర్చుల(ఎస్ఆర్ఈ) పథకం ద్వారా రూ.3,260 కోట్ల ఖర్చు
- ప్రత్యేక కేంద్ర సహాయం(ఎస్‌సీఏ)కు రూ.3,563 కోట్ల కేటాయింపు
- ప్రత్యేక మౌలిక వసతుల(ఎస్ఐఎస్) పథకం ద్వారా రూ.1741 కోట్లతో 221 పటిష్ఠ పోలీసు స్టేషన్ల నిర్మాణం. గడిచిన 10 ఏళ్లలో మొత్తం 612 పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు. అంతకు ముందు వీటి సంఖ్య 59
- నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో 17,589 కి.మీ.రహదారుల నిర్మాణం లక్ష్యంలో.. 14,618 కి.మీ. పూర్తి
- 4జీ సేవల కోసం 10,505 సెల్ టవర్ల ఏర్పాటు లక్ష్యంలో.. 7,768 పూర్తి
- 35 జిల్లాల్లో 1,007 బ్యాంకులు, 937 ఏటీఎంలు, 5,731 పోస్టాఫీసుల ఏర్పాటు. ఈ జిల్లాల్లో 178 ఏకలవ్య మోడల్ స్కూళ్లు, 48 ఐటీఐలు, 61 నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు
- ఆదివాసీ యువతకు ప్రత్యేక శిక్షణనివ్వడం ద్వారా.. 1,143 మంది భద్రతా బలగాల్లో నియమితులయ్యారు
- మావోయిస్టు ప్రాంతాల్లో 302 క్యాంపుల ఏర్పాటు.

20 మంది నక్సల్స్ అరెస్ట్

- లొంగిపోయిన 8 మంది

ములుగు, మే 17(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ నేపథ్యంలో సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన 20 మంది నక్సల్స్ పారిపోతూ వేర్వేరు చోట్ల చిక్కగా.. మరో 8 మంది పోలీసుల ఎదుట లొంగిపోయారు. ములుగు ఎస్పీ శబరీష్ శనివారం వివరాలు వెల్లడించారు. 'కర్రెగుట్టల్లో ఆపరేషన్ కగార్ నేపథ్యంలో కొందరు మావోయిస్టులు వివిధ ప్రాంతాలకు తరలివెళ్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పటిష్ఠ బందోబస్త్ ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టాం. శుక్రవారం వెంకటాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలెం ప్రాజెక్ట్ వద్ద ఆరుగురు మావోయిస్టులు, శనివారం ఉదయం వాజేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతం వద్ద ఏడుగురు మావోయిస్టులు, కన్నాయిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో చేపట్టిన పెట్రోలింగ్‌లో మరో ఏడుగురు పట్టుబడ్డారు. వీరి నుంచి తుపాకులు, గ్రనేడ్లు, మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం పుస్తకాలు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నాం. అలాగే సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన 8 మంది సభ్యులు లొంగిపోయారు. ప్రస్తుతం వీరికి రూ.25 వేల చొప్పున ఇస్తున్నాం.' అని ఎస్పీ వివరించారు.

మయాంక్ కెరీర్‌తో ‘ఆట’లా?

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)




యువ పేసర్ మయాంక్ యాదవ్ క్రికెట్ ప్రవేశం ఓ సంచలనం. బ్యాటర్ల గుండెల్లో గుబులు పుట్టించే వేగంతో బంతులు వేయడం ఈ ఢిల్లీ పేసర్ సొంతం. కానీ తరచూ గాయాల పాలవుతుండడంతో ఈ కుర్ర క్రికెటర్ కెరీరే ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడింది. 2023లో మయాంక్‌ను రూ. 23 లక్షలకు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కొనుగోలు చేసింది. కానీ గాయంతో ఆ ఏడాది ఐపీఎల్‌లో అతడు ఆడలేకపోయాడు. కోలుకొని 2024 ఐపీఎల్ అరంగ్రేటంలోనే ప్రకంపనలు సృష్టించాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై అతడు 156.7 కి.మీ.వేగంతో బంతి వేసి క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. ఆ సీజన్‌లో అద్భుత బౌలింగ్‌తో వరుసగా రెండు పోటీల్లో ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా నిలిచాడు. తర్వాత వెన్నుగాయం తిరగబెట్టడంతో లీగ్ మొత్తానికి దూరమయ్యాడు. ఆపై బెంగళూరులోని ‘సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ)లో నెలపాటు నిపుణుల పర్యవేక్షణలో కోలుకొని తిరిగి బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్ ద్వారా అరంగేట్రం చేశాడు. అయితే ఈ సిరీస్ ముగిసే సరికి మళ్లీ వెన్ను నొప్పి తిరగబెట్టడంతో తిరిగి సీఓఈకి మయాంక్ వెళ్లక తప్పలేదు. చికిత్స తీసుకొని ఈసారి ఐపీఎల్‌లో రెండు మ్యాచ్‌ల్లో ఆడాడో లేదో మళ్లీ అదే వెన్నుగాయానికి లోనయ్యాడు.

లఖ్‌నవూ ఒత్తిడి చేసిందా?

పేసర్లకు గాయాలు సహజమే అయినా.. 22 ఏళ్ల ఫాస్ట్ బౌలర్ ఇలా తరచూ గాయపడడం మన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలోని స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుల పనితీరుపై సందేహాలు రేకెత్తిస్తున్నాయి. మయాంక్ మరోసారి గాయపడడం ఈ సందేహాలకు తావిచ్చింది. ఇక.రూ. 11 కోట్లతో రిటెన్షన్ చేసుకున్న మయాంక్‌ను ఈసారి ఐపీఎల్‌లో ఆడించాలని లఖ్‌నవూ బీసీసీఐపై ఒత్తిడి తెచ్చిందా..అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఐపీఎల్‌లో బరిలో దిగడానికి ముందు సీఓఈలో మయాంక్ కేవలం 10-12 బౌలింగ్ సెషన్లలోనే పాల్గొన్నట్టు సమాచారం. సుదీర్ఘకాలం బౌలింగ్‌కు దూరంగా ఉన్న పేసర్ సామర్థ్యాన్ని అలా కొన్ని సెషన్లలోనే పరిశీలించి పోటీ క్రికెట్ ఆడేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సబబు కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు..ఈ సీజన్‌కు లఖ్‌నవూ శిబిరంలో చేరేటప్పటికే అతడి వెన్నులో వాపు ఉన్నట్టు సమాచారం.

అభిమానుల జోష్‌పై ‘నీళ్లు’



పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	12	8	3	1	17	0.482
గుజరాత్	11	8	3	0	16	0.793
పంజాబ్	11	7	3	1	15	0.376
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	11	6	4	1	13	0.362
కోల్‌కతా	13	5	6	2	12	0.193
లఖ్‌నవూ	11	5	6	0	10	-0.469
హైదరాబాద్	11	3	7	1	7	-1.192
రాజస్థాన్	12	3	9	0	6	-0.718
చెన్నై	12	3	9	0	6	-0.992

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

- ఐపీఎల్ పునఃప్రారంభ మ్యాచ్ రద్దు
- ఏకధాటిగా కురిసిన వర్షం
- కోహ్లీకి మద్దతుగా తెలుపు జెర్సీల సందడి

కోల్‌కతా అవుట్

ప్లేఆఫ్స్‌కు మ్యాచ్ దూరంలో బెంగళూరు

బెంగళూరు: తొమ్మిది రోజుల విరామం తర్వాత.. అభిమానుల సందడి మధ్య ఆరంభం కావాల్సిన ఐపీఎల్‌కు వరుణుడు షాకిచ్చాడు. శనివారం సాయంత్రం నుంచి ఏకధాటిగా వర్షం కురవడంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు-కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్ల మధ్య ఇక్కడ జరగాల్సిన కీలక మ్యాచ్ రద్దయ్యింది. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్‌ను కేటాయించారు. ఫలితంగా 13 మ్యాచ్‌లాడి 12 పాయింట్లతో ఉన్న డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. అటు బెంగళూరు 17 పాయింట్లతో పట్టికలో టాప్‌నకు చేరింది. ఈ మ్యాచ్‌లో నెగ్గితే రజత్ పటీదార్ సారథ్యంలోని బెంగళూరు నేరుగా ప్లేఆఫ్స్‌కు వెళ్లేది. అంతకుముందు సాయంత్రం ఆరు గంటల నుంచే భారీ వర్షం ఆరంభమైంది. దీంతో టాస్ కూడా వీలు పడలేదు. అయితే స్థానిక చిన్నస్వామి స్టేడియంలో అత్యాధునిక డ్రైనేజీ సిస్టం ఉండడంతో మ్యాచ్‌పై ఆశలు పెట్టుకున్నారు. కాసేపు వర్షం ఆగడంతో మ్యాచ్ నిర్వహణకు వీలుగా మైదానం సిబ్బంది రంగంలోకి దిగారు. కాసేపటికే తిరిగి వాన పుంజుకోవడంతో చేసేదేమీ లేకపోయింది. చివరకు రాత్రి 10.23కి మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. ఇదిలావుండగా విరాట్ కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలికాక బరిలోకి దిగడం ఇదే తొలిసారి కావడంతో చాలా మంది ఫ్యాన్స్ తెలుపు జెర్సీలతో కనిపించారు. తమ అభిమాన క్రికెటర్ ప్రదర్శనను తిలకిద్దామనుకున్న వారికి నిరాశే ఎదురైంది. బెంగళూరు తర్వాతి మ్యాచ్‌ను సొంత మైదానంలోనే ఈనెల 23న సన్‌రైజర్స్‌తో ఆడనుంది. అందులో గెలిస్తే అధికారికంగా ప్లేఆఫ్స్‌కు చేరుతుంది.

నేటి మ్యాచ్‌లు

మ్యాచ్	సమయం	వేదిక
రాజస్థాన్ x పంజాబ్	మ.3.30 నుంచి	వేదిక: జైపూర్
ఢిల్లీ x గుజరాత్	రా.7.30 నుంచి	వేదిక: ఢిల్లీ

సచిన్.. ‘ఎస్ఆర్‌టీ’100



ముంబై: క్రికెట్ దిగ్గజాలను బీసీసీఐ ప్రత్యేకంగా గౌరవిస్తోంది. భారత క్రికెట్‌కు అందించిన సేవలకు గుర్తుగా సునీల్ గవాస్కర్ పేరిట ఇటీవలే ప్రత్యేక బోర్డు రూమ్ ఏర్పాటుచేసిన బీసీసీఐ.. తాజాగా సచిన్ టెండూల్కర్ కోసం మరో గదిని కేటాయించింది. సచిన్ వంద శతకాలకు గుర్తుగా ‘ఎస్ఆర్‌టీ100’ పేరుతో ముంబైలోని బోర్డు ప్రధాన కార్యాలయంలో ఓ గదిని ఏర్పాటు చేసింది. స్వయంగా సచిన్ చేతులమీదుగా ఆ గదిని ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి గురైన సచిన్.. జీవితంలో తొలిసారి ఇలాంటి ప్రత్యేక గౌరవాన్ని అందుకుంటున్నా అని వ్యాఖ్యానించాడు.

సుతీర్థ జోడీ ముందంజ

ప్రపంచ టీటీలో శ్రీజకు నిరాశ

దోహా: టేబుల్ టెన్నిస్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత జోడీ ఐహిక ముఖర్జీ/సుతీర్థ ముఖర్జీ మహిళల డబుల్స్‌లో శుభారంభం చేసింది. ఆరంభ రౌండ్లో సుతీర్థ ద్వయం 3-2తో టర్కీ జంటను ఓడించింది. మరో భారత జంట దియా/యశస్విని 3-1తో ఉజ్బెకిస్థాన్ జోడీని ఓడించి రెండోరౌండ్ చేరింది. పురుషుల డబుల్స్ తొలిరౌండ్లో భారత్‌కు చెందిన మానవ్ టక్కర్/మానుష్ షా ద్వయం 3-0తో స్లోవేనియా జోడీని చిత్తుచేసింది. సింగిల్స్‌లో తెలుగమ్మాయి ఆకుల శ్రీజ 1-4తో సుతసిని (థాయ్‌లాండ్) చేతిలో ఓడి ఆరంభంలోనే వెనుదిరిగింది.

ఫైనల్లో యుకీ జోడీ

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ స్టార్ యుకీ బాంబ్రీ.. ఫ్రాన్స్‌లో జరుగుతున్న బార్డ్స్ చాలెంజర్ టోర్నీలో డబుల్స్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సెమీఫైనల్లో రెండోసీడ్ యుకీ/రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ 6-3, 7-6 (7-3)తో బ్రెజిల్‌కు చెందిన మూడోసీడ్ మాటోస్/మార్సెలో జంటను ఓడించింది.

తదుపరి లక్ష్యం.. మరింత ‘దూరం’!



నీరజ్ చోప్రా

దోహా: చాలా కాలంగా ఊరిస్తున్న 90 మీటర్ల మార్క్‌ను అధిగమించడంతో భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఎంతో ఉత్సాహంగా ఉన్నాడు. ఇక తాను మరింత దూరం జావెలిన్‌ను విసరడంపై దృష్టి సారిస్తానన్నాడు. దోహా డైమండ్ లీగ్‌లో 90.23 మీటర్ల దూరం ఈటెను విసిరిన నీరజ్ తన చిరకాల లక్ష్యాన్ని చేరుకున్న సంగతి తెలిసిందే. అయితే అంత దూరం విసిరినా..జర్మన్ అథ్లెట్ జులియన్ వెబర్ (91.06 మీ.) తర్వాత చోప్రా రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ‘90 మీ. మార్క్ చేరుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. కాకపోతే తీపి, చేదు కలబోత. అయినా పర్వాలేదు. నేను, కోచ్ జాన్ జెలెజ్నీ నా త్రోలోని కొన్ని అంశాలను మెరుగుపరుచుకోవడంపై పని చేస్తున్నాం’ అని నీరజ్ శనివారం తెలిపాడు. కాగా..పురుషుల జావెలిన్ త్రోలో వరల్డ్ రికార్డు (98.48 మీ.) చెక్ రిపబ్లిక్‌కు చెందిన జెలెజ్నీ పేరిట ఉండడం గమనార్హం.

ప్రధాని అభినందన

నీరజ్ చోప్రాను ప్రధాని మోదీ అభినందించారు. ‘అద్భుత ఫీట్ సాధించావు. 90మీ. మార్క్‌ను అధిగమించిన నీరజ్‌కు అభినందనలు. ఆటపట్ల అనురక్తి, నిరంతర పరిశ్రమ, అంకితభావానికి దక్కిన ఫలితం ఇది’ అని ప్రధాని ఎక్స్‌లో కొనియాడారు.

కెప్టెన్‌గా గిల్ ఖాయమేనా?

గంభీర్, అగార్కర్‌తో సమావేశాలు



న్యూఢిల్లీ: రోహిత్ శర్మ రిటైర్ కావడంతో భారత టెస్టు జట్టు నూతన కెప్టెన్‌గా ఎవరిని ఎంపిక చేస్తారనే ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ రేసులో పలువురి పేర్లు వినిపిస్తున్నా.. 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్ అందరికంటే ముందున్నాడు. జూన్ 20 నుంచి సాగే ఇంగ్లండ్ పర్యటన కోసం అతడికే పగ్గాలు అప్పగిస్తారనే కథనాలు బలంగా వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో ఇటీవల గిల్‌ను జట్టు ప్రధాన కోచ్ గంభీర్ తన నివాసానికి ఆహ్వానించినట్టు తెలిసింది. ఇద్దరి మధ్య సుదీర్ఘంగా ఐదు గంటలపాటు ఇదే విషయమై చర్చ సాగినట్టు సమాచారం. దీంతో భవిష్యత్ కెప్టెన్‌గా గిల్‌ను ప్రకటించడం ఖాయమని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. అంతేకాకుండా ఈనెల 6న ముంబైలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తోనూ గిల్ సమావేశమయ్యాడట. భారత్ క్రికెట్‌లో ఈ ఇద్దరి ముఖ్యులతో అతడి భేటీ కారణంగా బీసీసీఐ త్వరలోనే అధికారిక ప్రకటన చేయబోతున్నట్టు తెలుస్తోంది. బుమ్రా, పంత్, రాహుల్ పోటీలో ఉన్నా సెలెక్టర్లు కూడా గిల్‌కే మద్దతిస్తున్నట్టు కనిపిస్తోంది. అయితే సీనియర్లను తోసిరాజని గిల్‌కు అనూహ్యంగా పరపతి పెరగడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. బోర్డులోని ముఖ్యులు కూడా ఈ విషయంలో అసంతృప్తితో ఉన్నట్టు కనిపిస్తోంది. ఇంత త్వరగా అతడికి టెస్టు బాధ్యతలు అప్పగించడం సరికాదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. బుమ్రా, జడేజాలలో ఒకరికి కెప్టెన్సీ ఇచ్చి గిల్‌ను డిప్యూటీగా చేస్తే బాగుంటుందని మాజీ స్పిన్నర్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు.

భారత్ ‘ఎ’ జట్టు కోచ్ కనిత్కర్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌లో పర్యటించే భారత్ ‘ఎ’ జట్టు ప్రధాన కోచ్‌గా హృషికేష్ కనిత్కర్‌ను బీసీసీఐ నియమించింది. బౌలింగ్ కోచ్‌గా ట్రాయ్ కూలీ, ఫీల్డింగ్ కోచ్‌గా శుభోదీప్ ఘోష్ వ్యవహరించనున్నారు. ఈ నెల 30 నుంచి జరిగే షాడో టూర్‌లో అభిమన్యు ఈశ్వరన్ నేతృత్వంలోని భారత్ ‘ఎ’.. ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు, భారత సీనియర్‌తో జట్టుతో ఓ అనధికార టెస్ట్ ఆడనుంది.

కార్ల్‌సన్ X ద వరల్డ్



బెర్లిన్: ‘మాగ్నస్ కార్ల్‌సన్ వర్సెస్ ద వరల్డ్’ మెగా గేమ్ మరికొద్ది రోజుల్లో డ్రాగా ముగిసే అవకాశాలున్నాయి. ఫ్రీస్టయిల్ ఫార్మాట్‌లో జరుగుతున్న సింగిల్ గేమ్‌లో ప్రపంచ వ్యాప్తంగా 1,40,000 మందితో కార్ల్‌సన్ తలపడుతున్నాడు. గతనెల 4న మొదలైన ఈ మెగా గేమ్‌లో వరల్డ్ నెం.1 కార్ల్‌సన్ సునాయాసంగా గెలిచి సరికొత్త చరిత్ర సృష్టిస్తాడని అంచనా వేశారు. కానీ, వరల్డ్ జట్టు ఆడుతున్న తీరు చూస్తుంటే గేమ్ డ్రాగా ముగిసే అవకాశాలున్నాయి. ఈ గేమ్‌లో ప్రత్యర్థులు ఒక్కో ఎత్తు వేసేందుకు 24 గంటల సమయం ఉంటుంది. ఓటింగ్ ద్వారా వరల్డ్ టీమ్ ఎలాంటి ఎత్తు వేయాలో నిర్ణయించుకొంటుంది. 1999లో మైక్రోసాఫ్ట్ నెట్‌వర్క్‌పై నాలుగు నెలలపాటు సాగిన గేమ్‌లో రష్యన్ గ్రాండ్ మాస్టర్ కాస్పరోవ్ 50వేల మందితో ఆడి గెలిచాడు. కాగా, గతేడాది చెస్.కామ్‌లో 70 వేల మందితో తలపడిన భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్.. ఆ గేమ్‌లో గెలిచి కాస్పరోవ్ రికార్డును తిరగరాశాడు. కాగా.. ఈ రికార్డును అధిగమించాలనే ఉద్దేశంతో కార్ల్‌సన్ మెగా గేమ్‌ను ఆరంభించినా.. అది సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.

బిజినెస్ ప్లస్

దివీస్ లాభంలో 23% వృద్ధి

క్యూ4లో రూ.662 కోట్లు
ఒక్కో షేరుకు రూ.30 డివిడెండ్

దివీస్ లేబొరేటరీస్.. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో రూ.2,671 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.662 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 23 శాతం, ఆదాయం 12 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో ఫారెక్స్ లాభాలు రూ.10 కోట్లుగా ఉన్నట్లు దివీస్ పేర్కొంది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.9,712 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.2,191 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఈ కాలంలో ఫారెక్స్ లాభాలు రూ.30 కోట్ల నుంచి రూ.48 కోట్లకు పెరిగాయని తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.30 (1,500 శాతం) డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.


జెన్ టెక్నాలజీస్ ఆదాయం రూ.350 కోట్లు

గడచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో జెన్ టెక్నాలజీస్ రూ.113.74 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.37.58 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా రూ.144.04 కోట్ల నుంచి రూ.349.74 కోట్లకు పెరిగింది. మార్చితో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1,032.02 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.299.33 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.2 (200 శాతం) తుది డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

సోలార్ వేఫర్స్ తయారీకి ప్రీమియర్ ఎనర్జీ-ఎస్ఏఎస్ జేవీ

హైదరాబాద్‌కు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్, తైవాన్‌కు చెందిన సీనో- అమెరికన్ సిలికాన్ ప్రొడక్ట్స్ (ఎస్ఏఎస్) జట్టు కట్టాయి. ఇందులో భాగంగా ఇరు సంస్థలు సోలార్ వేఫర్ తయారీ కోసం భాగస్వామ్య సంస్థ (జేవీ)ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాయి. ఈ జేవీ భారత్‌లో ఏటా 2 గిగావాట్ల సామర్థ్యం గల తయారీ ప్లాంట్‌ను నెలకొల్పనుంది. ఫొటోవోల్టాయిక్ సెల్స్, మాడ్యూల్స్ కోసం అవసరమైన సిలికాన్ వేఫర్స్‌ను ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి చేయనున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	535
వరంగల్	522	గోదావరి	535
చిత్తూరు	613	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

పీపీఎఫ్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఏది బెటర్?



చేతిలో నాలుగు డబ్బులు ఉంటే ప్రతి ఒక్కరు వాటిని ఎలా మదుపు చేయాలా అని చూస్తారు. నష్ట భయానికి (రిస్క్) సిద్ధపడితే స్టాక్ మార్కెట్లో మదుపు చేస్తారు. ఎందుకొచ్చిన రిస్క్ అనుకుంటే ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) లేదా పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ (పీపీఎఫ్)ను ఆశ్రయిస్తారు. అయితే ఇందులో ఏది ఎవరికి అనుకూలమంటే అది ఆయా వ్యక్తుల అవసరాలు, లక్ష్యాలను బట్టి ఉంటుంది.

అసలుకు ఢోకా లేకుండా స్థిరమైన ఆదాయాన్ని కోరుకునే ప్రతి మదుపరికి ముందుగా గుర్తుకు వచ్చేది బ్యాంకు ఎఫ్‌డీలు లేదా పీపీఎఫ్. ఎందుకంటే ఈ రెండింటిలో చెల్లింపులకు పెద్దగా ఢోకా లేదు. పీపీఎఫ్ చెల్లింపులకైతే కేంద్ర ప్రభుత్వ హామీ ఉంటుంది. అయితే ఈ రెండు పథకాలు అందిరికీ ఒకేలా వర్తించవు. ఆర్థిక లక్ష్యాలు, నగదు అవసరాలు, ఆదాయ పన్ను (ఐటీ) భారాన్ని బట్టి ఈ పథకాలను ఎంచుకోవాలి. ఇందులో ఒక్కో పథకానికి సంబంధించిన అనుకూల, ప్రతికూలతలను పరిశీలిద్దాం.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ).. ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) ఆఫర్ చేస్తాయి. ఈ ఎఫ్‌డీల కాలపరిమితి ఏడు రోజుల నుంచి పదేళ్ల వరకు ఉంటుంది. కాలపరిమితిని బట్టి వడ్డీ రేటు మారుతుంది. ప్రస్తుతం కాలపరిమితి.. బ్యాంకులను బట్టి ఎఫ్‌డీలపై 6 నుంచి 8 శాతం వరకు వడ్డీ లభిస్తోంది. ఈ వడ్డీ చెల్లింపులను ఎఫ్‌డీ కాలపరిమితి తీరిన తర్వాతనా? లేదా నిర్ణీత గడువులోగా అనే విషయాన్ని మదుపరులే నిర్ణయించుకోవాలి.

పీపీఎఫ్

ఇది 15 ఏళ్ల కాలపరిమితితో కూడిన కేంద్ర ప్రభుత్వ పొదుపు పథకం. ఈ పథకంపై చెల్లించే వడ్డీ రేటును కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మూడు నెలలకు ఒకసారి సవరిస్తుంటుంది. ప్రస్తుతం ఈ పథకంపై 7.1 శాతం వడ్డీ రేటు లభిస్తోంది. ఎవరైనా ఈ పథకంలో సంవత్సరానికి రూ.500 నుంచి రూ.1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. పీపీఎఫ్ పెట్టుబడులకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ కింద రూ..1.5 లక్షల వరకు మినహాయింపు కూడా లభిస్తుంది.

రాబడులు, పన్ను పోటు

పీపీఎఫ్‌తో పోలిస్తే ఎఫ్‌డీలపై వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువ. ఎఫ్‌డీలపై వచ్చే వడ్డీ ఆదాయంపై ఆయా వ్యక్తుల ఆదాయ శ్లాబుల ప్రకారం పన్ను పోటు ఉంటుంది. పీపీఎఫ్‌కు మాత్రం ఎలాంటి పన్ను పోటు ఉండదు. పీపీఎఫ్‌లో పెట్టుబడులు, వాటిపై వచ్చే వడ్డీ ఆదాయం, 15 ఏళ్ల కాలపరిమితి ముగిసిన తర్వాత వచ్చే మొత్తాలన్నింటి పైనా ఎలాంటి పన్ను పోటు ఉండదు.

రెండింటిలో ఏది మంచిదంటే

రాబడులపరంగా చూస్తే ఎఫ్‌డీలతో పోలిస్తే పీపీఎఫ్ పెట్టుబడులే బెటర్. ఎలాగంటే, 30 శాతం ట్యాక్స్ బ్రాకెట్‌లో ఉన్న వ్యక్తి ఎఫ్‌డీలో మదుపు చేస్తే 7 శాతం వడ్డీ వస్తుందనుకుందాం. పన్ను పోటు పోయే సరికి అతడికి నికరంగా లభించే వడ్డీ రేటు 5 శాతం లోపే ఉంటుంది. అదే పీపీఎఫ్‌ను తీసుకుంటే ప్రస్తుతం చెల్లిస్తున్న 7.1 శాతం మొత్తం మదుపరి ఖాతాలోనే పడుతుంది. పైగా ఈ పథకంపై చెల్లించే వడ్డీని ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం చక్రవడ్డీ పద్ధతిలో లెక్కిస్తారు. కాకపోతే ఈ పథకంలో సంవత్సరానికి రూ.1.5 లక్షలకు మించి మదుపు చేసేందుకు వీల్లేదు.

లిక్విడిటీ-వెసులుబాటు

పీపీఎఫ్‌తో పోలిస్తే ఎఫ్‌డీలకు లిక్విడిటీ ఎక్కువ. అంటే వీటిని నిర్ణీత గడువు కంటే ముందే వెనక్కి తీసుకోవచ్చు. కాకపోతే అందుకు కొద్దిగా ఫీజు చెల్లించాలి. పైగా ఎఫ్‌డీలు హామీగా చూపి రుణాలు కూడా తీసుకోవచ్చు. అదే పీపీఎఫ్ పెట్టుబడులను 15 ఏళ్ల కంటే ముందే వెనక్కి తీసుకోవాలంటే అనేక షరతులు వర్తిస్తాయి. ఏడేళ్లు పూర్తి అయితే గానీ పీపీఎఫ్ పెట్టుబడులను అది కూడా పాక్షికంగా మాత్రమే వెనక్కి తీసుకోవడం సాధ్యపడుతుంది. అదే పీపీఎఫ్ మొత్తాన్ని హామీగా చూపి రుణాలు తీసుకోవాలంటే మూడు నుంచి ఆరేళ్ల లోపు మాత్రమే సాధ్యం. హామీతో కూడిన సురక్షిత రాబడుల కోసం చూసే దీర్ఘకాలిక మదుపరులకు మాత్రమే పీపీఎఫ్ మంచి ఆప్షన్ అని చెప్పక తప్పదు.

నష్ట భయం- భద్రత

రెండూ సురక్షిత పథకాలే. కాకపోతే ఎఫ్‌డీలతో పోలిస్తే పీపీఎఫ్ మరింత సురక్షితం. ఎందుకంటే ఈ పథకం చెల్లింపులకు కేంద్ర ప్రభుత్వ పూచీకత్తు ఉంటుంది. మంచి పెద్ద బ్యాంకుల్లో చేసే ఎఫ్‌డీల చెల్లింపులకూ పెద్దగా ఢోకా ఉండదు. ఒకవేళ ఏదైనా బ్యాంకు దివాలా తీసినా రూ.5 లక్షల వరకు ఉండే ఎఫ్‌డీల చెల్లింపులకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ కార్పొరేషన్ (డీఐసీజీసీ) హామీ ఉంటుంది.

ఎఫ్‌డీలు ఎవరికి ?

స్వల్ప, మధ్యకాలిక అవసరాలు ఉన్న మదుపరులు, ఎప్పుడు అవసరమైతే అప్పుడు వెనక్కు తీసుకోవాలనుకునే వారు, తక్కువ ట్యాక్స్ బ్రాకెట్‌లో ఉన్న మదుపరులు ఎఫ్‌డీలను ఎంచుకోవడం మంచిది.

పీపీఎఫ్ ఎవరికి?

పన్ను పోటు లేకుండా దీర్ఘకాలిక ఆస్తుల కల్పన కోసం చూసే వ్యక్తులు, రిటైర్మెంట్, పిల్లల విద్య, వివాహ ఖర్చుల కోసం చూసే మదుపరులు, అధిక ట్యాక్స్ బ్రాకెట్‌లో ఉండి సెక్షన్ 80సీ కింద పన్ను ఆదా కోసం చూసే వ్యక్తులు పీపీఎఫ్‌ను ఎంచుకోవడం మంచిది. ఆర్థికంగా స్థితిమంతులైన వ్యక్తులు తమ పెట్టుబడుల పోర్టుఫోలియోలో ఎఫ్‌డీలతో పాటు పీపీఎఫ్‌ను ఉంచుకోవడం మంచిది. అయితే వారి పెట్టుబడుల లక్ష్యం, కాలపరిమితి, పన్ను పోటు ఆధారంగా ఉండాలి.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	124
వరంగల్	125	గుంటూరు	127
కరీంనగర్	125	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	120
కర్నూలు	125	నెల్లూరు	125
విశాఖపట్నం	121	అనంతపురం	125
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,180 ▲	87,250 ▲	1,08,000 ▲
విజయవాడ	96,350 ▼	90,500 ▲	98,150 ▼
విశాఖపట్నం	95,130 ▼	87,200 ▲	1,08,000 ▼
రాజమండ్రి	95,130 ▲	87,200 ▲	98,400 ▲
ప్రొద్దుటూరు	95,300 ▼	87,680 ▼	98,300 ▲
ముంబై	92,301 ▼	84,548 ▼	94,606 ▲

2024-25 ఆర్థిక సంవత్సరం: లావాదేవీలను సరి చేసుకోవటం ఎలా?

ఈ మార్చితో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఇప్పటి వరకు వివిధ రకాల రిటర్నులు దాఖలు చేసినప్పటికీ, వార్షిక రిటర్న్ దాఖలు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే ఇన్‌కమ్ టాక్స్‌కి సంబంధించిన రిటర్నులు కూడా దాఖలు చేయాల్సి ఉంది. కాబట్టి ముందుగా వ్యాపార సంస్థలు తమ అన్ని రకాలైన లావాదేవీలను మరొకసారి సరి చూసుకోవాలి. పొరపాట్లు ఏమైనా ఉంటే వార్షిక రిటర్న్‌లో లేదా ఈలోపు గానీ సరి చేసుకోవచ్చు. నిబంధనల మేర కొంతమందికి వార్షిక రిటర్నుల నుంచి మినహాయింపు ఉన్నప్పటికీ, ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలను సరిచేసుకోవటం అందరికీ అవసరం. వీటికి సంబంధించిన ముఖ్య విషయాలు మీకోసం..

మొదటగా, అమ్మకాల విషయాన్ని పరిశీలించాలి. బుక్స్‌లో చూపిన అమ్మకాలు, మీరు దాఖలు చేసిన జీఎస్‌టీఆర్-1, జీఎస్‌టీఆర్-3బీ రిటర్నుల్లో చూపిన అమ్మకాలతో సరిపోతున్నాయా లేదా చూడాలి. అలాగే జీఎస్‌టీఆర్-1, జీఎస్‌టీఆర్-3బీ మధ్య లావాదేవీల్లో ఏమైనా తేడాలున్నాయో చూసుకోవాలి. అన్ని ఇన్వాయిస్‌లు, క్రెడిట్/డెబిట్ నోట్స్ రిటర్నుల్లో చూపబడ్డాయా లేదా ధ్రువీకరించుకోవాలి. రాష్ట్ర అంతర్గత సరఫరాలు, అంతర్ రాష్ట్ర సరఫరాలు సరిగ్గా చూపారా.. అంటే ప్లేస్ ఆఫ్ సప్లయ్ సరిగ్గా చూపించారా నిర్ధారించుకోవాలి.

ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) విషయానికొస్తే.. జీఎస్‌టీఆర్-2బీ లో కనిపించే ఇన్వాయిస్‌ల ఆధారంగానే ఐటీసీ తీసుకోవాలి. అలాగే అర్హత ఉన్న మేరకే (జీఎస్‌టీఆర్-2బీ లో కనిపించినప్పటికీ) ఐటీసీ తీసుకోవాలి. ముఖ్యంగా పొందిన సరఫరాలలో వ్యక్తిగత వినియోగం కోసం లేదా వ్యాపారేతర అవసరాల కోసం ఏమైనా వాడితే ఆ మేరకు ఐటీసీ తీసుకోరాదు. అలాగే ఫుడ్, వాహనాలు, ఉద్యోగుల ఇన్సూరెన్స్ లాంటి వాటిని వ్యాపార అవసరాల కోసం వాడినప్పటికీ ఐటీసీ కోసం అదనపు నిబంధనలు పొందుపరచటం జరిగింది. కాబట్టి ఇలాంటి వాటి మీద ఐటీసీ తీసుకునేటప్పుడు తప్పనిసరిగా అర్హత ఉందో లేదో చెక్ చేసుకోవాలి. కామన్ ఇన్‌పుట్స్‌ను పన్ను చెల్లించే సరఫరాలు, పన్ను మినహాయింపు పొందిన సరఫరాలకు వాడినట్లయితే సంబంధిత నిబంధనల ప్రకారం పన్ను మినహాయింపు పొందిన సరఫరాల మేరకు రివర్స్ చేయాలి. ముఖ్యంగా 180 రోజుల లోపు సరఫరాదారులకు సంబంధిత మొత్తం చెల్లించని బిల్లులపై ఐటీసీ రివర్స్ చేయాలి.



రాంబాబు గొండాల

జీఎస్‌టీ క్యాష్, క్రెడిట్ లెడ్జర్లు కూడా బుక్స్‌తో పోల్చుకుని ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయేమో చూడాలి. చెల్లించాల్సిన పన్నుకు, చెల్లించిన పన్నుకు మధ్య తేడాలు ఏమైనా ఉన్నాయో గమనించాలి. ఇంకా, పన్ను చెల్లింపులు నిర్ధారిత సమయంలో అంటే ‘టైమ్ ఆఫ్ సప్లయ్’ నిబంధనల మేర జరిగినట్లు ధ్రువీకరించుకోవాలి. ముఖ్యంగా సర్వీస్‌ల విషయంలో అడ్వాన్సులు పొందినప్పుడు లేదా ఇన్వాయిస్‌లు తదుపరి నెలలో ఇచ్చినప్పుడు పన్ను చెల్లింపులను జాగ్రత్తగా చూసుకోవాలి.

రివర్స్ చార్జీ విషయంలో కూడా జాగ్రత్తలు అవసరం. లీగల్ ఫీజులు, డైరెక్టర్ రెమ్యునరేషన్, సేవల దిగుమతులు వంటి వాటిపై జీఎస్‌టీ చెల్లించి ఆ మేరకు ఐటీసీ క్లెయిమ్ చేశారా లేదా తెలుసుకోవాలి. బుక్స్‌లో చేసిన ఎంట్రీలు, రిటర్నుల్లో చూపిన ఆర్‌సీఎం వివరాలతో సరిపోతున్నాయా ధ్రువీకరించుకోవాలి.

క్రెడిట్ నోట్, డెబిట్ నోట్స్ జారీ విషయంలో, సంబంధిత పన్ను, ఐటీసీ సర్దుబాట్లు నిబంధనల మేర జరిగేటట్లు చూసుకోవాలి. మొత్తంగా చెప్పాలంటే అమ్మకాలు, ఐటీసీ, ఆర్‌సీఎం, లెడ్జర్లు, వివాదాలకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి ఖాతాలకు తుది రూపమివ్వటం వల్ల పన్నులపరంగా సమస్యలు, వివాదాలు రానివ్వకుండా ఉండే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులకు, జీఎస్‌టీ రిటర్నులకు మధ్య ఎలాంటి వ్యత్యాసం లేకుండా చూసుకోవాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.





గచ్చిబౌలి స్టేడియంలో యోగా సాధన చేస్తున్న అందాల భామలు, సరదాగా పరుగు పోటీలో..

అందంగా.. ఆటవిడుపు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రజల్లో ఫిట్‌నెస్‌పై అవగాహన పెరుగుతుందని బీసీసీఐ ఉపాధ్యక్షుడురాజీవ్‌శుక్లా అన్నారు.

బాహుబలి కుర్చీలో సుందరీమణులు

ప్రపంచ సుందరి పోటీదారులు శనివారం రామోజీ ఫిలింసిటీని సందర్శించారు. బాహుబలి సినిమా సెట్టింగ్, మూవీ మొఘల్ గార్డెన్‌లో కలియదిరిగారు. కొందరు అందాల భామలు బాహుబలి కుర్చీలో కూర్చొని, భల్లాలదేవ తల భాగం, బాణాల వాహనం సెట్‌ల వద్ద ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. అయితే ఈ కార్యక్రమం వద్ద పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి, మీడియా ప్రతినిధులను అడ్డుకున్నారు. సమాచార శాఖ అధికారులు ఇచ్చిన పాసులు ఉన్నా, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ చెప్పినా పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

నేడు సచివాలయానికి

ప్రపంచ సుందరి పోటీలో ఉన్న అందాల భామలు.. ఆదివారం సాయంత్రం తెలంగాణ సచివాలయాన్ని సందర్శించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు వారికి వివరించనున్నారు. సచివాలయం ప్రాంగణంలో ఫొటోలు దిగనున్నారు. ఈ నేపథ్యంలో సచివాలయం, పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేయనున్నట్లు ప్రకటించారు.



షాట్‌పుట్‌లో భాగంగా బంతిని విసురుతున్న మిస్‌వర్ల్డ్ పోటీదారు





గచ్చిబౌలి స్టేడియంలో చిన్నారులతో చెస్ ఆడుతున్న ప్రపంచ సుందరీమణులు, బ్యాడ్మింటన్ ఆడుతున్న దృశ్యం

అందమే కాదు.. ఆదర్శం కూడా..

అందం అంటే శారీరకమే కాదు.. స్పందించే హృదయం, తోటివారికి సహాయపడాలనే మంచి మనసు కూడా. ప్రపంచ సుందరి పోటీల్లో ముఖ్యమైన అంశమూ ఇదే.. 'బ్యూటీ విత్ ఏ పర్పస్'. ఈ పోటీల్లో పాల్గొంటున్న కొందరు సుందరీమణులు సమాజ అభ్యున్నతి కోసం చేస్తున్న కృషిని, తాము ఎంచుకున్న ప్రాజెక్టుల వెనుక ఉద్దేశం ఏమిటన్నది వివరించారు.

దివ్యాంగులను చూసే తీరులో మార్పు కోసం..

దేశంలో సుమారు మూడు కోట్ల మంది దివ్యాంగులు ఉన్నారని అంచనా. దివ్యాంగులను జాలిగా చూస్తారే తప్ప.. వారిని గౌరవించడమనేది మన సమాజంలో కాస్త తక్కువే. మా అంకుల్‌కు ఉన్న వైకల్యం, ఆయన ఇబ్బందులు చూస్తూ పెరిగా. వారి కోసం ఏదైనా చేయాలన్న తపనతో ప్రాజెక్ట్ ఏక్తాను ప్రారంభించా. స్కూళ్లు, కాలేజీలు, వర్సిటీల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను.

- నందిని గుప్తా, మిస్ వరల్డ్ ఇండియా

కిడ్నీ వ్యాధులపై అవగాహన కోసం..

బెలీజ్ దేశంలో కిడ్నీ వ్యాధుల సమస్య బాగా పెరిగిపోయింది. అక్కడివారిలో 13.7 శాతం మంది ఈ వ్యాధులతో బాధపడుతున్నారు. అందుకే కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించి... ఆ సమస్య బారినపడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే ఈ సమస్యను రూపుమాపగలం.

- మిస్ వరల్డ్ బెలిజ్, షాయరీ మోరాతాయా

గృహ హింసకు వ్యతిరేకంగా పోరాటం..

ఆస్ట్రేలియా అవకాశాల గని. కానీ మహిళలపై వేధింపులు కూడా అంతే స్థాయిలో ఉన్నాయి. గత 14 నెలల్లో అక్కడ 120 మందికిపైగా మహిళలు, చిన్నారులు కుటుంబంలో గొడవలతో హత్యకు గురయ్యారు. గత సంవత్సరం మూడు లక్షలకుపైగా గృహహింస కేసులు నమోదయ్యాయి. దీనిపై పోరాటం చేపట్టా. తారా బ్రౌన్ ఫౌండేషన్ ప్రారంభించి.. గృహ హింసకు వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తున్నాను. చిన్నారుల కోసం ఈ అంశంపై ఒక పుస్తకం కూడా రాశాను.

- మిస్ వరల్డ్ ఆస్ట్రేలియా, జాస్మిన్ స్ట్రింగర్

విద్యతో సాధికారిత సాధించేందుకు..

ఆధునిక ప్రపంచంలో అన్నీ ఉన్నా.. ఎంతోమంది ప్రాథమిక హక్కులకు కూడా దూరమైపోతున్నారు. విద్యతోనే ఈ సమాజాన్ని మార్చగలం. టీచింగ్ అంటే నాకు ఎంతో ఇష్టం. టీచర్‌గా సేవలు అందిస్తున్నాను. పెస్కార్ ప్రాజెక్ట్ ద్వారా నిరుపేదల అభ్యున్నతికి, ఉన్నత విద్య అందించేందుకు కృషి చేస్తున్నాను.

- మిస్ వరల్డ్ బ్రెజిల్, జెస్సికా పెడ్రోసో

మహిళా సాధికారిత కోసం..

మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నాను. ప్రకటనల రంగంలో పనిచేస్తూ ఎందరో మహిళా ఔత్సాహిక వ్యాపార వేత్తలను కలుసుకున్నాను. వారికి డిజిటల్ మార్కెటింగ్ ద్వారా మద్దతు అందించాలని నిర్ణయించుకుని.. ప్రాజెక్ట్ ఎల్లాస్ క్రెసిన్ ప్రారంభించాను. మా దేశంలో 60 శాతం చిన్న, సూక్ష్మ వ్యాపారాలను మహిళలే నిర్వహిస్తున్నారు. వారు అభివృద్ధి చెందడానికి తోడ్పడుతుండటం సంతోషంగా ఉంది.

- మిస్ వరల్డ్ ఎల్ సాల్వాడర్, సోఫియా ఎస్టెపినియన్

ఉద్యోగులను ఇబ్బంది పెడితే ఊరుకోం

» ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని బీఆర్ఎస్ నిర్ణయం

» ఉద్యోగ సంఘాల నేతలతో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ

హైదరాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): లక్షల మంది ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు చెప్పారు. ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చేవరకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పూర్తిస్థాయి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. హరీశ్‌రావు నివాసంలో ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమావేశం జరిగింది. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చకపోవడం, డీఏ బకాయిలు, పీఆర్సీ వంటి ప్రధాన డిమాండ్లను పట్టించుకోకపోవడం, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను కూడా సకాలంలో అందించకపోవడం వంటి విషయాలను కేటీఆర్, హరీశ్‌రావుల దృష్టికి సంఘ నాయకులు తీసుకొచ్చారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

» ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చెప్పారు. ఉద్యోగ సంఘాలు ప్రస్తావించిన 57 సమస్యల్లో 45కు పైగా తక్షణమే పరిష్కరిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. 15 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలు పూర్తి చేసి పదోన్నతులిచ్చినట్లు చెప్పారు. సీఎల్‌పీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతినెల మొదటి తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామన్నారు. తమ ప్రభుత్వంవచ్చాక ఒక డీఏ ఇచ్చినట్టు తెలిపారు.

కాళేశ్వరం కేసులో మంత్రి శ్రీధర్‌బాబుకు ఊరట

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తుండగా వారి విధులకు ఆటంకం కలిగించారంటూ 2017లో ప్రస్తుత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై నమోదైన కేసును శనివారం నాంపల్లి కోర్టు కొట్టేసింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో శ్రీధర్‌బాబు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ప్రభుత్వ సలహాదారుడు హెచ్.వేణుగోపాల్‌తో సహా మరో 13 మంది కాంగ్రెస్ నాయకులు, సుమారు 300 మంది రైతులను ఈ కేసులో నిర్దోషులుగా కోర్టు ప్రకటించింది.

పెళ్లి పీటలపై వరుడి మృతి

తాళి కట్టిన కాసేపటికి గుండెపోటు.. కర్ణాటకలో విషాద ఘటన



ప్రవీణ్ (ఫైల్)

బెంగళూరు, మే 17(ఆంధ్రజ్యోతి): వధువు మెడలో తాళి కట్టిన 20 నిమిషాలకే, పెళ్లి పీటలపైనే వరుడు మృతిచెందాడు. ఈ విషాద సంఘటన కర్ణాటక రాష్ట్రం బాగల్‌కోటె జిల్లా జమఖండి పట్టణంలో శనివారం జరిగింది. జమఖండి తాలూకా కుంబారహళ్లికి చెందిన ప్రవీణ్ కుర్నే(24) వ్యవసాయం చేసేవాడు. ఈ యువకుడికి ఇదే ప్రాంతానికి చెందిన యువతితో పెళ్లి నిశ్చయించారు. రిసెప్షన్ వేడుకలు జమఖండి పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. బంధుమిత్రులంతా సంతోషంగా పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో శనివారం మధ్యాహ్నం 12.15గంటలకు వధువు మెడలో వరుడు తాళికట్టాడు. బంధుమిత్రులు వధూవరులను ఆశీర్వదించారు. పెళ్లి పీటలపైనే మరిన్ని ప్రక్రియలు పురోహితులు కొనసాగిస్తుండగా, వరుడు ప్రవీణ్ తన తండ్రి శ్రీశైలను దగ్గరకు పిలిచాడు. తనకు తల తిరుగుతోందని చెప్పాడు. తండ్రి నీళ్లు తెప్పించి తాగించేందుకు ప్రయత్నిస్తుండగానే ఒక్కసారిగా కుప్పకూలాడు. దీంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు జరిపిన వైద్యులు, అప్పటికే ప్రవీణ్ గుండెపోటుతో మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ ఘటనతో పెళ్లి వేడుకలకు వచ్చిన వారంతా దుఃఖంలో మునిగిపోయారు. బంధుమిత్రులంతా ప్రవీణ్ అంత్యక్రియలలో పాల్గొన్నారు.

ధరణి పేరుతో ప్రభుత్వ, ప్రైవేట్ భూముల కబ్జా

» సొంత లాభాల కోసం రియల్ వ్యాపారాలు సాగించారు

» పేదల భూములు గుంజుకున్నది బీఆర్ఎస్సే

» సంగారెడ్డి పరిధిలోని కొండాపూర్ భూభారతి సదస్సులో మంత్రి పొంగులేటి

సంగారెడ్డి ప్రతినిధి, మే17(ఆంధ్రజ్యోతి): ధరణి పేరుతో ప్రభుత్వ, ప్రైవేట్ భూములను కబ్జా చేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల కేంద్రంలో భూభారతి పైలెట్ ప్రాజెక్టుపై జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి సంగారెడ్డిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం సదస్సులో పొంగులేటి ప్రసంగించారు. ధరణి వల్ల న్యాయం జరగకపోవడంతో రైతులు నిద్రలేని రాత్రులు గడిపారని అన్నారు. అందుకే రైతులు నచ్చినట్లుగా, మెచ్చినట్లుగా భూభారతి రెవెన్యూ చట్టాన్ని రూపొందించామని వివరించారు. 18 రాష్ట్రాల్లోని రెవెన్యూ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే భూభారతిని అమల్లోకి తెచ్చామని తెలిపారు. ఈ చట్టం ఆచరణలో ఎవరైనా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు రైతుల విషయంలో మానవతా దృక్పథాన్ని ప్రదర్శించాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి భూసమస్యలన్నింటికీ పరిష్కారం చూపించడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. ఇప్పటి వరకు ప్రభుత్వం తరఫున 256 మంది సర్వేయర్లు ఉన్నారని, మరో వెయ్యి మంది సర్వేయర్లను నియమించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా జూన్ 2వ తేదీన 10,956 మంది గ్రామ రెవెన్యూ అధికారుల నియామకం ఉంటుందని ప్రకటించారు. గత ప్రభుత్వం పేదల భూములతో రియల్ వ్యాపారాలు సాగించిందని, పేదల భూములను గుంజుకున్న చరిత్ర బీఆర్ఎస్‌ది అని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేదల భూములకు రక్షణగా నిలుస్తున్నదని ఆయన అన్నారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. భూభారతి చట్టంతో పేదలందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ సదస్సులో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, ఎంపీ సురేశ్ షెట్కార్, కలెక్టర్ క్రాంతి వల్లూరు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న జగ్గారెడ్డి; చిత్రంలో మంత్రి దామోదర, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, ఎంపీ సురేశ్ షెట్కార్

సిందూర్.. అద్భుత విజయం

(మొదటిపేజీ తరువాయి)



తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నేతలు

వచ్చిందన్నారు. కాల్పుల విరమణకు ఒప్పుకోవడం ద్వారా యుద్ధాన్ని నివారిస్తూ ప్రధాని మోదీ కీలకంగా వ్యవహరించారని నేతలు కీర్తించారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా సైనికులకు సంఘీభావంగా సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఫోరం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్ మీదుగా చిల్డ్రన్ పార్కువద్ద ఉన్న యుద్ధ ట్యాంకు వరకు వేలాదిమందితో తిరంగా ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది జాతీయ జెండాలు చేతబూని జై జవాన్, జై కిసాన్, వందేమాతరం, భారత్ మాతాకి జై నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుతో పాటు మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, రక్షణశాఖ మాజీ సలహాదారు సతీశ్ రెడ్డి ఓపెన్ టాప్ వాహనం ఎక్కి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ పాకిస్థాన్‌తో చర్చలు జరిగితే పీఓకే విలీనంపైనే జరుగుతాయని, ఈ విషయంలో అమెరికా, చైనా తదితర దేశాల జోక్యం అవసరం లేదని, సమస్యను పరిష్కరించుకునే సత్తా భారత్‌కు ఉందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో వీరోచిత పోరాటం చేసిన సైనికులందరికీ జేజేలు కొట్టాలన్నారు. దేశాన్ని కాపాడుకోవడానికే భారత్ ఎదురుదాడికి దిగిందని, ప్రధాని మోదీ వ్యూహాత్మకంగా వ్యవహరించారని చెప్పారు. దేశ ఐకమత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వెంకయ్య చెప్పారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం కేంద్రంగా రెచ్చిపోతున్న ఉగ్రవాదులకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. స్లీపర్ సెల్స్ హైదరాబాద్‌లోనే ఉన్నారని, ఇంటి దొంగలను గుర్తించి వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ ఉగ్రవాదుల అంతు చూసే వరకు వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఉగ్ర కుట్రలకు ప్రతిఫలం ఏమిటో పాకిస్థాన్ చూసిందన్నారు. డీఆర్డీవో మాజీ ఛైర్మన్ సతీశ్ రెడ్డి మాట్లాడుతూ... పాకిస్థాన్ వైమానిక స్థావరాలపై వేసిన బ్రహ్మోస్ క్షిపణులు, డ్రోన్లను కూల్చేసే యాంటీ డ్రోన్ సిస్టమ్ హైదరాబాద్‌లోనే తయారు చేసినవేనన్నారు. లెఫ్టినెంట్ జనరల్ రవిప్రసాద్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ కనీవినీ ఎరుగని గొప్ప విజయమన్నారు. మాజీ ఎంపీ, సినీనటి జయప్రద మాట్లాడుతూ ఆడపడుచుల నుదిటిపై సింధూరాన్ని తుడిచివేస్తే ప్రతికారం ఎలా ఉంటుందో పాకిస్థాన్‌కు మోదీ చూపించారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు, మాజీ సైనికాధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీలో మందకృష్ణ మాదిగ కాలుకు స్వల్పగాయం

తిరంగా ర్యాలీ సందర్భంగా ట్యాంక్‌బండ్ యుద్ధ ట్యాంక్ వద్ద జరిగిన సభలో తోపులాట జరగడంతో ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కాలుకు స్వల్పంగా గాయమైంది. వెంటనే అనుచరులు ఆయనున్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

నెలాఖరు లేదా జూన్ తొలి వారంలో..

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ

సీఎం, మంత్రులు, నేతలంతా కలిసే ఉన్నారు

బీఆర్ఎస్, బీజేపీలవి తప్పుడు ఆరోపణలు

టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్



నిజామాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఈనెలాఖరులో లేదా జూన్ మొదటి వారంలో ఉండే అవకాశం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. నిజామాబాద్‌లోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శనివారం విలేకరులతో ఆయన చిట్‌చాట్ చేశారు. రాష్ట్రంలో వివిధ సమీకరణాల వల్లే మంత్రివర్గ విస్తరణ జాప్యం అవుతోందన్నారు. రాష్ట్ర పీసీసీ కార్యవర్గం ఈనెల 26 లేదా 27న ఖరారు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. అన్ని అంశాలను పరిశీలించి పార్టీ కోసం పనిచేసిన వారికి, సామాజిక సమీకరణాలకు అనుగుణంగా అందరికీ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. సీఎం, మంత్రులు, పార్టీ సీనియర్ నేతలంతా కలిసే పని చేస్తున్నారని, ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను తీర్చడమే లక్ష్యంగా తాము ముందుకు వెళ్తున్నామని చెప్పారు. కావాలనే బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రిని మార్చాల్సిన అవసరం ఏముందని, అందరిని కలుపుకొని పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలు అన్ని విషయాలను వక్రీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని, మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను కూడా వక్రీకరించారని ఆరోపించారు. ఆమె మాట్లాడిన మొత్తం విషయాలను పరిశీలించకుండా కొన్ని వ్యాఖ్యలను మాత్రమే సోషల్ మీడియాలో వైరల్ చేశారని మండిపడ్డారు. దీనిపైన ఆమె వివరణ కూడా ఇచ్చారని చెప్పారు. అసత్య ప్రచారాలు చేసిన వారిపై సైబర్ క్రైమ్‌లో కేసులు పెడుతున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను కట్టడి చేసేందుకు మధ్యప్రదేశ్‌లో ఒక చట్టాన్ని తీసుకొచ్చారని, తెలంగాణలోనూ అటువంటి చట్టాన్ని తీసుకోచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. మహిళా కాంగ్రెస్ ఆందోళనలు సర్వసాధారణం అని తమ పార్టీలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు రాష్ట్రంలో భవిష్యత్తు లేదని, ఆ పార్టీలో ప్రస్తుతం మూడు ముక్కలాట నడుస్తోందన్నారు. కవితకు కేసీఆర్‌కు, కవితకు కేటీఆర్‌కు, కేటీఆర్ హరీశ్ రావుకు మధ్య పంచాయితీ నడుస్తోందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని, ఆ రెండు పార్టీలే కలిసి పని చేస్తున్నాయని ఆయన అన్నారు.



సీపీ సీవీ ఆనంద్‌కు సీఎం అభినందనలు

» డ్రగ్స్ నియంత్రణలో అవార్డుపై హర్షం

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నియంత్రణలో 138 దేశాలతో పోటీపడి తెలంగాణ పోలీసులు నంబర్‌వన్ స్థానాన్ని సాధించడం గర్వంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ప్రపంచానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలవాలనేది తన ఆకాంక్ష అని అన్నారు. ఈ ఘనతను సాధించిన హైదరాబాద్ కమిషనర్, సిటీ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చీఫ్ సీవీ ఆనంద్, ఆయన బృందానికి సీఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు. మాదక ద్రవ్యాలు లేని తెలంగాణ కోసం తాను కంటున్న కలలను సాకారం చేయడానికి కృషి చేస్తున్న ప్రతి పోలీసుకు మద్దతుగా ఉంటానని సీఎం స్పష్టంచేశారు. దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ పోలీసు సమ్మిట్‌లో 'ఎక్సలెన్స్ ఇన్ యాంటీ నార్కోటిక్స్' అవార్డును అందుకున్న సందర్భంగా సీవీ ఆనంద్ శనివారం ఉదయం సీఎంను కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సీఎం అభినందించారు.

హజ్ యాత్రికులకు సీఎం శుభాకాంక్షలు

శామీర్‌పేట: హజ్‌యాత్రకు వెళ్తున్న పలువురు ముస్లింలకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శామీర్‌పేటకు చెందిన రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ముజీబుద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నగరంలోని స్టేట్ హజ్ హౌస్‌లో 300 మంది ముస్లింలను మక్కాకు పంపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

2204 మంది అనాథ పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు

» అనాథ చిన్నారులకు సర్కారు అండగా ఉంటుంది: సీతక్క

» 95కి పైగా ఆస్పత్రుల్లో 180 పైగా చికిత్సలు: పొన్నం

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): అనాథాశ్రమాల్లో ఉంటున్న పిల్లలు ఆత్మవిశ్వాసంతో చదువుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని పిల్లలకు ఆమె భరోసా ఇచ్చారు. హైదరాబాద్ జిల్లాలోని చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూషన్స్ (సీసీఐ)లో ఉంటున్న 2204 మంది అనాథ పిల్లలకు బేగంపేటలోని టూరిజం ప్లాజాలో శనివారం మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. దేశంలోనే మొదటిసారిగా హైదరాబాద్ జిల్లాలో 2204మందికి అనాథ, నిరాశ్రయులైన పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశామని, రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అనాథ చిన్నారులందరికీ కార్డులను అందిస్తామని సీతక్క చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా గుర్తింపు పొందిన 95కి పైగా ఆస్పత్రుల్లో 180కి పైగా వైద్య చికిత్సలు ఉచితంగా పొందే అవకాశం లభిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అనంతరం అనాథలతో కలిసి మంత్రులు సహపంక్తి భోజనం చేశారు.

మెట్రో టికెట్ ధరల పెంపును వెనక్కు తీసుకోవాలి

» సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల లేఖ

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రైల్ టికెట్ ధరల పెంపును వెనక్కు తీసుకోవాలని నగర బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ పంపారు. మెట్రో టికెట్ ధరల పెంపు వల్ల లక్షలాది పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని లేఖలో పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో ప్రజల అవసరాలకనుగుణంగా పనిచేయాలని, ప్రైవేట్ కంపెనీల లాభాల కోసం కాదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. టికెట్ ధరల పెంపు వల్ల ప్రయాణికులు ఇతర రవాణా మార్గాలకు మారే పరిస్థితి ఉందని, దీని వల్ల ట్రాఫిక్, కాలుష్య సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశముందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితాఇంద్రారెడ్డి, టి.పద్మారావు గౌడ్, మాగంటి గోపినాథ్, కేపీ వివేకానంద గౌడ్, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, బండారు లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డిలు సంయుక్తంగా సీఎంకు లేఖ పంపారు. కాగా, కేసీఆర్ హయాంలో మెట్రో టికెట్ ధరలు పెంచలేదని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.

జోనల్ వ్యవస్థను రద్దు చేయాలి

» తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ డిమాండ్

బర్కత్‌పుర, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాలకు కోడి గుడ్లు సరఫరా చేసే జోనల్ వ్యవస్థను రద్దు చేయాలని తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, భాస్కర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 33 జిల్లాలకు విడివిడిగా కోడి గుడ్ల టెండర్లను కేటాయించాలని కోరారు. బషీర్‌బాగ్‌లోని నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పౌల్ట్రీ రైతులు 1,267 మందికిపైగా ఉండగా కేవలం అయిదుగురికి మాత్రమే టెండర్లు వచ్చేలా అధికారులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో నాణ్యతలేని కోడి గుడ్లు సరఫరా చేసిన వారికే మళ్లీ టెండర్లు ఇస్తున్నారని విమర్శించారు. బర్డ్ ఫ్లూ కారణంగా నష్టపోయిన పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలని, టెండర్లలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గత రేట్ల కంటే తక్కువకు నాణ్యమైన గుడ్లు సరఫరా చేయడానికి పౌల్ట్రీ రైతులు సిద్ధంగా ఉన్నారని వారు తెలిపారు. 33 జిల్లాలకు సాధ్యం కాకపోతే కనీసం ఉమ్మడి 10 జిల్లాల ప్రాతిపదికనైనా టెండర్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పౌల్ట్రీ రైతులను ఆదుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

భారత్, పాక్‌లు చర్చించుకోవాలి

» రష్యా సూచన

న్యూఢిల్లీ, మే 17: సమస్యల పరిష్కారానికి భారత్,పాకిస్థాన్‌లు చర్చలు జరుపుకోవాలని రష్యా సూచించింది. ఇప్పటికే అమెరికా, చైనాలు ఇలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా తాజాగా ఆ జాబితాలో రష్యా చేరింది. సరిహద్దుల్లో మిలటరీ చర్యల నిలుపుదల, కాల్పుల విరమణకు ఈ నెల పదో తేదీన కుదిరిన ఒప్పందం స్ఫూర్తిని కొనసాగించాలని తెలిపింది. ఘర్షణలు పునరావృతం కాకుండా విభేదాలను చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని, రాజకీయ అంగీకారానికి రావాలని పేర్కొంది. మాస్కోలో రష్యా విదేశాంగ అధికార ప్రతినిధి మారియా జఖరోవా ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భారత్-పాక్‌ల మధ్య తలెత్తిన ఘర్షణ, అనంతరం కుదిరిన కాల్పుల ఒప్పందంపై రష్యా వైఖరి ఏమిటంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె ఈ సమాధానం ఇచ్చారు. రెండు దేశాల మధ్య ప్రత్యక్ష చర్చలు జరగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. చర్చలను పునఃప్రారంభించాలని అన్నారు

మహిళల ఓట్లు మాకే

(మొదటి పేజీ తరువాయి)

మహిళలను ప్రోత్సహించే 'విమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం', కళాశాలల్లో యువతుల కోసం 'గ్రాస్ రూట్ యూత్ ఇన్నోవేషన్ ప్రోగ్రాం'లను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ఇందిరాగాంధీ నేతృత్వంలో దేశం ఎంతో అభివృద్ధి సాధించింది. సోనియాగాంధీ నేతృత్వంలో రెండుసార్లు యూపీఏ ప్రభుత్వం ఆర్టీఐ, ఆర్టీఏ, ఆహార భద్రత, ఉపాధి హామీ వంటి చరిత్రాత్మక పథకాలను ప్రారంభించింది. ఇందిర, సోనియా నేతృత్వంలో దేశం మహిళా సాధికారిత వైపు పరుగులు పెట్టింది. అందుకే రాష్ట్రంలోని మహిళలంతా కాంగ్రె‌స్‌కే మద్దతు పలుకుతున్నారు. వారి ఆశయాలను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తోంది" అని అన్నారు. రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం ఆరోగ్య భద్రత కల్పిస్తుందని సీఎం చెప్పారు. వారికి యునిక్ నంబర్ గానీ, క్యూఆర్ కోడ్ గానీ ఉండే గుర్తింపు కార్డును జారీ చేసే విధానాన్ని అమల్లోకి తేవాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌ను ఆదేశించారు. ఆరోగ్య, ఆర్థికపరమైన వివరాలతో కూడిన డేటా బేస్ తయారు చేసి అందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలని, ప్రతి ఆరోగ్య పరీక్ష వివరాలను అందులో పొందుపరచాలన్నారు.

మహిళలకు మరో 600 బస్సులు..

తెలంగాణ 'ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ'ను సాధించాలంటే రాష్ట్రంలో కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలని, ఆ లక్ష్య సాధనలో భాగంగానే ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా ఒక్కో మహిళ నెలకు దాదాపు రూ.5వేల మేరకు ఆదా చేస్తున్నారని, ఆర్టీసీ కూడా లాభాల బాట పట్టిందని చెప్పారు. "ఆర్టీసీ ద్వారా నడుపుకోవడానికి మహిళా గ్రూపులకు ఇప్పటికే 150 బస్సులను కేటాయించాం. త్వరలో మరో 600 బస్సులను అందించనున్నాం. అవసరమైతే భవిష్యత్తులో మరిన్ని కేటాయిస్తాం. పెద్ద కార్పొరేట్ సంస్థలే నిర్వహించే వ్యాపారాల్లో సైతం మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నాం. వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తికి మహిళా సంఘాలను ప్రోత్సహించి రాష్ట్ర విద్యుత్ శాఖ ద్వారా ఒప్పందాలు చేస్తున్నాం. హైటెక్ సిటీలోని శిల్పకళా వేదికలో మహిళా సంఘాల ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునే సౌలభ్యం కల్పించాం. ఇలా మహిళలకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం" అని సీఎం రేవంత్ వివరించారు. 2014 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వరంగ బ్యాంకుల నుంచి రూ.17 లక్షల కోట్ల రుణాలను పలు కార్పొరేట్ సంస్థలు ఎగవేశాయని సీఎం తెలిపారు. వారికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకరించిందని ఆరోపించారు. బడాబాబులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు ఎగ్గొడుతుంటే.. రాష్ట్రంలోని మహిళా సంఘాలు ఎంతో క్రమశిక్షణతో రుణాలను తిరిగి చెల్లిస్తున్నారని ప్రశంసించారు. గతేడాది రూ.20 వేల కోట్ల మేరకు బ్యాంకుల నుంచి రుణాలు ఇస్తే.. ఒక్క రూపాయి ఎగవేయకుండా తిరిగి చెల్లించారని తెలిపారు. మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలు బలంగా ఉన్నాయని, పట్టణ ప్రాంతాల్లో పెద్దఎత్తున సభ్యులను ఈ సంఘాల్లో చేర్పించాలన్నారు. వి-హబ్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నామని, వరంగల్, హన్మకొండ, పెద్దపల్లి, నల్లగొండ, వికారాబాద్ జిల్లాల్లో వి-హబ్ 'విమెన్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్'లను ఏర్పాటు చేస్తున్నామని సీఎం ప్రకటించారు. ఇతర జిల్లాల్లోనూ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్ కుమార్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, పరిశ్రమల శాఖ సంచాలకులు గుర్రం మల్సూర్, వి-హబ్ సీఈవో సీత పల్లచోళ్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌తోపాటు 17సంస్థలతో వి-హబ్ ఒప్పందం కుదుర్చుకుంది.

తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు ఏర్పాటు

» సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

» భాగస్వామ్యం పంచుకోవాలని నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీకి విజ్ఞప్తి

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డును ఏర్పాటు చేయనుందని, ఇందులో భాగస్వామ్యం పంచుకోవాలని ప్రముఖ ఆర్థికశాస్త్ర నిపుణుడు, నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఇందుకు బెనర్జీ సమ్మతించారు. శనివారం బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో అభిజిత్ బెనర్జీ.. ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై చర్చించారు. శతాబ్దాల చరిత్ర ఉన్న హైదరాబాద్ విజన్‌ను, ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదరణ గురించి ముఖ్యమంత్రి ఆయనకు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి గొప్ప విజన్‌తో ముందుకు సాగుతున్నారని ఈ సందర్భంగా అభిజిత్ బెనర్జీ ప్రశంసించారు. భారత్ ఫ్యూచర్ సిటిలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, సృజనాత్మకతను భాగం చేయాలని సూచించారు. సంప్రదాయ చేతివృత్తుల వారిని ఆధునిక వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక స్వల్పకాలిక కోర్సులు నిర్వహిస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎస్ కె. రామకృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.



అభిజిత్ బెనర్జీని సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

యాసంగి ధాన్యం సేకరణలో రికార్డు

» 51.30 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు

» మూడేళ్లలోనే రికార్డు బ్రేక్: మంత్రి ఉత్తమ్

» మరో నెల వరకూ ధాన్యం కొనుగోళ్లు



హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది యాసంగిలో వరి సిరులు కురుస్తున్నాయి. 60లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 130 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందన్న అంచనాలకనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు రోజూ 1.75 లక్షల నుంచి 2 లక్షల టన్నుల ధాన్యం కాంటా పెడుతున్నారు. ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో పది లక్షల టన్నుల పైచిలుకు తూకం వేయని ధాన్యం ఉందని పౌర సరఫరాలశాఖ నివేదికలు చెబుతున్నాయి. మరో నెల పాటు ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడంతో నిర్ణీత 71లక్షల మెట్రిక్ టన్నులకు మించి ధాన్యం సేకరణ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికీ ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో వరి కోతలు సాగుతుండటంతో జూన్ మొదటి పక్షం రోజుల వరకూ ధాన్యం కొనుగోళ్లు జరిగే అవకాశాలున్నాయి. ప్రభుత్వం శనివారానికి 51.39 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుచేసింది. ఈ యాసంగిలో ఇప్పటికే 50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణతో రికార్డు బ్రేక్ చేశామన్న పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి.. ఇది గత మూడేళ్లలోనే రికార్డు అని పేర్కొన్నారు. ఈసారి 71లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తామన్నారు. ఈ ఏడాది కొత్తగా 1,311 కేంద్రాలతో మొత్తం 8,348 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ సాగుతోందని చెప్పారు. 2022-23 యాసంగి మే 15కల్లా 25.35 లక్షల మెట్రిక్ టన్నులు, 2023-24లో 32.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పౌరసరఫరాల సంస్థ సేకరించింది. కాగా, ఇప్పటివరకూ సేకరించిన ధాన్యంలో సన్న రకం 17.37 లక్షల మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 34 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటాయి. అంటే పౌరసరఫరాల సంస్థ రూ.11,913 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా, రూ.8,511 కోట్లు రైతులకు చెల్లించింది. అకాల వర్షాలతో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడుస్తోంది. తడిసిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకే కొనాలని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ ఆదేశించారు.

ఏంటీ... అంత ఖర్చవుద్దా!

మెట్రో రెండో దశ డీపీఆర్‌పై కేంద్రం సందేహాలు!

» 2028లోగా పూర్తి చేస్తే రోజుకి 7,96,000 మంది ప్రయాణిస్తారా ?

» ఆర్థిక విశ్లేషణల్లో కొన్ని అస్పష్టతలు ఉన్నాయని అభ్యంతరం

» లోపాలు సరిచేయాలని హెచ్‌ఏఎంఎల్‌కు సూచన

» అనుమతుల జారీ మరింత జాప్యం

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ పార్ట్-ఏ డీపీఆర్(డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు)కు అనుమతి రావడం మరింత ఆలస్యమయ్యేలా ఉంది. గతేడాది నవంబరు 4న కేంద్రానికి పంపిన డీపీఆర్‌కు 2, 3 నెలల్లో అనుమతి లభిస్తుందని ఆశించిన రాష్ట్ర ప్రభుత్వానికి మరికొంత కాలం ఎదురుచూపులు తప్పేలా లేవు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఏఎంఎల్) పంపిన డీపీఆర్‌లో కొన్ని సాంకేతిక లోపాలను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఎత్తిచూపడమే ఈ జాప్యానికి కారణమని తెలుస్తోంది. మెట్రో రెండో దశలో ప్రతిపాదిత 5 కారిడార్లలో కలిపి 76.4 కి.మీ మేర చేపడుతున్న మెట్రో ప్రాజెక్టుకు అసలు రూ.24,269 వేల కోట్లు ఖర్చవుతుందా ? డీపీఆర్‌లో పేర్కొన్నట్టు 2028లోగా ఆయా మార్గాల్లో 7.96 లక్షల మంది ప్రయాణిస్తారా ? అనే సందేహాలను లేవనెత్తినట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత మెట్రో రైలు రెండో దశకు శ్రీకారం చుట్టింది. ఇందులో పార్ట్-ఏ కింద నాగోల్-ఎయిర్‌పోర్టు (కారిడార్-4) 36.8 కిమీ, రాయదుర్గ్-కోకాపేట్ (కారిడార్-5) 11.6 కిమీలు, ఎంజీబీఎస్- చాంద్రాయణగుట్ట (కారిడార్-6) 7.5 కిమీ, మియాపూర్-పటాన్‌చెరు (కారిడార్-7) 13.4 కిమీ, ఎల్బీనగర్ -హయత్‌నగర్ (కారిడార్-8) 7.1 కిమీ కారిడార్లను ప్రతిపాదించారు. ఈ మేరకు హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పర్యవేక్షణలో రూపొందించిన డీపీఆర్‌ను గతేడాది నవంబరు 4న కేంద్రానికి సమర్పించారు.



కి.మీకి రూ.318కోట్ల అంచనా వ్యయం

రెండో దశ విస్తరణలో కిలోమీటరుకు నిర్మాణ అంచనా వ్యయం రూ.318 కోట్లు. పరిస్థితుల ప్రకారం ఇందులో కొంత హెచ్చుతగ్గులూ ఉంటాయని డీపీఆర్‌లో పేర్కొన్నట్టు తెలిసింది. బెంగళూరులో కిమీకి రూ.373 కోట్ల నుంచి రూ.569 కోట్ల వరకు, చెన్నైలో రూ.619 కోట్ల నుంచి రూ.756 కోట్ల వరకు, ముంబైలో రూ.543 కోట్ల నుంచి రూ.1,492 కోట్లతో పనులు చేపట్టారని.. ఎలివేటెడ్ మెట్రో, డిజైన్, ఇన్నోవేషన్‌తో హైదరాబాద్‌లో తక్కువ ఖర్చుతో మెట్రో రెండో దశ పనులు చేపట్టే అవకాశం ఉందని వివరించినట్లు సమాచారం. 2017 నుంచి 2024 అక్టోబరు వరకు మొదటి దశలోని 3 కారిడార్లలో 63.40 కోట్ల మంది ప్రయాణించారని, మెట్రో రెండో దశ 2028లోగా పూర్తి చేస్తే.. 2 దశల్లో కలిపి రోజుకు దాదాపు 10 నుంచి 12 లక్షల మంది వరకు ప్రయాణించే అవకాశం ఉందన్నారు.

కేంద్రం అడిగిన ప్రశ్నలు ఏంటంటే ?

డీపీఆర్‌లో చెప్పిన దానికి క్షేత్రస్థాయి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ అధికారులు ఇటీవల హెచ్‌ఏఎంఎల్‌కు తమ సందేహాలను కొన్ని ప్రశ్నల రూపంలో పంపినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. సాంకేతిక, ఆర్థిక విశ్లేషణల్లో కొన్ని అస్పష్టతలున్నాయని, ప్రయాణికుల ట్రాఫిక్ అంచనాలు, చూపిన ఖర్చులు సరిగా లేవని కేంద్రం పేర్కొంది. నాగోల్, ఎల్బీనగర్, మియాపూర్, చాంద్రాయణగుట్ట మార్గాల్లో భూసేకరణ సమస్యలు, రోడ్డు వెడల్పు పరిమితులను సక్రమంగా రూపొందించలేదని, డీపీఆర్ రూపకల్పనలో కేంద్ర మార్గదర్శకాలను అనుసరించలేదని అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రయాణికుల అంచనాలు అతిశయోక్తిగా ఉన్నాయని, ఖర్చు అంచనాలూ అస్పష్టంగా ఉన్నాయనీ అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. హెచ్‌ఏఎంఎల్ అధికారు లు తాము పంపిన డీపీఆర్‌లో ఒకవేళ తప్పులుంటే ఉంటే వాటిపై వివరణ ఇచ్చుకునే ప్రయత్నమూ చేస్తున్నారు. కాగా, ఇటీవల హైదరాబాద్ వచ్చిన కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నితిన్ గడ్కరీని.. మెట్రో రెండో దశ డీపీఆర్ అనుమతి విషయమై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కలిసినట్లు తెలిసింది. డీపీఆర్‌లో తమ అధికారులు అడిగిన ప్రశ్నలకు హెచ్‌ఏఎంఎల్ సరైన సమాధానాలు రాకపోవడంతో ఆలస్యం జరుగుతోందని ఆయన వారికి బదులిచ్చినట్లు సమాచారం.

పిల్లల్లో స్వీట్లు తినే అలవాటు తగ్గించండి

పాఠశాలల్లో 'సుగర్ బోర్డులు' పెట్టండి.. ప్రిన్సిపాళ్లకు సీబీఎస్ఈ ఆదేశాలు

న్యూఢిల్లీ, మే 1: మధుమేహంపై చిన్నతనం నుంచే విద్యార్థులకు అవగాహన కలిగించాలని సీబీఎస్ఈ నిర్ణయించింది. ఒకప్పుడు పెద్దలకే పరిమితమైన టైప్-2 డయాబెటిస్ ఇప్పుడు పిల్లల్లోనూ పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై పాఠశాల స్థాయి నుంచే అప్రమత్తత పాటించేలా చర్యలు తీసుకోనుంది. విద్యార్థులు పరిమితికి మించి స్వీట్లు, చక్కెర పదార్థాలు తినకుండా, శీతల పానీయాలు తాగకుండా చర్యలు తీసుకోవాలని అన్ని పాఠశాలలకు సూచించింది. పాఠశాలల్లో సుగర్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ఏ తినుబండారంలో చక్కెర ఎంత శాతం ఉందో రాయాలని సూచిస్తూ అన్ని పాఠశాలల ప్రిన్సిపాళ్లకు లేఖలు రాసింది. 4 నుంచి 10 ఏళ్లలోపు విద్యార్థులు తినే ఆహారంలో 13 శాతం చక్కెర ఉంటోంది. 11-18 ఏళ్ల పిల్లల్లో ఇది 15 శాతంగా ఉంది. అనుమతించిన పరిమితి కన్నా ఇది 5 శాతం అధికం. అందువల్ల ఏ తినుబండారంలో ఎంత చక్కెర ఉందో, అధికంగా తింటే ఎలాంటి ముప్పు ఉంటుందో బోర్డులపై రాయాలని తెలిపింది. ఈ ఆదేశాల అమలుపై జులై 15లోగా సంక్షిప్తంగా నివేదిక, ఫొటోలు పంపాలని సూచించింది.

పాక్ ఆట కట్టించేందుకిదే సరైన తరుణం: ఒవైసీ

న్యూఢిల్లీ, మే 17: పాక్ ఆట కట్టించడంతోపాటు కశ్మీరీలను అక్కున చేర్చుకోవాలని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్రానికి సలహా ఇచ్చారు. పాక్ అంతు చూసేందుకు భారత్‌కు ఇదే సరైన తరుణమని ఒవైసీ చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కశ్మీరీల మానవ హక్కులను పరిరక్షించాలని, దేశంలో ఎక్కడ కశ్మీరీ విద్యార్థులపై దాడులు జరక్కుండా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలను కోరారు. పాక్‌కన్నా ఎక్కువగా భారత్‌లో 20 కోట్ల మంది ముస్లింలున్నారని టర్కీకి గుర్తు చేశారు. భారత్‌తో టర్కీకి ఉన్న చారిత్రక సంబంధాల దృష్ట్యా పాక్‌కు మద్దతుపై పునరాలోచించుకోవాలన్నారు. ప్రపంచ దేశాలకు పాక్ ఉగ్ర కుట్రలను వివరించడానికి కేంద్రం ఎంపిక చేసిన 7 అఖిలపక్ష ఎంపీ బృందాల్లో సభ్యుడిగా ఉన్న ఒవైసీ.. ఫ్రాన్స్, బెల్జియం, జర్మనీ, ఇటలీ డెన్మార్క్ తదితర దేశాల నేతలకు పాకిస్థాన్ వక్రబుద్ధిని, దొంగ నాటకాలను తెలుపుతామని ఒవైసీ చెప్పారు. పార్టీ పరంగా బీజేపీతో విభేదిస్తామని ఉగ్రవాదులు దేశ ప్రజలను ఊచకోత కోస్తుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. భారతీయులంతా ఒకే పడవలో ప్రయాణిస్తున్నారని, పడవకు ఎవరు చిల్లుచేసినా అంతా మునిగిపోతామన్న ఒవైసీ.. ఎలాంటి ఆటుపోట్లైనా ఐకమత్యంతో ఎదుర్కొంటామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.